ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1
ప్రకాశం
జిల్లా వార్తలు
సోమవారం 20, అక్టోబరు 2025

ఆనందాల రవళి.. దీపావళి

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే ఆనందదాయకమైన పండుగ దీపావళి. ఆ రోజు వెలిగించే దీపాల ద్వారా ఇంట్లోని ప్రతికూల శక్తులు తొలగిపోయి నూతన కాంతి తీసుకొచ్చే పండుగ అని కూడా ప్రజలు నమ్ముతారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం దీపావళిని జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఒంగోలు పీవీఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో వ్యాపారులు బాణాసంచా విక్రయ దుకాణాలను ఏర్పాటుచేశారు.

7

వేగంగా స్మార్ట్ కార్డుల పంపిణీ

● జిల్లావ్యాప్తంగా 4.69 లక్షల మందికి అందజేత

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డుల పంపిణీ వేగంగా జరుగుతోంది. వారం రోజుల నుంచి 1392 రేషన్‌షాపుల పరిధిలో డీలర్లు కార్డుదారులకు ఈ స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నారు. జిలా వ్యాప్తంగా 6,51,820 రేషన్ కార్డులున్నాయి. వాటి స్థానంలో ప్రజా ప్రభుత్వం స్మార్ట్ కార్డులను ముద్రించి సరఫరా చేసింది. రేషన్ డీలర్లు కార్డుదారుల వేలిముద్రలు వేయించుకొని స్మార్ట్ కార్డులను ఇస్తున్నారు. 4,69,135 మంది కార్డుదారులకు ఆదివారం సాయంత్రానికి పంపిణీ చేశారు. మరో 1,82,685 మందికి పంపిణీ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ కూడా నాలుగైదు రోజుల్లో ముగియనుంది.

నేడు మీ కోసం రద్దు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో సోమవారం జరగాల్సిన సమస్యల పరిష్కారవేదిక (మీకోసం) కార్యక్రమం దీపావళి పండుగ సందర్భంగా రద్దు చేసినట్లు కలెక్టర్ రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు సోమవారం సెలవన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని ఆయన కోరారు. సోమవారం పోలీసు గ్రీవెన్స్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ వి.హర్షవర్ధనరాజు కూడా ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

205 తాత్కాలిక టపాసుల షాపులు

జిల్లాలో ఏర్పాటుకు అనుమతి


ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా దీపావళి క్రాకర్స్‌ను తాత్కాలికంగా విక్రయించేందుకు 205 షాపులకు ఆదివారం అనుమతి ఇచ్చారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తాత్కాలికంగా క్రాకర్స్ దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు మీసేవా కేంద్రాలు, సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. శనివారం రాత్రి 143 షాపులకు అనుమతి ఇవ్వగా ఆదివారం మరో 63 షాపులకు అనుమతి ఇచ్చారు. ఒంగోలు డివిజన్‌లో 89, కనిగిరి డివిజన్‌లో 56, మార్కాపురం డివిజన్‌లో 60 షాపులకు తాత్కాలికంగా షాపులు నిర్వహించేందుకు జిల్లా అధికారులు అనుమతి ఇచ్చారు.



ఒంగోలులో దీపాలు వెలిగిస్తున్న యువతులు



కలెక్టరేట్‌లో ముందస్తు దీపావళిలో భాగంగా చిచ్చుబుడ్డి కాలుస్తున్న జేసీ గోపాలకృష్ణ



అప్రమత్తతతోనే ఆనందం

దీపావళి పండుగ వచ్చేసింది. అందరూ పండుగ మూడ్‌లోకి వచ్చేశారు. పిల్లలు, పెద్దలు అంతా కలిసి ఆనందోత్సాహాలలో మునిగి తేలి, సంబరాలు జరుపుకునే రోజురానే వచ్చింది. అయితే పండుగ వేడుకలు అంబరాన్నంటేలా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉవ్విళ్లూరుతున్నారు. దీపావళి టపాసులు కాల్చేందుకు ఎదురు చూస్తున్న ప్రజలు వేడుకలు విషాదంగా మారకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యులు సూచిస్తున్నారు. నిర్లక్ష్యంగా బాణసంచా కాల్చవద్దని పేర్కొంటున్నారు. అప్రమత్తతే ఆనందం అని వారు వెల్లడిస్తున్నారు.

దీపావళి వేడుకలు కారాదు విషాదం
పలువురు వ్యాధిగ్రస్తులకు పొంచివున్న ముప్పు
అశ్రద్ధ చేస్తే ప్రమాదం అంటున్న వైద్యులు
జాగ్రత్తలతోనే ప్రతి ఇంటా వెలుగులు



ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దీపావళి అంటేనే కుల, మతాలకు అతీతంగా పిల్లలు, పెద్దలు, ముఖ్యంగా యువత ఎంతో ఉత్సాహంగా జరుపుకునే పండుగ. గ్రామాలలో, పట్టణాలలో సోమవారం సాయంత్రం టపాసుల మోతలు.. తారాజువ్వల వెలుగులు, ఢాం.. ఢాం.. శబ్దాలు వినిపిస్తాయి. వాటితోపాటు మరోవైపు అన్నీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పొగ నిండుకుని ఉంటుంది. టపాసుల నుంచి వెలువడే పొగతో పలువురు వ్యాధిగ్రస్తులకు ముప్పు తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. టపాసులు పేల్చడం వల్ల గాలిలో దుమ్ము, కాలుష్య కారకాలు, సాంద్రత పెరుగుతుందని, కాల్చిన తర్వాత ధూళి కణాలు, రాగి, జింక్, సోడియం, సీసం, మెగ్నీషియం, కాడ్మియం, సల్ఫర్, నైట్రోజన్ ఆక్సైడ్‌లు వంటి కాలుష్య కారకాలతో నిండిన రేణువులు చుట్టపక్కల ఉపరితలాలపై స్థిరపడతాని, ఈ అదృశ్య హానికర కణాలు పర్యావరణాన్ని ప్రభావితం చేయడంతోపాటు, ఆరోగ్యాన్ని కూడా ప్రమాదంలో పడేస్తాయని తెలియజేస్తున్నారు. ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తగు జాగ్రత్తలతో పండుగ జరుపుకోవాలని సూచిస్తున్నారు. అప్రమత్తంగా ఉండటంలోనే ఆనందం ఉందని వివరిస్తున్నారు.

తగు జాగ్రత్తలతో బాణ సంచా కాల్చాలి



- డాక్టర్ వై.సునీల్‌కిషోర్, ప్లాస్టిక్ సర్జన్

దీపావళి బాణ సంచా కాల్చేటపుడు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా టపాసులు కాల్చేటపుడు కాళ్లు, చేతులు, చర్మం కాలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. చర్మంపై గాయమైనపుడు ప్రథమ చికిత్సగా చర్మంపై మంట తగ్గేవరకు చల్లని నీరును గాయంపై ధారగా పోయాలి. అనంతరం వైద్యుడిని సంప్రదించి తగు చికిత్స తీసుకోవాలి. గాయం అయినప్పుడు పేస్టులు పూయడం, ఇంకు రుద్దడం, పసుపు పూయడం వంటి పనులు చేయకూడదు. గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న చర్మవైద్యులు, ప్లాస్టిక్ సర్జన్‌ను సంప్రదించాలి. పొగ ఎక్కువగా ఉండే టపాసులు కాల్చడం వలన శ్వాశకోశ వ్యాధులు వస్తాయి. పెద్ద పెద్ద శబ్దాలు వచ్చే టపాసులు కాల్చడం వలన చెవి, కంటి సమస్యలు వస్తాయి. టపాసులు కాల్చేటపుడు కళ్లజోడు పెట్టుకుని కాల్చితే చాలా ప్రయోజనకరం.

పొగను అశ్రద్ధ చేస్తే వచ్చే వ్యాధులు

- కళ్ల మంటలు, ఊపిరితిత్తుల్లో నెమ్ము
- గొంతు వాపు, జలుబు, తలనొప్పి, ఛాతీలో బరువు
- శ్వాస కోశ ఇబ్బందులు
- టపాసుల పొగ పీల్చాక పది, పదిహేను నిమిషాల్లో సల్ఫర్ డై ఆక్సైడ్ ప్రభావం చూపుతుంది.
- మానసిక, నరాల సమస్యలు
- రక్త సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ కారక వ్యాధులు
- గుండె జబ్బులు, నిద్రలేమి, వినికిడి శక్తి తగ్గిపోవడం, హై బీపీ



ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- టపాసులు కాల్చేటపుడు శరీరానికి బిగుతుగా ఉండే దుస్తులు ధరించరాదు
- శిల్క్ దుస్తులు ధరించరాదు, కాటన్ దుస్తులు మాత్రమే వేసుకోవాలి
- పేలుడు పదార్థాలు కాల్చేటపుడు పెద్దలు, చిన్నారుల దగ్గరే ఉండాలి
- సగం కాలిన టపాసులు వద్దకు వెళ్లకూడదు
- ఇరుకుగా ఉండే నివాసాలు, పూరిగుడిసెలు మధ్యన టపాసులు కాల్చరాదు
- టపాకాయలు పేల్చేటపుడు నీరు, ఇసుకను దగ్గర ఉంచుకోవాలి
- తారాజువ్వలను నిలువుగా కాల్చాలి
- చేతుల్లో టపాకాయలను కాల్చరాదు.
- చిచ్చుబుడ్లు చేతిలో ఉంచి కాల్చరాదు
- నివాసాల్లో టపాసుల నిల్వ ఉంచినపుడు పిల్లలకు అందకుండా ఉంచాలి
- టపాసులను పొడవాటి సాంబ్రాణి కడ్డీలతో అంటించడం ఎంతో మేలు
- టపాసులు కాల్చేటపుడు మూతికి గుడ్డ కట్టుకోవాలి

జిల్లాలో 8.2 మి.మీ.వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 8.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. చీమకుర్తిలో 66.6, మద్దిపాడులో 59.2, పీసీపల్లిలో 31.2, వెలిగండ్లలో 30.0, పామూరులో 25.2, కనిగిరిలో 23.6, నాగులుప్పలపాడులో 10.8, సింగరాయకొండలో 10.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. పలు ఇతర మండలాల్లో కొద్ది పాటి జల్లులు పడ్డాయి.

దీపావళిని ప్రశాంతంగా జరుపుకోవాలి

● ఎస్పీ హర్షవర్ధనరాజు

ఒంగోలు క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):దీపావళి పండుగను జిల్లా ప్రజలు సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని ఎస్పీవి.హర్షవర్ధనరాజు కోరారు. ఈసందర్భంగా జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా అక్రమంగా బాణసంచా విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు దీపావళి టపాసులు కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. దీపావళి రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగితే 101,100,112 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్పీ సూచించారు.ఒకా వాట్సప్ నంబరు 9121102266కు తెలియజేయాలని కోరారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	250.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	260.00



శ్రీ ప్రతిభా కళాశాలలో కేఎల్ యూనివర్శిటీ మెరిట్ స్కాలర్‌షిప్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నవంబరు 14 నుంచి 'ప్రతిభా' పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీ విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు క్యాంపస్‌లలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ప్రతిభా పరీక్షలను నవంబరు 14నుంచి 18వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కేఎల్ యూనివర్శిటీ అడ్మిషన్ విభాగం డైరెక్టర్ డాక్టర్ జే శ్రీనివాసరావు తెలిపారు. ఒంగోలు సమీపంలోని శ్రీ ప్రతిభా కళాశాల ఆవరణలో ఆదివారం 'భవిష్యత్‌కు బంగారు బాట- కేఎల్ యూనివర్శిటీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ పరీక్షలో ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ. 100 కోట్ల మేర మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు తెలిపారు. కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రపంచ సాంకేతిక సవాళ్లకు అనుగుణంగా సమగ్ర నైపుణ్యాభివృద్ధి దిశగా విద్యా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. గడిచిన 20 ఏళ్లుగా ప్రతిభ ఆధారితంగా విద్యార్థి నైపుణ్యం మేరకు సంవత్సరానికి రూ. 40నుంచి 70 లక్షల వరకు అత్యధిక వేతనాలు పొందిన వారు కూడా ఉన్నారని తెలిపారు. అనంతరం మెరిట్ స్కాలర్‌షిప్ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభా విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్, కే ఎల్ యూనివర్శిటీ ప్రతినిధులు డాక్టర్ జేవీ షణ్ముకకుమార్, శివరామకృష్ణ, కే రాంబాబు, పీ అంజనేయ వరప్రసాదరావు, ఆర్‌శేఖర్‌బాబు, ఎ.మస్తాన్‌వలి, షేక్ నయూబ్, పార్థసారథి, కల్యాణ్, చంద్రశేఖర్, పవిత్ర ఉన్నారు.



బస్సుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

పాకల బీచ్‌కు ప్రత్యేక బస్సులు ప్రారంభం

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో పాకల బీచ్ వద్దకు ఏర్పాటు చేసిన బస్సులను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ మేరకు ఒంగోలులో నగరపాలక సంస్థ కమిషనర్ కే. వెంకటేశ్వరరావు, కనిగిరిలో మునిసిపల్ చైర్మన్ షేక్ గఫూర్, మార్కాపురంలో సీఐలు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డిపో మేనేజర్ ఘట్టమనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ సింగరాయకొండకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పాకల బీచ్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రకాశం రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు ప్రతి ఆదివారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఈ బస్సులలో మహిళలకు స్త్రీ శక్తి పథకం అమలు అవుతుందని వివరించారు.

సీఎం సానుకూల దృక్పథం అభినందనీయం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూల దృక్పథంతో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం అభిందనీయమని ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు అన్నారు. స్థానిక ఎన్‌జీవో భవన్‌లో ఆదివారం జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీపావళి కానుకగా నవంబరు నెల నుంచి ఒక డీఎను విడుదల చేస్తామని ప్రకటించడం శుభపరిణామన్నారు. మహిళా ఉద్యోగులకు వారి సర్వీసు మొత్తంలో ఎప్పుడైనా చైల్డ్ కేర్‌లీవ్ వినియోగించుకునే అవకాశం కల్పించడంతో పాటు త్వరలోనే మంచి పీఆర్సీ ఇస్తామని చెప్పడంపై ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తం అవుతుందని తెలిపారు. రానున్న కాలంలో ఉద్యోగుల సమస్యలన్నీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ నేతృత్వంలో ప్రభుత్వం సామరస్యధోరణితో పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఉద్యోగుల హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ కోశాధికారి శివకుమార్, ప్రతినిధులు ఎం.వెంకటేశ్వరరావు, తోట శ్రీనివాస్, రామాంజనేయులు, చిరంజీవిరావు, కృష్ణకిషోర్, ఏడుకొండలు, షేక మోమిన్, విజయకుమార్, కొత్తపల్లి మంజేష్, షేక్ మగ్దుం షరీఫ్, పి. మాధవి, కోటేశ్వరమ్మ, సీహెచ్ శిరీష తదితరులు ఉన్నారు.

పోలీసు అమరవీరులకు వందనం

రేపు సంస్మరణ దినం
ఇప్పటివరకు అమరులైన ఏడుగురు పోలీసులు
పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ప్రత్యేక నివాళి

పోలీసు అంటే త్యాగానికి నిరతి.... ప్రజలకు భద్రత కల్పిస్తూఅహరా కాసేది పోలీస్.. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, కంటి మీద కునుకు లేకుండా విధులు నిర్వహించేది పోలీస్.. సంఘవిద్రోహ శక్తుల పాలిట సింహస్వప్నంలా మెలుగుతూ తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి శాంతిభద్రతలకు రక్షణ కల్పించేది పోలీస్.. విధి నిర్వహణలో ప్రజల కోసం నేలకొరిగి తమత్యాగాన్ని చాటి చెప్పేది పోలీస్.... అలాంటి పోలీసు శాఖలో ఖాకీ యూనిఫాం వేసుకొని పనిచేయడం జాతి గర్వించదగ్గ విషయం.

ఒంగోలు క్రైం,అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం ప్రాణాలు అర్పిస్తున్న పోలీసు శాఖలో పని చేస్తూ విధినిర్వహణలో నేలకొరిగిన అమరులకు సలాం చేద్దాం .1995 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఏడుగురు పోలీసులు విధినిర్వహణలో అసువులు బాశారు. వారందరికీ పేరు పేరున సెల్యూట్ చేస్తూ మంగళవారం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ వి.హర్షవర్ధనరాజు నేతృత్వంలో ప్రత్యేక నివాళులు అర్పించనున్నారు.

పోలీసు అమరవీరుల దినోత్సవం

దేశంలో ప్రతి సంవత్సరం ఆక్టోబరు 21న పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తారు. విధినిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ ఈ కార్యక్రమం జరుపుతారు. 1959 అక్టోబర్ 21న లడఖ్ ప్రాంతంలో హాట్‌స్ప్రింగ్ వద్ద చైనాసైనికులు జరిపిన దాడిలో పదిమంది భారతీయ పోలీసు బలగం వీరోచిత పోరాటం చేసి వీరమరణం పొందారు. వారి త్యాగాలకు గుర్తుగా అప్పటి నుంచి పోలీసు అమరవీరల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

విధి నిర్వహణలో అసువులు బాసిన అమర పోలీసులు

శత్రువు తూటా గుండెలో దిగినా కర్తవ్యంను విస్మరించకుండా ఎదురుకాల్పులు జరిపిన పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ సీవీ రత్నం 1995 డిసెంబరు 1న ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో ఒంగోలు ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి వద్ద పీఎస్‌వోగా ఉన్న రత్నం నక్సలైట్ల తూటాకు బలయ్యాడు. సుబ్బారామిరెడ్డిని కిడ్నాప్ చేసేందుకు వచ్చిన నక్సలైట్లపై ఎదురు తిరిగిన రత్నం వీరమరణం పొందారు.

- 2001జూన్ 3న పుల్లలచెరువు మండలం మర్రివేములలో ప్రభుత్వం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో విధులు నిర్వహించి వెళుతుండగా నక్సలైట్లు జరిపిన కాల్పులలో ఏఎస్సై కేప్రశాంతరావు ఆసువులు బాశారు.
- 2008 జూన్ 29 న బలిమెలలో పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పులలో జూనియర్ కమాండో కొండపి మండలం పెరిదేపికి చెందిన మోటా ఆంజనేయులు అమరుడయ్యారు.
- గుడ్లూరు మండలం రామాయపట్నంనకు చెందిన లీలాశంకర్ బలిమెల ఘట... వెూటా ఆంజనేయులు తో ప్రాణాలు కోల్పోయారు.
- 2009 సెప్టెంబర్ 2న ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కుప్ప కూలింది. ఆయన వద్ద భద్రతాధికారిగా పనిచేసిన ఒంగోలుకు చెందిన అద్దంకి సాల్మన్‌కేరీ వెస్లీ దుర్మరణం చెందారు.
- 2010 మే 5న లైలా తుఫాన్ సందర్భంగా అద్దంకిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మార్టూరు మండలం కోనంకికి చెందిన షేక్ మహమ్మద్ రఫీ విధినిర్వహణలో ఉండగా అద్దంకి నల్లవాగు ఉధృతిలో ఆర్టీసీ కండక్టర్ యానాదిరావు కొట్టుకుపోతున్నాడు. ఆయనను కాపాడేందుకు వాగులోకి దూకిన మహమ్మద్ రఫీ ,యానాదిరావును కాపాడి తనప్రాణాలు కోల్పోయారు.
- 2023 మే 24న చీమకుర్తికి చెందిన పవన్ కుమార్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అమరావతిలోని తుళ్లూరు వద్ద విధులు నిర్వహిస్తూ పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయారు.

రేపు అమరజవాన్ స్థూపం వద్ద ప్రత్యేక నివాళి

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ హర్షవర్ధనరాజు నేతృతంలో పోలీసు అమరవీరులకు ప్రత్యేక నివాళి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వీరజవాన్ స్థూపం వద్ద విధినిర్వహణలో అమరులైన పోలీసు కుటుంబాలను సత్కరించనున్నారు. అదే సమయంలో పోలీసు అమరవీరులకు ఘననివాళి అర్పించనున్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో అమరజవాన్ల కోసం ఏర్పాటు చేసిన స్థూపం

అనస్థీషియాలజిస్ట్స్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలజిస్ట్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. స్థానిక కేబీ రెసిడెన్సీలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఒంగోలుకు చెందిన డాక్టర్ పి. దుర్గా ప్రసాదరావు ఎన్నికయ్యారు. అలాగే ప్రెసిడెంట్ ఎలక్ట్‌గా డాక్టర్ అచ్యుతరామయ్య, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ డీవీ. మహేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్లు రాజశేఖర్ రెడ్డి, పద్మజ, రాకేష్, వినీల, ఉదయ్ శంకర్, అనిల్ కుమార్‌లు ఎన్నికయ్యారు. పూర్వ అధ్యక్షుడు డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాసరావు నుంచి బాధ్యతలు తీసుకున్న అనంతరం నూతన కార్యవర్గం పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ హాస్పిటల్స్‌లో, ఆపరేషన్ థియేటర్‌లో, ఇంటెన్సివ్ కేర్‌యూనిట్‌లలో పేషెంట్ సేఫ్టీ కొరకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ వినయ్ కుమార్, సెక్రటరీ డాక్టర్ ద్వివ, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మోహన్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ శ్రీనివాస్ యాదవ్‌తోపాటు, పూర్వపు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కుచేల బాబు, ఒంగోలు శాఖ అధ్యక్షుడు డాక్టర్ చలపతి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ రజని, సెక్రటరీ డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇండియా సొసైటీ ఆఫ్ అనస్థీయాలజిస్ట్ (ఏపీ ఐఎస్ఏ)లోగోను ఆవిష్కరించారు.

కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు ఆదివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆనందోత్సాహాలతో ఈ పండుగ జరుపుకోవాలని, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. బాణసంచా కాల్చే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అడ్డదారుల్లో గ్రానైట్ అక్రమ రవాణా

నిబంధనలకు విరుద్ధంగా తరలింపు
కుంగిపోతున్న గ్రామీణ రహదారులు
ఏఎంఆర్ సంస్థ రంగంలోకి వస్తే అడ్డుకట్టపడుతుందని ఓనర్ల ఎత్తు
పట్టని అధికార యంత్రాంగం

నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ యజమానులు అడ్డదారుల్లో ముడి రాళ్లను అక్రమంగా తరలిస్తున్నారు. భారీవాహనాల్లో అధిక లోడుతో వెళ్తున్న వాహనాలతో గ్రామాల్లోని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వాహనాల నుంచి ఎప్పుడు రాయి కిందపడుతుందో తెలియనంత వేగంగా వెళుతున్నాయి. పైగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వేసిన తారురోడ్లు సైతం అధిక లోడు వాహనాల తాకిడితో దెబ్బతింటున్నాయి. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకున్నట్లుగా సీనరేజీ వసూలుకు ఏఎంఆర్ సంస్థ రాకముందే క్వారీల నుంచి ముడి రాళ్లను యజమానులు గుళ్లాపల్లిలోని ఫ్యాక్టరీలకు తరలించి నిల్వ చేసుకుంటున్నారు.



పరిమితికి మించిన గ్రానైట్ రాళ్లతో నేకునంబాదు నుంచి దొడ్డవరం వైపు వెళ్తున్న టిప్పర్

చీమకుర్తి,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): రామతీర్థం పరిసరప్రాంతాల్లో విస్తరించిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ క్వారీలనుంచి ముడిరాయిని ఇష్టారీతిన బిల్లులు లేకుండా అడ్డదారుల్లో గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌కు తరలిస్తున్నారు. దీపావళి పండగ తర్వాత సీనరేజి వసూలు హక్కులు పొందిన ఏఎంఆర్ సంస్థ రంగంలోకి వస్తే తమ అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని భావించిన గ్రానైట్ యజమానులు దీపం ఉండగానే ఇళ్ల చక్కదిద్దుకుందామనే ఆలోచనతో ముడిరాళ్లను ముందస్తుగా తమ ఫ్యాక్టరీల్లో ప్రోదిచేసుకుంటున్నారు.ఈ క్రమంలో ఈ అక్రమ రవాణాకు ఒడిగడుతున్నారు.



భారీ వాహనాల తాకిడితో గుంతలు పడిన ఇటీవల వేసిన తారు రోడ్డు

ధ్వంసం అవుతున్న రహదారులు...

రామతీర్థం నుంచి గ్రానైట్ ముడిరాళ్లను అడ్డదారిలో అధికారులు ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల నుంచి తప్పించుకోవటానికి పల్లామల్లి, నేకునంబాదు, దొడ్డవరం, వెల్లంపల్లి మీదుగా గ్రోత్‌సెంటర్‌కు భారీ ఎత్తున ఓవర్‌లోడుతో విచ్చలవిడిగా, ప్రమాదభరితంగా రవాణా చేస్తున్నారు.నేకునంబాదు నుంచి దొడ్డవరంకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతనంగా బీటీ రహదారిని కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించింది. ఇవుడు ప్రమాదకరంగా భారీ లోడుతో వెళ్తున్న వాహనాల వలన రహదారి పలుచోట్ల ఛిద్రం అయ్యింది.రహదారి నిర్మించిన సంతోషం నెలలు కాకముందే ఆవిరయ్యింది. ఇప్పటికే పల్లామల్లి తదితర ప్రాంతాల్లో నిర్మించిన రహదారులు అడ్డదిడ్డ రవాణాతో ధ్వంసమయ్యాయి.ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవటం గమనార్హం.

ఏఎంఆర్ వస్తే తమ ఆటలు సాగవని...

అక్టోబరు ఒకటో తేదీనుంచి గ్రానైట్ ముడిరాళ్ల సీనరేజి వసూలు హక్కులను టెండర్ ద్వారా ఏఎంఆర్ సంస్థ దక్కించుకుంది.గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్లు వీరి రాకను వ్యతిరేకిస్తూ దాదాపు 14రోజులు సమ్మె చేయటం తదుపరి మంత్రులు,ఎమ్మెల్యేలు ఇచ్చిన స్పష్టమైన హామీ మేరకు సమ్మె విరమించి ఫ్యాక్టరీలను నడుపుతున్నారు.సీనరేజి హక్కులు పొందిన ఏఎంఆర్ సంస్థ దీపావళి తర్వాత ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొని వసూలు కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఈ సంస్థ ఇప్పటికే రాళ్ల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే విధంగా పలు చర్యలు చేపట్టింది.ప్రతి క్వారీ ఎదుట కంటైనర్ ఏర్పాటుచేసి దానిలో సీసీ కెమెరాలు,అనుక్షణం రవాణాని పర్యవేక్షించేవిధంగా ఉద్యోగులను నియమించింది.వీరి కళ్లుగప్పి బిల్లులు లేకుండా ముడిరాళ్లను క్వారీలనుంచి బయటకు తరలించే అవకాశం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. ఇదంతా గమనించిన ఓనర్లు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా భారీ స్థాయిలో రాళ్లను తరలిస్తున్నారు. ఇదంతా తమకు పట్టనట్లు మైన్స్ అధికారులు వ్యవహరిస్తుండటంతో గ్రానైట్ ఓనర్లకు అక్రమ రవాణా వరంగా మారింది.

మృతదేహం ఆచూకీ లభ్యం

● ఊపిరి పీల్చుకున్న పోలీసులు

మార్టూరు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఇసుకదర్శి నుంచి వలపర్ల వెళ్లే మట్టిరోడ్డులో బావిలో అనుమానస్పదంగా మృతిచెందిన వ్యక్తి వివరాలను సీఐ ఎం.శేషగిరిరావు వివరించారు. మండలంలోని ఇసుకదర్శి గ్రామానికి చెందిన మారెళ్ల శ్రీనివాసరావుగా మృతుని కుటుంబసభ్యులు గుర్తించారన్నారు. ఆయనకు భార్య రేణుక, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలకు వివాహాలు పూర్తిచేశాడు. గ్రామంలో సొంతపొలంలేని ఆయన కౌలుకు పొలం తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. తరచూ మద్యం సేవించే అలవాటు ఉన్న శ్రీనివాసరావు, తరచూ ఇంటి నుంచి బయటకు వెళ్లి కొన్నిరోజుల తర్వాత ఇంటికి వచ్చేవాడన్నారు. అదేవిధంగా ఈ నెల 12వ తేదీ భోజనం చేసి ఇంటి నుంచి బయటకు వెళ్లిన తర్వాత కనిపించలేదన్నారు. కాని పోలీసులు శనివారం బావిలో నుండి మృతదేహాన్ని బయటకు తీసిన తర్వాత శ్రీనివాసరావును గుర్తించినట్లు తెలిపారు. కొంత అప్పులు,కుమారుని కి కొంతమతిస్థిమితం లేని కారణంగా శ్రీనివాసరావు ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని మృతుని బంధువులు చెబుతున్నారు.పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయడం, మృతునిది హత్యా, ఆత్మహత్యా అని పోలీసులు సందిగ్దావస్థలో ఉన్న తరుణంలో మృతుడి ఆచూకీ లభించడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.కోనంకి రెవెన్యూ పరిధిలోని బావిలో మృతదేహం లభ్యం కావడంతో, వితఃర్వో గుమ్మడి నాగు ఫిర్యాదు మేరకు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేశారు.



తగ్గిన జీఎస్టీతో..
ప్రజల జీవితాల్లో దీపావళి వెలుగులు : జేసీ

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): తగ్గిన జీఎస్టీ ధరలతో ప్రజల జీవితాలలో మరిన్ని దీపావళి వెలుగులు నింపుతాయని జేసీ గోపాలకృష్ణ పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ ప్రచార ముగింపు కార్యక్రమం ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో ఘనంగా జరిగింది. జీఎస్టీశాఖ డిప్యూటీ కమిషనర్ సత్యప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన జేసీ మాట్లాడుతూ నూతన జీఎస్టీతో పలు రకాల వస్తువులకు ధరలు గణనీయంగా తగ్గాయన్నారు. దసరా శరవన్నరాత్రులు ప్రారంభం నుంచి దీపావళి పండగ వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ రూపాల్లో జీఎస్టీకి సంబంధించిన అవగాహన కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం నిర్వహించిందని ఆయన చెప్పారు. కాగా ఆయా కార్యక్రమాలు ముగింపు సందర్భంగా ప్రకాశంభవనం వద్ద అధికారులు, జేసీ గోపాలకృష్ణ బాణసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, డీపీవో శ్రీనివాసరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగులతో కలిసి క్రాకర్స్‌ను కాలుస్తున్న జేసీ గోపాలకృష్ణ

ప్రజాప్రతినిధుల దీపావళి శుభాకాంక్షలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి భారతీయ సంస్కృతిక ప్రతీకయే దీపావళి పండుగ అని, ప్రతిఇంటా వెలుగులతో శ్రీలక్ష్మీదేవి అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజించి అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

- జిల్లా ప్రజలకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

- దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని మాజీ శిద్దా రాఘవరావు ఆకాంక్షించారు.



ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సురేష్‌బాబు

నాగులుప్పలపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కొంజేటి సురేష్‌బాబు ఎన్నికయ్యారు. విజయవాడలోని సీకే కన్వెన్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలలో సంఘం నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శిగా కొంజేటి సురేష్‌బాబు, కమిటీ సభ్యులుగా అమరా వేణులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన కొంజేటి సురేష్ బాబు, కమిటీ సభ్యులు అమరా వేణులను రాష్ట్ర మంత్రి టీజీ.భరత్, మాజీ మంత్రి టీజీ.వెంకటేష్, పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు.


సురేష్‌బాబును అభినందిస్తున్న నాయకులు






ఆటో బోల్తా.. ఐదుగురికి తీవ్రగాయాలు

దొనకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి ఐదుగురు తీవ్ర గాయాలపాలైన సంఘటన మండలంలోని కొచ్చెర్లకోట గ్రామ సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని నారపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన 15 మంది తిరుపతి దైవదర్శనం చేసుకొని తిరిగి శనివారం రాత్రి మార్కాపురంలో బస్సు దిగారు. అక్కడ నుంచి స్వగ్రామమైన నారపురెడ్డిపల్లెకు ఆటో మాట్లాడుకొని బయలుదేరారు. మరో పది నిమిషాల్లో గ్రామం చేరుతుందనగా రోడ్డుకు అడ్డంగా పంది రావటంతో ఢీకొని ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు, ముగ్గురు పెద్దలు తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 సిబ్బంది మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరుకు తరలించారు. ఎస్‌ఐ త్యాగరాజు కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదానికి గురైన ఆటో





అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

● కుటుంబసభ్యులను పరామర్శించిన మంత్రి రవికుమార్

మేదరమెట్ల, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : వరుసగా వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పులబాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని దైవాలరావూరుకు చెందిన చిట్టినేని బాబూరావు (44) వ్యవసాయంలో నష్టం రావడంతో ఈ నెల 16న ఒంగోలు సమీపంలో రైలు కిందపడి ఆత్మహ్యత చేసుకన్నాడు. కొంత పొలం కౌలుకు తీసు కొని సాగుచేసి నష్టాలు రావడంతో ఆందోళనకు గురైన బాబూరావు ఆత్మహత్య చేసుకోవాలనే తీవ్రమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇంచుమించు రూ.40లక్షల వరకు ఆయనకు అప్పులు ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. బాబూరావుకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామార్శించి ఓదార్చారు. రైతు కుంటుబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఆయన వెంట సొసైటీ అధ్యక్షుడు మద్దినేని రాఘస్వామి, మాజీ సర్పంచ్ చెన్నుపాటి హరిబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు ముమ్మన నరసింహారావు, బాచిన బాలకోటయ్య, మద్దినేని శ్రీనివాసరావు, ముద్దన సుబ్బారావు వజ్జా వేణు ఉన్నారు.


కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

శాలివాహనులు ఐక్యంగా ఉండాలి : చైర్మన్

దర్శి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) శాలివాహనులు ఐక్యంగా ముందుకు సాగి అభివృద్ధి పథంలో పయనించాలని కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ పి.ఈశ్వర్ అన్నారు. దర్శిలో ఆదివారం జరిగిన నియోజకవ ర్గస్థాయి శాలివాహనుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. శాలివాహనుల అభివృద్ధికి శక్తివంచలేకుండా కృషి చేస్తానన్నారు. దర్శి పట్టణానికి చెందిన మాడపాకుల శ్రీనివాసులు రాష్ట్ర కుమ్మర కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, నాయకులు కె.నాగేశ్వరరావు, పి.శ్రీనివాసులు, అమరసింహం, సంఘ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ ఈశ్వర్





కెనరా బ్యాంక్ Canara Bank

సింగరాయకొండ బ్రాంచ్
డి నెం.3-166, ట్రంక్ రోడ్డు, సింగరాయకొండ, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523101.

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం **కెనరా బ్యాంక్, సింగరాయకొండ బ్రాంచ్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత : శ్రీ స్వర్ణ హరి బాబు, తండ్రి : ఎస్. సుబ్బా రావు** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము **రూ. 33,23,305.68/- (అక్షరాల ముప్పై మూడు లక్షల ఇరవై మూడు వేల మూడు వందల ఐదు రూపాయల అరవై ఎనిమిది పైసలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తంను సదరు నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా **తేది.18.06.2025 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని తేది **17.10.2025న స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీత మరియు ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత, హామీదారు మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్** వారికి చెల్లించవలసిన బకాయి **రూ.34,97,550.70/- (అక్షరాల ముప్పై నాలుగు లక్షల తొంభై ఏడు వేల ఐదు వందల యాభై రూపాయల డెబ్బై పైసలు మాత్రమే)** మరియు **తేది.01.10.2025** నుండి వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:

1) ప్రకాశం జిల్లా, జరుగుమల్లి మండలం, నందనవనం వద్ద డోర్ నెం.2-83, సర్వే నెం.306/1 నందు విస్తీర్ణం 72.50 చ॥గ॥లలోని భూమి మరియు భవనం. హద్దులు : **తూర్పు** : బజార్, **పడమర** : రోడ్డు, **ఉత్తరం** : స్వర్ణ వెంకట సుబ్బయ్య గారికి చెందిన స్థలం, **దక్షిణం** : స్వర్ణ లక్ష్మీ నరసింహం గారికి చెందిన స్థలం.

2) ప్రకాశం జిల్లా, జరుగుమల్లి మండలం, నందనవనం వద్ద సర్వే నెం.306/1 నందు విస్తీర్ణం 85 చ॥గ॥లలోని భూమి మరియు భవనం. హద్దులు : **తూర్పు** : స్వర్ణ సుబ్బారావు గారికి చెందిన భూమి, **పడమర** : బజార్, **ఉత్తరం** : ఈదర వెంకట సుబ్బయ్య గారికి చెందిన భూమి, **దక్షిణం** : ఈదర సుబ్బారావు గారికి చెందిన భూమి.

తేది: 17.10.2025, ప్రదేశం: సింగరాయకొండ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఆనందాల రవళి దీపావళి !

- నేడే దీపావళి పండుగ
- టపాసులు కాల్చి ఆనందించనున్న చిన్నా, పెద్దా
- భారీగా పెరిగిన బాణసంచా ధరలు
- ఆన్‌లైన్ అమ్మకాలకు గిరాకీ

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగ దీపావళి. అదేవిధంగా ఆ రోజు వెలిగించే దీపాల ద్వారా ఇంట్లోని ప్రతికూల శక్తులను తొలగించి నూతన వెలుగులు తీసుకొచ్చే పండుగ అని కూడా ప్రజలు నమ్ముతారు. హిందువులతోపాటు జైనులు, బౌద్ధులు, సిక్కులు వంటి కొన్ని ఇతర మతాల వారు కూడా ఈ పండుగను జరుపుకుంటారు. ఆశ్వీయుజ మాసం చివరిరోజైన అమావాస్య రోజున ప్రతి సంవత్సరం దీపావళిని జరుపుకోవటం ఆనవాయితీ. ఇక జిల్లావ్యాప్తంగా ప్రజలు సోమవారం దీపావళి పండుగను జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం టపాసులతో పాటు పూలు, పండ్లు, ఇతర పూజా సామగ్రిని ప్రజలు కొనుగోలు చేయటంతో జిల్లాలోని ప్రధాన పట్టణాలు, జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో వ్యాపార కూడళ్లు సందడిగా మారాయి. మరోవైపు ఒంగోలు పీవీఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో బాణాసంచా విక్రయ దుకాణాలను ఏర్పాటుచేశారు. అయితే గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది బాణసంచా ధరలు రెట్టింపునకు పైగా పెరిగాయి. దీంతో ప్రజలు వీటిని కొనటానికి వెనకడుగు వేస్తున్నప్పటికీ వచ్చేవారు కూడా ఖర్చుకు భయపడి కొద్దిమొత్తంలోనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో తాము పెట్టిన పెట్టుబడి సైతం వస్తుందా రాదా అనే సందేహంలో దుకాణాల వారు ఉన్నారు. మరో వైపు బాణసంచా విక్రయ కేంద్రాల దగ్గర ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లా పోలీస్, ఫైర్ శాఖల వారు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

నరకాసుర సంహారం..

ఇక ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడి భార్య సత్యభామ నరకాసురుడనే రాక్షసుడిని సంహరించటంతో ఆ మరునాడు ప్రజలు ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకున్నారుఢ రాక్షసుడు పెట్టే బాధల వల్ల తమ జీవితాల్లో అలుముకున్న చీకట్లు తొలగిపోయాయనే దానికి సంకేతంగా దీపాలు వెలింగించారని, దీపాలను వరుసగా ఏర్పాటుచేయటంతో దానికి దీపావళి అనే పేరు వచ్చిందని పురాణాలు పేర్కొటున్నాయి. అప్పటి నుంచి ఆశ్వీయుజ చతుర్దశిని నరక చతుర్దశిగా, మరుసటి రోజైన అమావాస్యను దీపావళిగా ప్రజలు అనాదిగా జరుపుకుంటున్నారు.

భారీగా పెరిగిన టపాసుల ధరలు



పీవీఆర్ మైదానంలో వర్షపునీటిలో ఏర్పాటు చేసిన దుకాణాలు

దీపావళి పండుగ అనగానే ప్రతి ఒక్కరికీ గుర్తుకు వచ్చేది టపాసులు. వయసుతో సంబంధం లేకుండా చిన్నా, పెద్దా



ఒంగోలులో టపాసులను కొనుగోలు చేస్తున్న ప్రజలు

అందరూ ఆ రోజు టపాసులు కాలుస్తూ హుషారుగా గడుపుతారు. కొన్నేళ్ల కిందటి వరకు మతాబులు, చిచ్చు బుడ్లు వంటి కొన్ని రకాల టపాసులను యువకులు తమ ఇళ్లవద్దే సొంతంగా తయారు చేసుకునేవారు. అయితే క్రమేపీ మారిన జీవన విధానంతో వాటిని సైతం ప్రస్తుతం కొనుగోలు చేస్తున్నారు. ఇక ఈ సంవత్సరం టపాసుల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. కాకరపువ్వొత్తుల ధరలు ఒక్కో బాక్సుకు సైజును బట్టి రూ.100 నుంచి రూ.250 వరకు పలుకుతుండగా, చిచ్చుబుడ్లు కూడా వాటి సైజును బట్టి 10 ఉండే బాక్సు ధర రూ.250 నుంచి రూ.1500 వరకు పలుకున్నది. ఈ విధంగా అన్ని టపాసుల ధరకు గత ఏడాదితో పోలిస్తే రెట్టింపు పలుకుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. దీంతో ప్రజలు టపాసుల కొనుగోలుకు భయపడుతున్నప్పటికీ, దీపావళి అంటే వాటిని కాల్చటం తప్పనిసరి కనుక కొద్ది మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. ఇక స్థానికంగా ధరలు ఈ విధంగా ఉంటే శివకాశి నుంచి తయారీదారులు ఆన్‌లైన్ ద్వారా సరఫరా చేసే టపాసుల ధరలు కొంత తక్కువగా ఉండటంతో అనేకమంది ఆన్‌లైన్ ద్వారా ముందుగానే కొనుగోలు చేశారు.

పటిష్ట భద్రతా చర్యలు



టపాసుల దుకాణాలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

టపాసులను కొనుగోలు చేయటానికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ నియంత్రించటం వంటి చర్యలు జిల్లా పోలీసు శాఖ చేపట్టారు. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే తక్షణమే అదుపు చేసేవిధంగా జిల్లా అగ్నిమాపక శాఖ చర్యలు చేపట్టింది.

వాతావరణంతో బెంబేలు

ఒంగోలు నగరంలో ఆదివారం వాతావరణం చిరుజల్లులతో ఉండటంతో టపాసుల వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. జల్లుల కారణంగా అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేకపోవటం, సోమవారం కూడా ఇదేవిధంగా ఉంటే తాము పెట్టిన పెట్టుబడి సైతం రాదని వారు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా ఇటువంటి వాతావరణానికి టపాసులు ఎంతవరకు కాలుతాయో అనే సందేహంతో ప్రజలు సైతం ఎక్కువగా కొనటానికి ముందుకు రావట్లేదు.

బాణసంచా విక్రయకేంద్రాల పరిశీలన



దుకాణదారులతో మాట్లాడుతున్న డీఆర్వో చిన ఓబులేశు

ఒంగోలు(రూరల్), అక్టోబరు19 (ఆంధ్ర జ్యోతి):ఒంగోలులోని పీవీఆర్ ఉన్నత పాఠశాలలో మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ కేంద్రాలను ఆదివారం రాత్రి డీఆర్వో చినఓబులేశు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దుకాణాదారులతో మాట్లాడుతూ సరైన ధరలకు ప్రజలకు బాణసంచా అమ్మకాలు చేయాలన్నారు. అధిక ధరలకు విక్రయించవద్దని ఆయన చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు కొనుగోలు చేసేలా బాణసంచా ఉండాలన్నారు. ప్రమాదాలు జరగ కుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. ప్రజలు కూడా బాణసంచా కాల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్నమున్సిపల్ కమిషనర్

- అపస్మారకస్థితిలో పడిపోయిన వ్యక్తికి వైద్యసహాయం

కనిగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కనిగిరి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. అపస్మారకస్థితిలో తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో పడిఉన్న ఓ వృద్ధుడిని ఆదివారం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం సహాయం అందించారు. పట్టణంలోని పలు హోటళ్లలో వంటమాస్టర్‌గా, సర్వర్‌గా పనిచేస్తున్న రాజాల కోటిరెడ్డి (చిన్నా) అనారోగ్యం పాలయ్యారు. కుటుంబ సభ్యులు పట్టించుకోక, ఆదరించే దిక్కులేక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో గత మూడురోజులుగా సొమ్మసిల్లి పడిపోయిఉన్నాడు. అక్కడ ఉన్న ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, సిబ్బంది అతని అల్పాహారం, మంచినీళ్ళు ఇస్తూ ఉన్నారు. ఈక్రమంలో అనారోగ్యం మరింత క్షీణించింది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఈవిషయాన్ని స్థానికులు స్నేహహస్తం సంస్థకు సమాచారం అందించటంతో ఆసంస్థ ప్ర తినిధులు కమిషనర్‌కు తెలియచేశారు. ఆదివారం ఉదయం పట్టణంలో పారిశుధ్య పనులు పర్యవేక్షణలో ఉన్న కమిషనర్ హుటా హుటీన అక్కడకు చేరుకుని అపస్మారక స్థితిలో పడిఉన్న వృద్ధుడిని ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తీసుకెళ్లాలని డాక్టర్లు తెలపడంతో వారి కుటుంబసభ్యులకు సమాచారం తెలపగా స్పందించ లేదు. దీంతో కమీషనర్ ఆర్డీవోకి సమాచారం తెలిపి కుటుంబసభ్యులను పిలిపించే ఏర్పాటు చేశారు. ఆర్డీవో ఆదేశాల ప్రకారం ఒంగోలు ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తామని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పట్టించుకోకపోవడం చట్టరీత్యా నేరమన్నారు.

పర్యాటకం అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

వేటపాలెం(చీరాల), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకరంగం అభివృద్ధికి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ చెప్పారు. ఆదివారం వేటపాలెం మండలం పొట్టిసుబ్బయ్యపాలెం తీరంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పొట్టిసుబ్బయ్యపాలెం నుంచి రామాపురం బీచ్ వరకు రోడ్డును విస్తరించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అలాగే మత్స్యకారులతో మాట్లాడారు. చెన్నై నుంచి అనధికారంగా తీరంలోకి చొరబడి వేట సాగించడంతో పాటు దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. గజ ఈతగాళ్లకు లైఫ్ జాకెట్స్ విజిల్స్ అందజేయాలని అధికారులకు సూచనలు చేశారు.

ప్రజాసాహిత్య ఉద్యమాన్ని ముందుకుతీసుకెళ్లాలి

- జనసాహితీ రాష్ట్ర అధ్యక్షుడు దివికుమార్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పాలక వర్గాలు ప్రోత్సహిస్తున్న పతన సంస్కృతికి వ్యతిరేకంగా ప్రజాసాహిత్య సాంస్కృతికోద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళాలని జనసాహితీ అధ్యక్షుడు దివికుమార్ పేర్కొన్నారు. ప్రజాసాహితీ మాసపత్రిక ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు రచించిన వ్యాసాల సంకలనం ప్రజాసాహిత్యసాంస్కృతికోద్యమం పుస్తకావిష్కరణ సభ ఆదివారం స్థానిక ఈమని పాలెంలోని తరిమెల నాగిరెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా దివికుమార్ మాట్లాడుతూ వర్తమాన సమాజాన్ని కాలంచెల్లిన భూస్వామ్య, సామ్రాజ్యవాద విధానాలు అనేక రూపాల్లో పీడిత ప్రజల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజలకు అవసరం లేని వస్తువులను అంటగట్టి వస్తు వ్యామోహ సంస్కృతిని జనం మీద రుద్దుతున్నారని ఆరోపించారు. పాలకులు కార్పొరేట్‌ల కోసం సరళీకరణ ప్రైవేటీకరణ విధానాలను తీసుకువచ్చారని విమర్శించారు. కోశాధికారి శాంతికుమార్, జిల్లా కార్యదర్శి ప్రసన్న, సభ్యులు డీవీ.సత్యనారాయణ, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ అధ్యక్షుల నియామకం

- రాష్ట్ర కార్యదర్శి పల్లా శ్రీనివాసరావు ఉత్తర్వులు

నాగులుప్పలపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు మండలంలోని ఆరు గ్రామాలకు తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు, కార్యదర్శులను నూతనంగా నియమిస్తూ రాష్ట్ర కార్యదర్శి పల్లా శ్రీనివాసరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే నాగులుప్పలపాడుకు మాత్రం ప్రకటించలేదు. మిగిలిన గ్రామాలకు ప్రస్తుత అధ్యక్షులను కొనసాగిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉప్పుగుండూరు గ్రామ అధ్యక్షుడిగా కనగాల శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శిగా జంజనం సుబ్బయ్య, చీర్వానుప్పలపాడు అధ్యక్షుడిగా ఆళ్ల సాంబయ్య, ప్రధానకార్యదర్శిగా యమర్తి మహేష్, కండ్లగుంట గ్రామ అధ్యక్షుడిగా గుడిబండి ప్రభుదాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా దారా సురేష్, బి.నిడమానూరు అధ్యక్షుడిగా నలమలపు అంకిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా లక్కెనబోయిన సౌలు, ఎం.ముప్పాళ్ల అధ్యక్షుడిగా మండవ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పులిపాటి బాబు, కె.తక్కెళ్లపాడు అధ్యక్షుడిగా నూతలపాటి శివశంకర్, ప్రధానకార్యదర్శిగా మద్దిరాల వీరాస్వామిలను నియమిస్తూ ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కార్యాలయం నియామక ప్రకటన జారీ చేసింది.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

- ఇబ్బందిపడుతున్న ఉద్యోగులు, ప్రజలు

పొన్నలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పొన్నలూరు త



తహసీల్దార్ కార్యాలయంలో పెచ్చులూడుతున్న స్లాబు


హసీల్దార్ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరుకుంది. 1990వ సంవత్సరంలో ఈ భవనం నిర్మించారు. కార్యాలయం పైకప్పు పెచ్చులూడి వర్షం వస్తే కార్యాలయం లోపల నీరు నిలిచి ఉంటుంది. రికార్డులు తడిసిపోయి ఇబ్బందిగా మారుతోంది. మండలంలో 24 గ్రామ పంచాయతీలకు సంబంధించిన కొన్ని వేల ఎకరాల భూములు ఉన్నాయి. నిత్యం ప్రజలు కార్యకలాపాల కోసం కార్యాలయానికి వస్తూ వెళుతుంటారు. దాదాపు 35 సంవత్సరాల నుంచి ప్రజలకు సంబంధించిన రికార్డులు కార్యాలయంలోనే భద్రపరిచారు. కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు పెచ్చులు ఊడి పడతాయని ఉద్యోగస్తులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్మార్ట్‌కార్డుల పంపిణీ

మద్దిపాడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా స్మార్ట్ రైస్‌కార్డులు ఇవ్వటం సంతోషదాయకమని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మండవ జయంత్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం బసవన్నపాలెంలో స్మార్ట్‌కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఆధునిక సాంకేతిక సదుపాయాలతో పారదర్శకంగా సేవలు పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కొప్పోలు విశ్వనాథం, తుమ్మల వీరాంజనేయులు, రెబ్బవరపు ప్రభాకరరావు, మండల గోవిందరాజులు, మండవ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు డీఏ ప్రకటించడంపై హర్షం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డీఏ ప్రకటించడం పట్ల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, పి.వరకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.



















శాలివాహనులు ఐక్యంగా ఉండాలి

» కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్

దర్శి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) శాలివాహనులు ఐక్యంగా ముందుకు సాగి అభివృద్ధి పథంలో పయనించాలని కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ పి.ఈశ్వర్ అన్నారు. దర్శిలో ఆదివారం జరిగిన నియోజకవర్గస్థాయి శాలి వాహనుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శాలివాహనుల అభివృద్ధికి శక్తివంచలేకుండా కృషి చేస్తాన న్నారు. దర్శి పట్టణానికి చెందిన మాడపాకుల శ్రీనివాసులు రాష్ట్ర కుమ్మర కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం ఆనందదాయకమన్నారు.

కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, నాయకులు కె.నాగేశ్వరరావు, పి.శ్రీనివాసులు, అమరసింహం, శాలివాహన సంఘ నాయకులు పాల్గొన్నారు.


శాలివాహనుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్


గురుకుల పాఠశాలకు జనరేటర్ బహూకరణ

దర్శి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల పాఠశాలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జనరేటర్‌ను బహూకరించారు. విద్యుత్ అంతరాయంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన రోటరీక్లబ్ కార్యవర్గం రూ.75 వేలు విలు వచేసే 5కేవీ సామర్థ్యంగల జనరేటర్‌ను ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా రోటరీక్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ జనరేటర్‌ను సమకూర్చిన దర్శి క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వర రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ అంకమ్మచౌదరి, సెక్రెటరీ నారాయణరెడ్డి, ట్రెజరర్ కర్నా రమణా రెడ్డి, సభ్యులు ఎస్.తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, డాక్టర్ కోటిరెడ్డి, మారం శివకోటిరెడ్డి, రాజారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, పానుగండి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

















గంగమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు,అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమవరప్పాడు పరిధిలోని గుంటి గంగమ్మ తల్లిని ఆదివారం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలుచేసి, మొక్కులు తీర్చుకున్నారు. తాళ్లూరుతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు రావడంతో సందడిగా మారింది. ఆలయ అర్చక పూజారి ఎన్.కామేశ్వరశర్మ గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జి.వాసుబాబు, దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌ఏ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు


ప్రత్యేక అలంకరణలో నారాయణస్వామి

సీఎస్‌పురం (పామూరు), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో జరపుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు నారాయణస్వామి ఉత్సహ విగ్రహానికి పంచామృత అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి మహనైవేద్యాన్ని సమర్పించారు. గోశాలలోని గోమాతకు పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, మాజీచైర్మన్ మాధవప్రసాద్, ఈవో నరసింహబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పటిష్టతకు కృషిచేయాలి

పామూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పటిష్టతకు కృషిచేయాలని ఆపార్టీ నాయకుడు అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి అన్నారు. ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని 281 బూత్ పరిధిలోని ఆకులవీధి రామాలయంలో కేఎస్‌ఎస్ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, ఉప్పలపాటి హరిబాబు, సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మున్సిపల్ కమిషనర్

» అపస్మారకస్థితిలో పడిపోయిన వ్యక్తికి వైద్యసహాయం


వృద్ధుడిని ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

కనిగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కనిగిరి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. అపస్మారకస్థితిలో తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో పడిఉన్న ఓ వృద్ధుడిని ఆదివారం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం సహాయం అందించారు. పట్టణంలోని పలు హోటళ్లలో వంటమాస్టర్‌గా, సర్వర్‌గా పనిచేస్తున్న రాజాల కోటిరెడ్డి (చిన్నా) అనారోగ్యం పాలయ్యారు. కుటుంబసభ్యులు పట్టించుకోక, ఆదరించే దిక్కులేక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో గత మూడురోజులుగా సొమ్మసిల్లి పడిపోయిఉన్నాడు. అక్కడ ఉన్న ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, సిబ్బంది అతని అల్పాహారం, మంచినీళ్లు ఇస్తూ ఉన్నారు. ఈక్రమంలో అనారోగ్యం మరింత క్షీణించింది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఈవిషయాన్ని స్థానికులు స్నేహహస్తం సంస్థకు సమాచారం అందించటంతో ఆసంస్థ ప్రతినిధులు కమిషనర్‌కు తెలియచేశారు.

ఆదివారం ఉదయం పట్టణంలో పారిశుధ్య పనులు పర్యవేక్షణలో ఉన్న కమిషనర్ హుటాహుటీన అక్కడకు చేరుకుని అపస్మారక స్థితిలో పడిఉన్న వృద్ధుడిని ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు కు తీసుకెళ్లాలని డాక్టర్లు తెలపడంతో వారి కుటుంబ సభ్యులకు సమాచారం తెలపగా స్పందించలేదు. దీంతో కమీషనర్ ఆర్డీవోకి సమాచారం తెలిపి కుటుంబసభ్యులను పిలిపించే ఏర్పాటు చేశారు. ఆర్డీవో ఆదేశాల ప్రకారం ఒంగోలు ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తామని కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పట్టించుకోకపోవడం చట్టరీత్యా నేరమన్నారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు చేయొద్దు!


పామూరులో బాణసంచా స్టాల్స్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ

పామూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా స్టాల్స్ నిర్వహకులు ముందస్తు సహయక చర్యలు చేపట్టాలని తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఆర్‌అండ్‌బీ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన బాణసంచా విక్రయాల స్టాల్స్‌ను ఎస్‌ఐ టి.కిశోర్‌బాబుతో కలిసి ఆదివారం పరిశీలించారు. అనుమతులు లేకుండా లేకుండా బాణసంచా దుకాణాలు నిర్వహించడం లేదా అక్రమంగా నిల్వ చేయడం చట్టపరంగా నేరమని హెచ్చరించారు. విక్రయ కేంద్రాలు, నిల్వ కేంద్రాలు నివాసాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాం అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు: మండలంలో నాలుగు టపాసుల దుకాణాలకు తాత్కాలిక అనుమతులు మంజూరు చేశారు. దర్శి రోడ్డులోని మార్కెట్ యార్డు ఆవరణలో టపాసులు దుకాణాలు ఏర్పాటు చేయడానికి అనమతులు మంజూరు చేశారు. ఆదివారం ఉదయం నుంచి దుకాణాదారులు తమ దుకాణాలు ఏర్పాటుచేశారు. అయితే వర్షం దుకాణాదారులను ఆందోళనలకు గురిచేస్తుంది. దీపావళి పర్వదినం రోజైన సోమవారం అయినా వర్షం లేకుండా ఉంటే బాగుంటుందని వారు ఆశపడుతున్నారు.

తాళ్లూరు: నిబంధనల మేరకు అనుమతి ఉన్నవారు మాత్రమే బాణసంచా మందులు విక్రయించాలని తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. ఆదివారం మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలో లైసెన్సు వున్న బాణ సంచా దుకాణాన్ని తనిఖీ చేశారు. నిర్వహకుల ఇంటింటో బాణసంచా స్టాక్ పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు లేకుండా దీపావళి మందులు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సై ఎస్.మల్లికార్జునరావు హెచ్చరించారు. ఆదివారం పోలీసు స్టేషన్‌లో వ్యాపారులతో మాట్లాడుతూ లైసెన్సు లేని వారు దీపావళి మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఉద్యోగులపై సీఎం సానుకూల స్పందన హర్షణీయం

» ఎన్జీవో నేతల వెల్లడి


మాట్లాడుతున్న ఎన్జీవో నాయకులు పీవీ రమణారెడ్డి, హజరత్‌ఆలీ

కనిగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పట్ల సీఎం చంద్రబాబునాయుడు సానుకూల స్పందన హర్షించదగిన విషయమని ఏపీఎన్జీవో సంఘం, ఏపీజేఏసీ నాయకులు పీవీ రమణా రెడ్డి, హజరత్‌ఆలీ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో సంఘ భవనంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దీపావళి కానుకగా నవంబర్ నుంచి ఒక డీఏను విడుదల చేయటం, 60రోజుల్లో ఉద్యోగుల హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటుచేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేయటం కూటమి ప్రభుత్వం ఉద్యోగుల పట్ల చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు.ఈసందర్భంగా సీఎం చంద్రబాబుకు, చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, ఆర్థికశాఖ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

డీఏ ప్రకటనపై యూటీఎఫ్ హర్షం

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు రాష్ట్రప్రభుత్వం ఒక డీఏ ప్రకటించడం పట్ల యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్.వెంకట్రామయ్య, షేక్ పాదుషా, జిల్లా కార్యదర్శి వి.సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. చైల్డ్‌లీవ్ సర్వీస్ మొత్తంలో ఎప్పుడైనా ఉపయోగించుకోవచ్చునని ప్రకటించడంపట్ల మహిళా ఉద్యోగులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

ప్రజాసమస్యలపై నిరంతర పోరు

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్ అన్నారు. ఆదివారం సీఎస్‌పురం మండలం ఉప్పలపాడు ఎస్సీ కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు ఏకష్టం వచ్చినా ముందుండి పోరాడేది సీపీఎం ఒక్కటేనని అన్నారు. సమావేశంలో ఊసా వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి, ఎం.రత్నారెడ్డి, పి.నరసింహులు, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి తీవ్రగాయాలు


ప్రమాదానికి గురైన ఆటో

దొనకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి ఐదుగురు తీవ్ర గాయాలపాలైన సంఘటన మండలంలోని కొచ్చెర్లకోట గ్రామ సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని నారపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన 15 మంది తిరుపతి దైవదర్శనం చేసుకొని తిరిగి శనివారం రాత్రి మార్కాపురంలో బస్సు దిగారు. అక్కడ నుంచి స్వగ్రామమైన నారపురెడ్డిపల్లెకు ఆటో మాట్లాడుకొని బయలుదేరారు. మరో పది నిమిషాల్లో గ్రామం చేరుతుందనగా రోడ్డుకు అడ్డంగా పంది రావటంతో ఢీకొని ఆటో బోల్తా పడింది. ఈప్రమాదంలో ఇద్దరు చిన్నారులు, ముగ్గురు పెద్దలు తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 సిబ్బంది మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరుకు తరలించారు. ఎస్‌ఐ త్యాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హనుమంతరావుకు నివాళి


హనుమంతరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రేయోభిలాషులు

పామూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవరపు హనుమంతరావు చిరస్మరణీయుడని టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు అన్నారు. మండలంలోని నుచ్చుపొద గ్రామంలో హనుమాన్ స్టోన్ క్రషర్ అధినేత డీహెచ్ఆర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీ హనుమాన్ స్టోన్ క్రషర్ ఎండీ తిరివీధి జనార్దనరావు, కె.కృష్ణారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌బాబు, మన్నం రమణయ్య, పువ్వాడి వెంకటేశ్వర్లు, డాక్టర్ వెంకటేశ్వరరావు, డి.మాల్యాద్రి, జి.చెన్నయ్యతో పాటు కుమారులు రవికుమార్, చంద్రబాబు, కేశవ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభం.. రాకపోకలకు అంతరాయం

పీసీపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పీసీపల్లి మండలంలో ఆదివారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. మండలవ్యాప్తంగా 31.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈవర్షం కంది, పెసర వంటి మెట్టపైర్లకు జీవం పోసింది. పెదఅలవలపాడు సమీపంలోని కనిగిరి - కందుకూరు రోడ్డులో విద్యుత్‌స్తంభం కూలి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో ఆ మార్గంలో గంటన్నర పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ టశాఖ సిబ్బంది గ్రామస్థుల సహకారంతో రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభాన్ని పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

ముండ్లమూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని, లేకుంటే భారీగా జరిమానా విధిస్తామని ఎస్‌ఐ కె.కమలాకర్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడపుతున్న పలువురికి అపరాధ రుసుం విధించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని అనుమతి లేకుండా బాణసంచా దుకాణాలను నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కె.కమలాకర్ హెచ్చరించారు. ఆదివారం బాణసంచా దుకాణదారులతో మాట్లాడారు. అనుమతి పొందిన నిర్వాహకులు మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఎర్రగొండపాలెం సీఐ అజయ్‌కుమార్

పెద్ద దోర్నాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాణసంచా దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎర్రగొండపాలెం సీఐ అజయ్‌కుమార్ హెచ్చరించారు. నూతనంగా బాధ్యలు చేపట్టిన సీఐ సాధారణ తనిఖీల్లో భాగంగా దోర్నాల పోలీస్ స్టేషన్‌ను ఆదివారం సందర్శించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం బాణసంచా దుకాణాలను తనిఖీ చేశారు.



బాణసంచా దుకాణాలను తనిఖీ చేస్తున్న సీఐ అజయ్‌కుమార్

ప్రమాదాలకు తావులేకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను దుకాణదారులకు తెలిపారు. ఏఎస్సై కృష్ణ మూర్తి, రైటర్ మోహన్ పాల్గొన్నారు.

రాచర్ల : టపాసుల విక్రయాల్లో ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని రెవెన్యూ సిబ్బంది విక్రయదారులకు సూచించారు. ఎడవల్లి టపాసుల గోడౌన్‌ను ఆదివారం పరిశీలించారు. వీఆర్వో రంగయ్య, వీఆర్ఏలు రమణ, సురేష్, అల్లూరయ్య ఉన్నారు.

కంటి అద్దాల పంపిణీ



కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న వసంతలక్ష్మి

మార్కాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి ఇటీవలే కంటి శుక్లాల ఆపరేషన్ చేయించుకున్న వారికి ఆదివారం ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. మండలంలోని ముద్దసానమ్మ దేవస్థానంలో ముందుగా ఆమె పూజల్లో పాల్గొన్నారు. ఇటీవలే దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించి కంటి ఆపరేషన్‌లు ఉచితంగా చేయించారు. ఈ క్రమంలో వారికి కళ్లద్దాలను ఆలయ కమిటీ సమకూర్చి అందజేసింది. ఈ కార్యక్రమంలో స్థానిక 26వ వార్డు కౌన్సిలర్ వక్కలగడ్డ రమ్యస్వాతి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆ రోజులు మరువలేనివి

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో వక్తలు


గురువులతో పూర్వ విద్యార్థులు

రాచర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో ఆ రోజులు మరువలేనివని పూర్వ విద్యార్థి, ఇస్రో సైంటిస్ట్ వైవీ నారాయణ, రిటైర్డ్ ఎస్సై షేక్ ఖాశింపీరా అన్నారు. మండలంలోని అనుములవీడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1978-79 సంవత్సరాల్లో 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాలలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పాఠశాలలో చదువుకున్న మేము ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్నామన్నారు. చదువుకునే రోజులు, నాటి స్నేహాలు, అప్పటి అనుభూతులు మరపురానివని అన్నారు. ఆరోజులను గుర్తు చేసుకునేందుకు ఈనాడు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఇది తమకు ఎంతో ఆనందం కలిగించిందన్నారు. అనంతరం వారు తమకు చదువు నేర్పిన గురువులను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో చిట్టెం జేమ్స్, షేక్ పల్నాటి మహబూబ్ బాషా, పాలు సుధాకర్ రెడ్డి, వేమిరెడ్డి శివరామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శారీరక ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మార్కాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని శారీరక ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు అన్నారు. నాయుడువీధిలోని సాయి మణికంఠ జిమ్ ప్యాక్ ఏర్పాటు చేసి 15 సంవత్సరాలు అయిన సందర్భంగా ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సీఐ సుబ్బారావు, టీడీపీ నాయకుడు కందుల రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ నేటి యువత మానసిక ఒత్తిళ్ల నుంచి బయటపడాలంటే శారీరక ఆరోగ్యంపై దృష్టి పెట్టాల్సిందేనన్నారు. వ్యాయామం ద్వారా జబ్బులను అదుపులో ఉంచుకోవచ్చన్నారు. పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిమ్ ప్యాక్ నిర్వాహకులు సాగర్, సీనియర్ జిమ్ మాస్టర్లు మస్తాన్, రవి, ఇక్బాల్ మున్వర్ పాల్గొన్నారు.

‘చదవడం మాకు ఇష్టం’

గిద్దలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం చదవడం మాకు ఇష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా బంతి విసురుట, స్కిప్పింగ్ పోటీలను నిర్వహించారు. బాలికల విభాగంలో అభినయశ్రీ, భవ్య, భార్గవి, బాలుర విభాగంలో వరుణ్, సుహిత్, ప్రచేతన్ విజేతలుగా నిలువగా కోలాటం మాస్టర్, ఉపాధ్యాయుడు ఎం.శ్రీనివాసులు వీరికి బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ఎన్.ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కిశోర్, కార్యదర్శి ఫరూఖ్, రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి పాల్గొన్నారు.













సమస్యలపై స్పందించిన సీఎం

ఎన్జీవో అసోసియేషన్ హర్షం

గిద్దలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దీపావళి కానుకగా నవంబరు నుంచి ఒక డీఏను విడుదల చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రకటించడం పట్ల గిద్దలూరు తాలూకా ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు టి.నరేష్‌బాబు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 60 రోజుల్లో హెల్త్‌కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేసి, అలాగే ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని ఆదేశించడం, ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్లపై వారం రోజుల్లో ఉత్తర్వుల జారీ చేయాలని చంద్రబాబు ప్రకటించడంపై నరేష్‌బాబు హర్షం ప్రకటించారు. చైల్డ్‌కేర్ లీవ్‌పై సీఎం చేసిన ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందం నింపిందన్నారు. సంఘ భవనాల ప్రాపర్టీ ట్యాక్స్ మినహాయింపు, బకాయిలు రద్దు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల డిమాండ్లపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక మంత్రి కేశవ్, పౌర సరఫరాల మంత్రి మనోహర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్‌కు జేఏసీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రగొండపాలెం : ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు తదితర సమస్యలను పరిష్కరించిన సీఎం చంద్రబాబుకు వైపాలెం తాలూకా ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు చేదూరి రవి, కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు నాయకులు, సభ్యులు, ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ సేవలను ఉపయోగించుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ అందిస్తున్న సేవలు ఉపయోగించుకోవాలని సీఐ సుబ్బారావు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో పాకాల సముద్ర స్నానం, కార్తీక మాసం సందర్భంగా మార్కాపురం నుంచి పాకలకు ఏర్పాటు చేసిన నూతన బస్సు సర్వీసును ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ నరసింహులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



బాణసంచా అమ్మకాలకు వాన దెబ్బ


కంభంలో దీపావళి టపాసులు కొనేవారు లేక వెలవెలబోతున్న దుకాణాలు

కంభం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల నుంచి కురుస్తున్న జల్లులకు బాణసంచా దుకాణాలు వెలవెలబోతున్నాయి. వానలకు తోడు దీపావళి ధరలు తారాజువ్వల్లా ఆకాశానికి అంటుతుండడం కూడా మరో కారణంగా భావిస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా దీపావళి టపాసుల ధరలు అధికంగా ఉండడంతో అంత రేట్లు పెట్టి కొనాలా వద్దా అనే ఆలోచనలో ప్రజలు ఉన్నారు. ఆదివారం రాత్రి కూడా వాన కురిసింది. బాణసంచా అంత రేట్లు పెట్టి కొనే బాధ తప్పుతుందని పలువురు బహిరంగంగానే అనుకోవడం కనబడుతుంది. బాణసంచా లైసెన్స్ సంపాదించి దీపావళి సరుకులు విక్రయించే వ్యాపారులు మాత్రం బాణసంచా లైసెన్స్ సంపాదించేందుకు పోలీస్, రెవెన్యూ అగ్నిమాపక సిబ్బందికి వేల రూపాయలు ఇచ్చామని, మరోపక్క బాణసంచా కొనుగోలుకు పెట్టిన పెట్టుబడి అన్నీ కలిపి తాము లాభాల బాట పట్టాలంటే ఆమాత్రం ధరలకు అమ్మాల్సిందేనని చెప్తున్నారు.

బంగారు దుకాణాలు వెలవెల

గిద్దలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బంగారం, వెండి ధరలు దీపావళి టపాసుల లాగా ఆకాశాన్ని అంటాయి. దాంతో ధన త్రయోదశి అయినప్పటికీ బంగారు, వెండి ఆభరణాలను కొనలేని పరిస్థితి నెలకొన్నది. దాంతో బంగారు, వెండి దుకాణాలు కొనుగోలుదారులు లేక వెలవెలబోయాయి. అక్షయతృతీయ, ధన త్రయోదశి రోజుల్లో బంగారం, వెండి వస్తువులు కొనుగోలు చేసి ఇంటికి తెచ్చుకుంటే మంచిదన్న భావన ప్రజల్లో నెలకొన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే బంగారు, వెండి ధరలు ఊహించనంతగా పెరగడంతో సామాన్యులకు, మధ్యతరగతి వారికి అందుబాటులో లేకుండా పోయాయి. కనీసం లక్ష్మీకాసులను కూడా కొనలేనంత రేట్లు పెరగడంతో కొనుగోలుదారులు బంగారు దుకాణాలవైపు చూడలేదు.




పోలేరమ్మకు జాతర

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతరను వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులు కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.







అప్రమత్తతతోనే ఆనందం

దీపావళి పండుగ వచ్చేసింది. అందరూ పండుగ మూడ్‌లోకి వచ్చేశారు. పిల్లలు, పెద్దలు అంతా కలిసి ఆనందోత్సాహాలలో మునిగి తేలి, సంబరాలు జరుపుకునే రోజురానే వచ్చింది. అయితే పండుగ వేడుకలు అంబరాన్నంటేలా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉవ్విళ్లూరుతున్నారు. దీపావళి టపాసులు కాల్చేందుకు ఎదురు చూస్తున్న ప్రజలు వేడుకలు విషాదంగా మారకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యులు సూచిస్తున్నారు. నిర్లక్ష్యంగా బాణసంచా కాల్చవద్దని పేర్కొంటున్నారు. అప్రమత్తతే ఆనందం అని వారు వెల్లడిస్తున్నారు.

దీపావళి వేడుకలు కారాదు విషాదం
పలువురు వ్యాధిగ్రస్తులకు పొంచివున్న ముప్పు
అశ్రద్ధ చేస్తే ప్రమాదం అంటున్న వైద్యులు
జాగ్రత్తలతోనే ప్రతి ఇంటా వెలుగులు



ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దీపావళి అంటేనే కుల, మతాలకు అతీతంగా పిల్లలు, పెద్దలు, ముఖ్యంగా యువత ఎంతో ఉత్సాహంగా జరుపుకునే పండుగ. గ్రామాలలో, పట్టణాలలో సోమవారం సాయంత్రం టపాసుల మోతలు.. తారాజువ్వల వెలుగులు, ఢాం.. ఢాం.. శబ్దాలు వినిపిస్తాయి. వాటితోపాటు మరోవైపు అన్నీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పొగ నిండుకుని ఉంటుంది. టపాసుల నుంచి వెలువడే పొగతో పలువురు వ్యాధిగ్రస్తులకు ముప్పు తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. టపాసులు పేల్చడం వల్ల గాలిలో దుమ్ము, కాలుష్య కారకాలు, సాంద్రత పెరుగుతుందని, కాల్చిన తర్వాత ధూళి కణాలు, రాగి, జింక్, సోడియం, సీసం, మెగ్నీషియం, కాడ్మియం, సల్ఫర్, నైట్రోజన్ ఆక్సైడ్‌లు వంటి కాలుష్య కారకాలతో నిండిన రేణువులు చుట్టపక్కల ఉపరితలాలపై స్థిరపడతాని, ఈ అదృశ్య హానికర కణాలు పర్యావరణాన్ని ప్రభావితం చేయడంతోపాటు, ఆరోగ్యాన్ని కూడా ప్రమాదంలో పడేస్తాయని తెలియజేస్తున్నారు. ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తగు జాగ్రత్తలతో పండుగ జరుపుకోవాలని సూచిస్తున్నారు. అప్రమత్తంగా ఉండటంలోనే ఆనందం ఉందని వివరిస్తున్నారు.



తగు జాగ్రత్తలతో బాణ సంచా కాల్చాలి
- డాక్టర్ వై.సునీల్‌కిషోర్, ప్లాస్టిక్ సర్జన్

దీపావళి బాణ సంచా కాల్చేటపుడు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా టపాసులు కాల్చేటపుడు కాళ్లు, చేతులు, చర్మం కాలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. చర్మంపై గాయమైనపుడు ప్రథమ చికిత్సగా చర్మంపై మంట తగ్గేవరకు చల్లని నీరును గాయంపై ధారగా పోయాలి. అనంతరం వైద్యుడిని సంప్రందించి తగు చికిత్స తీసుకోవాలి. గాయం అయినప్పుడు పేస్టులు పూయడం, ఇంకు రుద్దడం, పసుపు పూయడం వంటి పనులు చేయకూడదు. గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న చర్మవైద్యులు, ప్లాస్టిక్ సర్జన్‌ను సంప్రదించాలి. పొగ ఎక్కువగా ఉండే టపాసులు కాల్చడం వలన శ్వాశకోశ వ్యాధులు వస్తాయి. పెద్ద పెద్ద శబ్దాలు వచ్చే టపాసులు కాల్చడం వలన చెవి, కంటి సమస్యలు వస్తాయి. టపాసులు కాల్చేటపుడు కళ్లజోడు పెట్టుకుని కాల్చితే చాలా ప్రయోజనకరం.

పొగను అశ్రద్ధ చేస్తే వచ్చే వ్యాధులు

- కళ్ల మంటలు, ఊపిరిత్తుల్లో నెమ్ము
- గొంతు వాపు, జలుబు, తలనొప్పి, ఛాతీలో బరువు
- శ్వాస కోశ ఇబ్బందులు
- టపాసుల పొగ పీల్చాక పదిహేను నిమిషాల్లో సల్ఫర్ డై ఆక్సైడ్ ప్రభావం చూపుతుంది.
- మానసిక, నరాల సమస్యలు
- రక్త సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ కారక వ్యాధులు
- గుండె జబ్బులు, నిద్రలేమి, వినికిడి శక్తి తగ్గిపోవడం, హై బీపీ



ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- టపాసులు కాల్చేటపుడు శరీరానికి బిగుతుగా ఉండే దుస్తులు ధరించరాదు
- శిల్క్ దుస్తులు ధరించరాదు, కాటన్ దుస్తులు మాత్రమే వేసుకోవాలి
- పేలుడు పదార్థాలు కాల్చేటపుడు పెద్దలు, చిన్నారుల దగ్గరే ఉండాలి
- సగం కాలిన టపాసులు వద్దకు వెళ్లకూడదు
- ఇరుకుగా ఉండే నివాసాలు, పూరిగుడిసెలు మధ్యన టపాసులు కాల్చరాదు
- టపాకాయలు పేల్చేటపుడు నీరు, ఇసుకను దగ్గర ఉంచుకోవాలి
- తారాజువ్వలను నిలువుగా కాల్చాలి
- చేతుల్లో టపాకాయలను కాల్చరాదు.
- చిచ్చుబుడ్లు చేతిలో ఉంచి కాల్చరాదు
- నివాసాల్లో టపాసుల నిల్వ ఉంచినపుడు పిల్లలకు అందకుండా ఉంచాలి
- టపాసులను పొడవాటి సాంబ్రాణి కడ్డీలతో అంటించడం ఎంతో మేలు
- టపాసులు కాల్చేటపుడు మూతికి గుడ్డ కట్టుకోవాలి



శ్రీ ప్రతిభా కళాశాలలో కేఎల్ యూనివర్శిటీ మెరిట్ స్కాలర్‌షిప్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నవంబరు 14 నుంచి 'ప్రతిభా' పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీ విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు క్యాంపస్‌లలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ప్రతిభా పరీక్షలను నవంబరు 14నుంచి 18వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కేఎల్ యూనివర్శిటీ అడ్మిషన్ విభాగం డైరెక్టర్ డాక్టర్ జే శ్రీనివాసరావు తెలిపారు. ఒంగోలు సమీపంలోని శ్రీ ప్రతిభా కళాశాల ఆవరణలో ఆదివారం 'భవిష్యత్‌కు బంగారు బాట- కేఎల్ యూనివర్శిటీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ పరీక్షల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ. 100 కోట్ల మేర మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు తెలిపారు. కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రపంచ సాంకేతిక సవాళ్ళకు అనుగుణంగా సమగ్ర నైపుణ్యాభివృద్ధి దిశగా విద్యా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. గడిచిన 20 ఏళ్లుగా ప్రతిభ ఆధారితంగా విద్యార్థి నైపుణ్యం మేరకు సంవత్సరానికి రూ. 40నుంచి 70 లక్షల వరకు అత్యధిక వేతనాలు పొందిన వారు కూడా ఉన్నారని తెలిపారు. అనంతరం మెరిట్ స్కాలర్‌షిప్ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభా విద్యా సంస్థల ఛైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్‌ఛైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాశ్, కే ఎల్ యూనివర్శిటీ ప్రతినిధులు డాక్టర్ జేవీ షణ్ముకకుమార్, శివరామకృష్ణ, కే రాంబాబు, పీ అంజనేయ వరప్రసాదరావు, ఆర్‌శేఖర్‌బాబు, ఎ.మస్తాన్‌వలి, షేక్ నయూబ్, పార్థసారథి, కల్యాణ్, చంద్రశేఖర్, పవిత్ర ఉన్నారు.



బస్సుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

పాకల బీచ్‌కు ప్రత్యేక బస్సులు ప్రారంభం

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో పాకల బీచ్ వద్దకు ఏర్పాటు చేసిన బస్సులను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ మేరకు ఒంగోలులో నగరపాలక సంస్థ కమిషనర్ కే. వెంకటేశ్వరరావు, కనిగిరిలో మునిసిపల్ ఛైర్మన్ షేక్ గఫూర్, మార్కాపురంలో సీఐలు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డిపో మేనేజర్ ఘట్టమనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ సింగరాయకొండకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పాకల బీచ్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రకాశం రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు ప్రతి ఆదివారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఈ బస్సులలో మహిళలకు స్త్రీ శక్తి పథకం అమలు అవుతుందని వివరించారు.

జిల్లాలో 8.2 మి.మీ.వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 8.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. చీమకుర్తిలో 66.6, మద్దిపాడులో 59.2, పీసీపల్లిలో 31.2, వెలిగండ్లలో 30.0, పామూరులో 25.2, కనిగిరిలో 23.6, నాగులుప్పలపాడులో 10.8, సింగరాయకొండలో 10.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. పలు ఇతర మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

దీపావళిని ప్రశాంతంగా జరుపుకోవాలి

● ఎస్పీ హర్షవర్ధనరాజు

ఒంగోలు క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):దీపావళి పండుగను జిల్లా ప్రజలు సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని ఎస్పీవి.హర్షవర్ధనరాజు కోరారు. ఈసందర్భంగా జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా అక్రమంగా బాణసంచా విక్రయిచే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు దీపావళి టపాసులు కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. దీపావళి రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగితే 101,100,112 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్పీ సూచించారు.ఒకా వాట్సప్ నంబరు 9121102266కు తెలియజేయాలని కోరారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	250.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	260.00

పోలీసు అమరవీరులకు వందనం

రేపు సంస్మరణ దినం
ఇప్పటివరకు అమరులైన ఏడుగురు పోలీసులు
పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ప్రత్యేక నివాళి

పోలీసు అంటే త్యాగానికి నిరతి.... ప్రజలకు భద్రత కల్పిస్తూపహారా కాసేది పోలీస్.. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, కంటి మీద కునుకు లేకుండా విధులు నిర్వహించేది పోలీస్.. సంఘవిద్రోహ శక్తుల పాలిట సింహ స్వప్నంలా మెలుగుతూ తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి శాంతిభద్రతలకు రక్షణ కల్పించేది పోలీస్.. విధి నిర్వహణలో ప్రజల కోసం నేలకొరిగి తమత్యాగాన్ని చాటి చెప్పేది పోలీస్.... అలాంటి పోలీసు శాఖలో ఖాకీ యూనిఫాం వేసుకొని పనిచేయడం జాతి గర్వించదగ్గ విషయం.

ఒంగోలు క్రైం,అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం ప్రాణాలు అర్పిస్తున్న పోలీసు శాఖలో పని చేస్తూ విధినిర్వహణలో నేలకొరిగిన అమరులకు సలాం చేద్దాం .1995 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఏడుగురు పోలీసులు విధినిర్వహణలో అసువులు బాశారు. వారందరికీ పేరు పేరున సెల్యూట్ చేస్తూ మంగళవారం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ వి.హర్షవర్ధనరాజు నేతృత్వంలో ప్రత్యేక నివాళులు అర్పించనున్నారు.

పోలీసు అమరవీరుల దినోత్సవం

దేశంలో ప్రతి సంవత్సరం ఆక్టోబరు 21న పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తారు. విధినిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ ఈ కార్యక్రమం జరుపుతారు. 1959 అక్టోబర్ 21న లడఖ్ ప్రాంతంలో హట్‌స్ప్రింగ్ వద్ద చైనాసైనికులు జరిపిన దాడిలో పదిమంది భారతీయ పోలీసు బలగం వీరోచిత పోరాటం చేసి వీర మరణం పొందారు. వారి త్యాగాలకు గుర్తుగా అప్పటి నుంచి పోలీసు అమరవీరల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

విధి నిర్వహణలో అసువులు బాసిన అమర పోలీసులు

శత్రువు తూటా గుండెలో దిగినా కర్తవ్వంను విస్మరించకుండా ఎదురుకాల్పులు జరిపిన పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ సీవీ రత్నం 1995 డిసెంబరు 1న ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో ఒంగోలు ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి వద్ద పీఎస్‌వోగా ఉన్న రత్నం నక్సలైట్ల తూటాకు బలయ్యాడు. సుబ్బారామిరెడ్డిని కిడ్నాప్ చేసేందుకు వచ్చిన నక్సలైట్లపై ఎదురు తిరిగిన రత్నం వీరమరణం పొందారు.

- 2001జూన్ 3న పుల్లలచెరువు మండలం మర్రివేములలో ప్రభుత్వం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో విధులు నిర్వహించి వెళుతుండగా నక్సలైట్లు జరిపిన కాల్పులలో ఏఎస్ఐ కే.ప్రశాంతరావు ఆసువులు బాశారు.
- 2008 జూన్ 29 న బలిమెలలో పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పులలో జూనియర్ కమాండో కొండపి మండలం పెరిదేపికి చెందిన మోటా ఆంజనేయులు అమరుడయ్యారు.
- గుడ్లూరు మండలం రామాయపట్నంకు చెందిన లీలాశంకర్ బలిమెల ఘటనలో మోటా ఆంజనేయులు తో ప్రాణాలు కోల్పోయారు.
- 2009 సెప్టెంబర్ 2న ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కుప్ప కూలింది. ఆయన వద్ద భద్రతాధికారిగా పనిచేసిన ఒంగోలుకు చెందిన అద్దంకి సాల్మన్‌కేరీ వెస్లీ దుర్మరణం చెందారు.
- 2010 మే 5న లైలా తుఫాన్ సందర్భంగా అద్దంకిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మార్టూరు మండలం కోనంకికి చెందిన షేక్ మహమ్మద్ రఫీ విధినిర్వహణలో ఉండగా అద్దంకి నల్లవాగు ఉధృతిలో ఆర్టీసీ కండక్టర్ యానాదిరావు కొట్టుకుపోతున్నాడు. ఆయనను కాపాడేందుకు వాగులోకి దూకిన మహమ్మద్ రఫీ ,యానాదిరావును కాపాడి తనప్రాణాలు కోల్పోయారు.
- 2023 మే 24న చీమకుర్తికి చెందిన పవన్ కుమార్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అమరావతిలోని తుళ్లూరు వద్ద విధులు నిర్వహిస్తూ పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయారు.

రేపు అమరజవాన్ స్థూపం వద్ద ప్రత్యేక నివాళి

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ హర్షవర్ధనరాజు నేతృతంలో పోలీసు అమరవీరులకు ప్రత్యేక నివాళి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వీరజవాన్ స్థూపం వద్ద విధినిర్వహణలో అమరులైన పోలీసు కుటుంబాలను సత్కరిచనున్నారు. అదే సమయంలో పోలీసు అమరవీరులకు ఘననివాళి అర్పించనున్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో అమరజవాన్ల కోసం ఏర్పాటు చేసిన స్థూపం

సీఎం సానుకూల దృక్పథం అభినందనీయం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూల దృక్పథంతో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం అభిందనీయమని ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు అన్నారు. స్థానిక ఎన్‌జీవో భవన్‌లో ఆదివారం జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీపావళి కానుకగా నవంబరు నెల నుంచి ఒక డీఏను విడుదల చేస్తామని ప్రకటించడం శుభపరిణామన్నారు. మహిళా ఉద్యోగులకు వారి సర్వీసు మొత్తంలో ఎప్పుడైనా చైల్డ్ కేర్‌లీవ్ వినియోగించుకునే అవకాశం కల్పించడంతో పాటు త్వరలోనే మంచి పీఆర్సీ ఇస్తామని చెప్పడంపై ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తం అవుతుందని తెలిపారు. రానున్న కాలంలో ఉద్యోగుల సమస్యలన్నీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ నేతృత్వంలో ప్రభుత్వం సామరస్యధోరణితో పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఉద్యోగుల హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ కోశాధికారి శివకుమార్, ప్రతినిధులు ఎం.వెంకటేశ్వరరావు, తోట శ్రీనివాస్, రామాంజనేయులు, చిరంజీవిరావు, కృష్ణకిషోర్, ఏడుకొండలు, షేక మోమిన్, విజయకుమార్, కొత్తపల్లి మంజేష్, షేక్ మగ్దుం షరీఫ్, పి. మాధవి, కోటేశ్వరమ్మ, సీహెచ్ శిరీష తదితరులు ఉన్నారు.

అనస్థీషియాలజిస్ట్స్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలజిస్ట్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. స్థానిక కేబీ రెసిడెన్సీలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఒంగోలుకు చెందిన డాక్టర్ పి. దుర్గా ప్రసాదరావు ఎన్నికయ్యారు. అలాగే ప్రెసిడెంట్ ఎలక్ట్‌గా డాక్టర్ అచ్యుతరామయ్య, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ డీవీ. మహేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్లు రాజశేఖర్ రెడ్డి, పద్మజ, రాకేష్, వినీల, ఉదయ్ శంకర్, అనిల్ కుమార్‌లు ఎన్నికయ్యారు. పూర్వ అధ్యక్షుడు డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాసరావు నుంచి బాధ్యతలు తీసుకున్న అనంతరం నూతన కార్యవర్గం పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ హాస్పిటల్స్‌లో, ఆపరేషన్ థియేటర్‌లో, ఇంటెన్సివ్ కేర్‌యూనిట్‌లలో పేషెంట్ సేఫ్టీ కొరకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ వినయ్ కుమార్, సెక్రటరీ డాక్టర్ ద్వివ, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మోహన్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ శ్రీనివాస్ యాదవ్‌తోపాటు, పూర్వపు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కుచేల బాబు, ఒంగోలు శాఖ అధ్యక్షుడు డాక్టర్ చలపతి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ రజని, సెక్రటరీ డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇండియా సొసైటీ ఆఫ్ అనస్థీయాలజిస్ట్ (ఏపీ ఐఎస్ఏ)లోగోను ఆవిష్కరించారు.

కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు ఆదివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆనందోత్సాహాలతో ఈ పండుగ జరుపుకోవాలని, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. బాణసంచా కాల్చే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అడ్డదారుల్లో గ్రానైట్ అక్రమ రవాణా

నిబంధనలకు విరుద్ధంగా తరలింపు
కుంగిపోతున్న గ్రామీణ రహదారులు
ఏఎంఆర్ సంస్థ రంగంలోకి వస్తే అడ్డుకట్టపడుతుందని ఓనర్ల ఎత్తు
పట్టని అధికార యంత్రాంగం

నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ యజమానులు అడ్డదారుల్లో ముడి రాళ్లను అక్రమంగా తరలిస్తున్నారు. భారీవాహనాల్లో అధిక లోడుతో వెళ్తున్న వాహనాలతో గ్రామాల్లోని ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. వాహనాల నుంచి ఎప్పుడు రాయి కిందపడుతుందో తెలియనంత వేగంగా వెలుతున్నాయి. పైగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వేసిన తారురోడ్లు సైతం అధిక లోడు వాహనాల తాకిడితో దెబ్బతింటున్నాయి. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకున్నట్లుగా సీనరేజీ వసూలుకు ఏఎంఆర్ సంస్థ రాకముందే క్వారీల నుంచి ముడి రాళ్లను యజమానులు గుళ్లాపల్లిలోని ఫ్యాక్టరీలకు తరలించి నిల్వ చేసుకుంటున్నారు.



పరిమితికి మించిన గ్రానైట్ రాళ్లతో నేకునంబాదు నుంచి దొడ్డవరం వైపు వెళ్తున్న టిప్పర్

చీమకుర్తి,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): రామతీర్థం పరిసరప్రాంతాల్లో విస్తరించిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ క్వారీలనుంచి ముడిరాయిని ఇష్టారీతిన బిల్లులు లేకుండా అడ్డదారుల్లో గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌కు తరలిస్తున్నారు. దీపావళి పండగ తర్వాత సీనరేజి వసూలు హక్కులు పొందిన ఏఎంఆర్ సంస్థ రంగంలోకి వస్తే తమ అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని భావించిన గ్రానైట్ యజమానులు దీపం ఉండగానే ఇళ్లు చక్కదిద్దుకుందామనే ఆలోచనతో ముడిరాళ్లను ముందస్తుగా తమ ఫ్యాక్టరీల్లో ప్రోది చేసుకుంటున్నారు.ఈ క్రమంలో ఈ అక్రమ రవాణాకు ఒడిగడుతున్నారు.



భారీ వాహనాల తాకిడితో గుంతలు పడిన ఇటీవల వేసిన తారు రోడ్డు

ధ్వంసం అవుతున్న రహదారులు...

రామతీర్థం నుంచి గ్రానైట్ ముడిరాళ్లను అడ్డదారిలో అధికారులు ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల నుంచి తప్పించుకోవటానికి పల్లామల్లి, నేకునంబాదు, దొడ్డవరం, వెల్లంపల్లి మీదుగా గ్రోత్‌సెంటర్‌కు భారీ ఎత్తున ఓవర్‌లోడుతో విచ్చలవిడిగా, ప్రమాదభరితంగా రవాణా చేస్తున్నారు.నేకునంబాదు నుంచి దొడ్డవరంకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతనంగా బీటీ రహదారిని కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించింది. ఇపుడు ప్రమాదకరంగా భారీ లోడుతో వెళ్తున్న వాహనాల వలన రహదారి పలుచోట్ల ఛిద్రం అయ్యింది.రహదారి నిర్మించిన సంతోషం నెలలు కాకముందే ఆవిరయ్యింది. ఇప్పటికే పల్లామల్లి తదితర ప్రాంతాల్లో నిర్మించిన రహదారులు అడ్డదిడ్డ రవాణాతో ధ్వంసమయ్యాయి.ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవటం గమనార్హం.

ఏఎంఆర్ వస్తే తమ ఆటలు సాగవని...

అక్టోబరు ఒకటో తేదీనుంచి గ్రానైట్ ముడిరాళ్ల సీనరేజి వసూలు హక్కులను టెండర్ ద్వారా ఏఎంఆర్ సంస్థ దక్కించుకుంది.గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్లు వీరి రాకను వ్యతిరేకిస్తూ దాదాపు 14రోజులు సమ్మె చేయటం తదుపరి మంత్రులు,ఎమ్మెల్యేలు ఇచ్చిన స్పష్టమైన హామీ మేరకు సమ్మె విరమించి ఫ్యాక్టరీలను నడుపుతున్నారు.సీనరేజి హక్కులు పొందిన ఏఎంఆర్ సంస్థ దీపావళి తర్వాత ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొని వసూలు కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఈ సంస్థ ఇప్పటికే రాళ్ల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే విధంగా పలు చర్యలు చేపట్టింది.ప్రతి క్వారీ ఎదుట కంటైనర్ ఏర్పాటుచేసి దానిలో సీసీ కెమెరాలు,అనుక్షణం రవాణాని పర్యవేక్షించేవిధంగా ఉద్యోగులను నియమించింది.వీరి కళ్లుగప్పి బిల్లులు లేకుండా ముడిరాళ్లను క్వారీలనుంచి బయటకు తరలించే అవకాశం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. ఇదంతా గమనించిన ఓనర్లు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా భారీ స్థాయిలో రాళ్లను తరలిస్తున్నారు. ఇదంతా తమకు పట్టనట్లు మైన్స్ అధికారులు వ్యవహరిస్తుండటంతో గ్రానైట్ ఓనర్లకు అక్రమ రవాణా వరంగా మారింది.

మృతదేహం ఆచూకీ లభ్యం

● ఊపిరి పీల్చుకున్న పోలీసులు

మార్టూరు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఇసుకదర్శి నుంచి వలపర్ల వెళ్లే మట్టిరోడ్డులో బావిలో అనుమానస్పదంగా మృతిచెందిన వ్యక్తి వివరాలను సీఐ ఎం.శేషగిరిరావు వివరించారు. మండలంలోని ఇసుకదర్శి గ్రామానికి చెందిన మారెళ్ల శ్రీనివాసరావుగా మృతుని కుటుంబసభ్యులు గుర్తించారన్నారు. ఆయనకు భార్య రేణుక, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలకు వివాహాలు పూర్తిచేశాడు. గ్రామంలో సొంతపొలంలేని ఆయన కౌలుకు పొలం తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. తరచూ మద్యం సేవించే అలవాటు ఉన్న శ్రీనివాసరావు, తరచూ ఇంటి నుంచి బయటకు వెళ్లి కొన్నిరోజుల తర్వాత ఇంటికి వచ్చేవాడన్నారు. అదేవిధంగా ఈ నెల 12వ తేదీ భోజనం చేసి ఇంటి నుంచి బయటకు వెళ్లిన తర్వాత కనిపించలేదన్నారు. కాని పోలీసులు శనివారం బావిలో నుండి మృతదేహాన్ని బయటకు తీసిన తర్వాత శ్రీనివాసరావును గుర్తించినట్లు తెలిపారు. కొంత అప్పులు,కుమారుని కి కొంతమతిస్థిమితం లేని కారణంగా శ్రీనివాసరావు ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని మృతుని బంధువులు చెబుతున్నారు.పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయడం, మృతునిది హత్యా, ఆత్మహత్యా అని పోలీసులు సందిగ్ధావస్థలో ఉన్న తరుణంలో మృతుడి ఆచూకీ లభించడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.కోనంకి రెవెన్యూ పరిధిలోని బావిలో మృతదేహం లభ్యం కావడంతో, వితంతు గుమ్మడి నాగు ఫిర్యాదు మేరకు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేశారు.

తగ్గిన జీఎస్టీతో..

ప్రజల జీవితాల్లో దీపావళి వెలుగులు : జేసీ

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): తగ్గిన జీఎస్టీ ధరలతో ప్రజల జీవితాలలో మరిన్ని దీపావళి వెలుగులు నింపుతాయని జేసీ గోపాలకృష్ణ పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ ప్రచార ముగింపు కార్యక్రమం ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో ఘనంగా జరిగింది. జీఎస్టీశాఖ డిప్యూటీ కమిషనర్ సత్యప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన జేసీ మాట్లాడుతూ నూతన జీఎస్టీతో పలు రకాల వస్తువులకు ధరలు గణనీయంగా తగ్గాయన్నారు. దసరా శరవన్నరాత్రులు ప్రారంభం నుంచి దీపావళి పండగ వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ రూపాల్లో జీఎస్టీకి సంబంధించిన అవగాహన కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం నిర్వహించిందని ఆయన చెప్పారు. కాగా ఆయా కార్యక్రమాలు ముగింపు సందర్భంగా ప్రకాశంభవనం వద్ద అధికారులు, జేసీ గోపాలకృష్ణ బాణసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, డీపీవో శ్రీనివాసరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులతో కలిసి క్రాకర్స్‌ను కాలుస్తున్న జేసీ గోపాలకృష్ణ

ప్రజాప్రతినిధుల దీపావళి శుభాకాంక్షలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి భారతీయ సంస్కృతిక ప్రతీకయే దీపావళి పండుగ అని, ప్రతిఇంటా వెలుగులతో శ్రీలక్ష్మీదేవి అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజించి అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

- జిల్లా ప్రజలకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

- దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని మాజీ శిద్దా రాఘవరావు ఆకాంక్షించారు.

ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సురేష్‌బాబు

నాగులుప్పలపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కొంజేటి సురేష్‌బాబు ఎన్నికయ్యారు. విజయవాడలోని సీకే కన్వెన్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలలో సంఘం నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శిగా కొంజేటి సురేష్‌బాబు, కమిటీ సభ్యులుగా అమరా వేణులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన కొంజేటి సురేష్ బాబు, కమిటీ సభ్యులు అమరా వేణులను రాష్ట్ర మంత్రి టీజీ.భరత్, మాజీ మంత్రి టీజీ.వెంకటేష్, పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు.



సురేష్‌బాబును అభినందిస్తున్న నాయకులు

ఆటో బోల్తా.. ఐదుగురికి తీవ్రగాయాలు

దొనకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి ఐదుగురు తీవ్ర గాయాలపాలైన సంఘటన మండలంలోని కొచ్చెర్లకోట గ్రామ సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని నారపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన 15 మంది తిరుపతి దైవదర్శనం చేసుకొని తిరిగి శనివారం రాత్రి మార్కాపురంలో బస్సు దిగారు. అక్కడ నుంచి స్వగ్రామమైన నారపురెడ్డిపల్లెకు ఆటో మాట్లాడుకొని బయలుదేరారు. మరో పది నిమిషాల్లో గ్రామం చేరుతుందనగా రోడ్డుకు అడ్డంగా పంది రావటంతో ఢీకొని ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు, ముగ్గురు పెద్దలు తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 సిబ్బంది మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరుకు తరలించారు. ఎస్‌ఐ త్యాగరాజు కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన ఆటో

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

● కుటుంబసభ్యులను పరామర్శించిన మంత్రి రవికుమార్

మేదరమెట్ల, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : వరుసగా వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పులబాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని దైవాలరావూరుకు చెందిన చిట్టినేని బాబూరావు (44) వ్యవసాయంలో నష్టం రావడంతో ఈ నెల 16న ఒంగోలు సమీపంలో రైలు కిందపడి ఆత్మహ్యత చేసుకన్నాడు. కొంత పొలం కౌలుకు తీసు కొని సాగుచేసి నష్టాలు రావడంతో ఆందోళనకు గురైన బాబూరావు ఆత్మహత్య చేసుకోవాలనే తీవ్రమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇంచుమించు రూ.40లక్షల వరకు ఆయనకు అప్పులు ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. బాబూరావుకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించి ఓదార్చారు. రైతు కుంటుబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఆయన వెంట సొసైటీ అధ్యక్షుడు మద్దినేని రాఘస్వామి, మాజీ సర్పంచ్ చెన్నుపాటి హరిబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు మువ్వన నరసింహారావు, బాచిన బాలకోటయ్య, మద్దినేని శ్రీనివాసరావు, ముద్దన సుబ్బారావు వజ్జా వేణు ఉన్నారు.



కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

శాలివాహనులు ఐక్యంగా ఉండాలి : చైర్మన్

దర్శి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) శాలివాహనులు ఐక్యంగా ముందుకు సాగి అభివృద్ధి పథంలో పయనించాలని కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ పి.ఈశ్వర్ అన్నారు. దర్శిలో ఆదివారం జరిగిన నియోజకవ ర్గస్థాయి శాలివాహనుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. శాలివాహనుల అభివృద్ధికి శక్తివంచలేకుండా కృషి చేస్తానన్నారు. దర్శి పట్టణానికి చెందిన మాడపాకుల శ్రీనివాసులు రాష్ట్ర కుమ్మర కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, నాయకులు కె.నాగేశ్వరరావు, పి.శ్రీనివాసులు, అమరసింహం, సంఘ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ ఈశ్వర్

ఆనందాల రవళి దీపావళి !

- నేడే దీపావళి పండుగ
- టపాసులు కాల్చి ఆనందించనున్న చిన్నా పెద్దా
- భారీగా పెరిగిన బాణసంచా ధరలు
- ఆన్‌లైన్ అమ్మకాలకు గిరాకీ

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగ దీపావళి. అదేవిధంగా ఆ రోజు వెలిగించే దీపాల ద్వారా ఇంట్లోని ప్రతికూల శక్తులను తొలగించి నూతన వెలుగులు తీసుకొచ్చే పండుగ అని కూడా ప్రజలు నమ్ముతారు. హిందువులతోపాటు జైనులు, బౌద్ధులు, సిక్కులు వంటి కొన్ని ఇతర మతాల వారు కూడా ఈ పండుగను జరుపుకుంటారు. ఆశ్వీయుజ మాసం చివరిరోజైన అమావాస్య రోజున ప్రతి సంవత్సరం దీపావళిని జరుపుకోవటం ఆనవాయితీ. ఇక జిల్లావ్యాప్తంగా ప్రజలు సోమవారం దీపావళి పండుగను జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం టపాసులతో పాటు పూలు, పండ్లు, ఇతర పూజా సామగ్రిని ప్రజలు కొనుగోలు చేయటంతో జిల్లాలోని ప్రధాన పట్టణాలు, జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో వ్యాపార కూడళ్లు సందడిగా మారాయి. మరోవైపు ఒంగోలు పీవీఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో బాణాసంచా విక్రయ దుకాణాలను ఏర్పాటుచేశారు. అయితే గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది బాణసంచా ధరలు రెట్టింపునకు పైగా పెరిగాయి. దీంతో ప్రజలు వీటిని కొనటానికి వెనకడుగు వేస్తున్నప్పటికీ వచ్చేవారు కూడా ఖర్చుకు భయపడి కొద్దిమొత్తంలోనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో తాము పెట్టిన పెట్టుబడి సైతం వస్తుందా రాదా అనే సందేహంలో దుకాణాల వారు ఉన్నారు. మరో వైపు బాణసంచా విక్రయ కేంద్రాల దగ్గర ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లా పోలీస్, ఫైర్ శాఖల వారు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

నరకాసుర సంహారం..

ఇక ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడి భార్య సత్యభామ నరకాసురుడనే రాక్షసుడిని సంహరించటంతో ఆ మరునాడు ప్రజలు ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకున్నారుఉ రాక్షసుడు పెట్టే బాధల వల్ల తమ జీవితాల్లో అలుముకున్న చీకట్లు తొలగిపోయాయనే దానికి సంకేతంగా దీపాలు వెలిగించారని, దీపాలను వరుసగా ఏర్పాటుచేయటంతో దానికి దీపావళి అనే పేరు వచ్చిందని పురాణాలు పేర్కొటున్నాయి. అప్పటి నుంచి ఆశ్వీయుజ చతుర్దశిని నరక చతుర్దశిగా, మరుసటి రోజైన అమావాస్యను దీపావళిగా ప్రజలు అనాదిగా జరుపుకుంటున్నారు.

భారీగా పెరిగిన టపాసుల ధరలు


పీవీఆర్ మైదానంలో వర్షపునీటిలో ఏర్పాటు చేసిన దుకాణాలు

దీపావళి పండుగ అనగానే ప్రతి ఒక్కరికీ గుర్తుకు వచ్చేది టపాసులు. వయసుతో సంబంధం లేకుండా చిన్నా, పెద్దా


ఒంగోలులో టపాసులను కొనుగోలు చేస్తున్న ప్రజలు

అందరూ ఆ రోజు టపాసులు కాలుస్తూ హుషారుగా గడుపుతారు. కొన్నేళ్ల కిందటి వరకు మతాబులు, చిచ్చు బుడ్లు వంటి కొన్ని రకాల టపాసులను యువకులు తమ ఇళ్లవద్దే సొంతంగా తయారు చేసుకునేవారు. అయితే క్రమేపీ మారిన జీవన విధానంతో వాటిని సైతం ప్రస్తుతం కొనుగోలు చేస్తున్నారు. ఇక ఈ సంవత్సరం టపాసుల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. కాకరపువ్వొత్తుల ధరలు ఒక్కో బాక్సుకు సైజును బట్టి రూ.100 నుంచి రూ.250 వరకు పలుకుతుండగా, చిచ్చుబుడ్లు కూడా వాటి సైజును బట్టి 10 ఉండే బాక్సు ధర రూ.250 నుంచి రూ.1500 వరకు పలుకున్నది. ఈ విధంగా అన్ని టపాసుల ధరకు గత ఏడాదితో పోలిస్తే రెట్టింపు పలుకుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. దీంతో ప్రజలు టపాసుల కొనుగోలుకు భయపడుతున్నప్పటికీ, దీపావళి అంటే వాటిని కాల్చటం తప్పనిసరి కనుక కొద్ది మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. ఇక స్థానికంగా ధరలు ఈ విధంగా ఉంటే శివకాశి నుంచి తయారీదారులు ఆన్‌లైన్ ద్వారా సరఫరా చేసే టపాసుల ధరలు కొంత తక్కువగా ఉండటంతో అనేకమంది ఆన్‌లైన్ ద్వారా ముందుగానే కొనుగోలు చేశారు.

పటిష్ట భద్రతా చర్యలు


టపాసుల దుకాణాలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

టపాసులను కొనుగోలు చేయటానికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ నియంత్రించటం వంటి చర్యలు జిల్లా పోలీసు శాఖ చేపట్టారు. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే తక్షణమే అదుపు చేసేవిధంగా జిల్లా అగ్నిమాపక శాఖ చర్యలు చేపట్టింది.

వాతావరణంతో బెంబేలు

ఒంగోలు నగరంలో ఆదివారం వాతావరణం చిరుజల్లులతో ఉండటంతో టపాసుల వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. జల్లుల కారణంగా అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేకపోవటం, సోమవారం కూడా ఇదేవిధంగా ఉంటే తాము పెట్టిన పెట్టుబడి సైతం రాదని వారు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా ఇటువంటి వాతావరణానికి టపాసులు ఎంతవరకు కాలుతాయో అనే సందేహంతో ప్రజలు సైతం ఎక్కువగా కొనటానికి ముందుకు రావట్లేదు.

ప్రజాసాహిత్య ఉద్యమాన్ని ముందుకుతీసుకెళ్లాలి

- జనసాహితీ రాష్ట్ర అధ్యక్షుడు దివికుమార్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పాలక వర్గాలు ప్రోత్సహిస్తున్న పతన సంస్కృతికి వ్యతిరేకంగా ప్రజాసాహిత్య సాంస్కృతికోద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళాలని జనసాహితీ అధ్యక్షుడు దివికుమార్ పేర్కొన్నారు. ప్రజాసాహితీ మాసపత్రిక ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు రచించిన వ్యాసాల సంకలనం ప్రజాసాహిత్యసాంస్కృతికోద్యమం పుస్తకావిష్కరణ సభ ఆదివారం స్థానిక ఈమనిపాలెంలోని తరిమెల నాగిరెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా దివికుమార్ మాట్లాడుతూ వర్తమాన సమాజాన్ని కాలంచెల్లిన భూస్వామ్య, సామ్రాజ్యవాద విధానాలు అనేక రూపాల్లో పీడిత ప్రజల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజలకు అవసరం లేని వస్తువులను అంటగట్టి వస్తు వ్యామోహ సంస్కృతిని జనం మీద రుద్దుతున్నారని ఆరోపించారు. పాలకులు కార్పొరేట్‌ల కోసం సరళీకరణ ప్రైవేటీకరణ విధానాలను తీసుకువచ్చారని విమర్శించారు. కోశాధికారి శాంతికుమార్, జిల్లా కార్యదర్శి ప్రసన్న, సభ్యులు డీవీ.సత్యనారాయణ, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ అధ్యక్షుల నియామకం

- రాష్ట్ర కార్యదర్శి పల్లా శ్రీనివాసరావు ఉత్తర్వులు

నాగులుప్పలపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు మండలంలోని ఆరు గ్రామాలకు తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు, కార్యదర్శులను నూతనంగా నియమిస్తూ రాష్ట్ర కార్యదర్శి పల్లా శ్రీనివాసరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే నాగులుప్పలపాడుకు మాత్రం ప్రకటించలేదు. మిగిలిన గ్రామాలకు ప్రస్తుత అధ్యక్షులను కొనసాగిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉప్పుగుండూరు గ్రామ అధ్యక్షుడిగా కనగాల శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శిగా జంజనం సుబ్బయ్య, చీర్వానుప్పలపాడు అధ్యక్షుడిగా ఆళ్ల సాంబయ్య, ప్రధానకార్యదర్శిగా యమర్తి మహేష్, కండ్లగుంట గ్రామ అధ్యక్షుడిగా గుడిబండి ప్రభుదాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా దారా సురేష్, బి.నిడమానూరు అధ్యక్షుడిగా నలమలపు అంకిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా లక్కినబోయిన సౌలు, ఎం.ముప్పాళ్ల అధ్యక్షుడిగా మండవ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పులిపాటి బాబు, కె.తక్కెళ్లపాడు అధ్యక్షుడిగా నూతలపాటి శివశంకర్, ప్రధానకార్యదర్శిగా మద్దిరాల వీరాస్వామిలను నియమిస్తూ ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కార్యాలయం నియామక ప్రకటన జారీ చేసింది.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

- ఇబ్బందిపడుతున్న ఉద్యోగులు, ప్రజలు

పొన్నలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పొన్నలూరు త


తహసీల్దార్ కార్యాలయంలో పెచ్చులూడుతున్న స్లాబు

హసీల్దార్ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరుకుంది. 1990వ సంవత్సరంలో ఈ భవనం నిర్మించారు. కార్యాలయం పైకప్పు పెచ్చులూడి వర్షం వస్తే కార్యాలయం లోపల నీరు నిలిచి ఉంటుంది. రికార్డులు తడిసిపోయి ఇబ్బందిగా మారుతోంది. మండలంలో 24 గ్రామ పంచాయతీలకు సంబంధించిన కొన్ని వేల ఎకరాల భూములు ఉన్నాయి. నిత్యం ప్రజలు కార్యకలాపాల కోసం కార్యాలయానికి వస్తూ వెళుతుంటారు. దాదాపు 35 సంవత్సరాల నుంచి ప్రజలకు సంబంధించిన రికార్డులు కార్యాలయంలోనే భద్రపరిచారు. కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు పెచ్చులు ఊడి పడతాయని ఉద్యోగస్తులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్మార్ట్‌కార్డుల పంపిణీ

మద్దిపాడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా స్మార్ట్ రైస్‌కార్డులు ఇవ్వటం సంతోషదాయకమని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మండవ జయంత్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం బసవన్నపాలెంలో స్మార్ట్‌కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఆధునిక సాంకేతిక సదుపాయాలతో పారదర్శకంగా సేవలు పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కొప్పోలు విశ్వనాథం, తుమ్మల వీరాంజనేయులు, రెబ్బవరపు ప్రభాకరరావు, మండల గోవిందరాజులు, మండవ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు డీఏ ప్రకటించడంపై హర్షం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డీఏ ప్రకటించడం పట్ల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, పి.వరకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

బాణసంచా విక్రయకేంద్రాల పరిశీలన


దుకాణదారులతో మాట్లాడుతున్న డీఆర్వో చిన ఓబులేశు

ఒంగోలు(రూరల్), అక్టోబరు19 (ఆంధ్ర జ్యోతి):ఒంగోలులోని పీవీఆర్ ఉన్నత పాఠశాలలో మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ కేంద్రాలను ఆదివారం రాత్రి డీఆర్వో చినఓబులేశు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దుకాణాదారులతో మాట్లాడుతూ సరైన ధరలకు ప్రజలకు బాణసంచా అమ్మకాలు చేయాలన్నారు. అధిక ధరలకు విక్రయించవద్దని ఆయన చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు కొనుగోలు చేసేలా బాణసంచా ఉండాలన్నారు. ప్రమాదాలు జరగ కుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. ప్రజలు కూడా బాణసంచా కాల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్నమున్సిపల్ కమిషనర్

- అపస్మారకస్థితిలో పడిపోయిన వ్యక్తికి వైద్యసహాయం

కనిగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కనిగిరి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. అపస్మారకస్థితిలో తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో పడిఉన్న ఓ వృద్ధుడిని ఆదివారం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం సహాయం అందించారు. పట్టణంలోని పలు హోటళ్లలో వంటమాస్టర్‌గా, సర్వర్‌గా పనిచేస్తున్న రాజాల కోటిరెడ్డి (చిన్నా) అనారోగ్యం పాలయ్యారు. కుటుంబ సభ్యులు పట్టించుకోక, ఆదరించే దిక్కులేక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో గత మూడురోజులుగా సొమ్మసిల్లి పడిపోయిఉన్నాడు. అక్కడ ఉన్న ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, సిబ్బంది అతని అల్పాహారం, మంచినీళ్ళు ఇస్తూ ఉన్నారు. ఈక్రమంలో అనారోగ్యం మరింత క్షీణించింది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఈవిషయాన్ని స్థానికులు స్నేహహస్తం సంస్థకు సమాచారం అందించటంతో ఆసంస్థ ప్రతినిధులు కమిషనర్‌కు తెలియచేశారు. ఆదివారం ఉదయం పట్టణంలో పారిశుధ్య పనులు పర్యవేక్షణలో ఉన్న కమిషనర్ హుటా హుటీన అక్కడకు చేరుకుని అపస్మారక స్థితిలో పడిఉన్న వృద్ధుడిని ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తీసుకెళ్లాలని డాక్టర్లు తెలపడంతో వారి కుటుంబసభ్యులకు సమాచారం తెలపగా స్పందించ లేదు. దీంతో కమీషనర్ ఆర్డీవోకి సమాచారం తెలిపి కుటుంబసభ్యులను పిలిపించే ఏర్పాటు చేశారు. ఆర్డీవో ఆదేశాల ప్రకారం ఒంగోలు ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తామని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పట్టించుకోకపోవడం చట్టరీత్యా నేరమన్నారు.

పర్యాటకం అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

వేటపాలెం(చీరాల), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకరంగం అభివృద్ధికి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ చెప్పారు. ఆదివారం వేటపాలెం మండలం పొట్టిసుబ్బయ్యపాలెం తీరంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పొట్టిసుబ్బయ్యపాలెం నుంచి రామాపురం బీచ్ వరకు రోడ్డును విస్తరించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అలాగే మత్స్యకారులతో మాట్లాడారు. చెన్నై నుంచి అనధికారంగా తీరంలోకి చొరబడి వేట సాగించడంతో పాటు దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. గజ ఈతగాళ్లకు లైఫ్ జాకెట్స్, విజిల్స్ అందజేయాలని అధికారులకు సూచనలు చేశారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
1
సోమవారం 20 అక్టోబరు 2025



దివ్వెల.. దీపావళి

- అంతటా దీపావళి సందడి
- అప్రమత్తతతోనే ఆనందమయం
- బాణసంచా కొనుగోళ్ల కోలాహలం



(బాపట్ల, రేపల్లె, చీరాల, ఆంధ్రజ్యోతి)

దివ్వెల వెలుగు జిలుగుల పండుగ దీపావళి. దీపకాంతులతో ఇంటిని అలంకరించి అందరూ ఆనందంగా జరుపుకునే శుభదినం. దీపావళి జీవితాల్లో వెలుగులు తెస్తుందని అందరి విశ్వాసం. చెడుపై మంచి గెలుపునకు ప్రతీకగా.. అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగ దీపావళి. విజయపు వెలుగుల్ని అందరికీ పంచే వేడుక ఇది. జిల్లాలో సోమవారం నరక చతుర్థి(దీపావళి)ని వైభ వంగా జరుపుకునేందుకు చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా సిద్ధమయ్యారు. పట్టణాలు.. పల్లెల్లో దీపావళి సందడి నెలకొంది. సోమవారం మహాలక్ష్మీ పూజకు భక్తులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇళ్లు, వ్యాపార సంస్థలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించు కుంటున్నారు. మట్టి ప్రమిదల్లో నూనె దీపాలు వెలిగించి ఇళ్లను అలంకరించేందుకు మహిళలు సిద్ధమయ్యారు. మట్టి ప్రమిదలు.. బాణసంచా విక్రయాలకు ఎక్కడికక్కడ అధికారులు ఏర్పాట్లు చేశా రు. బాణసంచా విక్రయాలకు అధికారులు ప్రత్యేకంగా లైసెన్సులు మంజూరు చేశారు. గ్రామాల్లో సైతం టపాకాయల దుకాణాలు నెలకొన్నాయి. ఆయా దుకాణాల వద్ద ఆదివారం సాయంత్రం నుంచి కొనుగోళ్ల సందడి నెలకొంది. బాణసంచా ధరలు అధికంగా ఉన్నాయని కొనుగోలుదారులు తెలిపారు.

అప్రమత్తత అవసరం..

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు గా జరుపుకునే దీపావళి పండుగలో టపాసులది ప్రధాన పాత్ర. రంగు రంగుల కాంతులతో కను విందు చేస్తూ.. భారీ శబ్దాలు చేసే టపాకా యలను కాల్చేందుకు చిన్నారులతో పాటు పెద్దలు కూడా ఇష్టపడతారు. బాణసంచా కాల్చేటప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా వినోదం కాస్తా విషాదంగా మారుతుంది. ఈ పరిస్థితుల్లో అప్రమత్తతతో దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రమాదాల నివారణకు బాణసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు శాఖల వారీగా అధికారులు అవగాహన కల్పించారు.



రేపల్లె : జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దీపావళి బాణసంచా దుకాణాలు

టపాకాయలతో ప్రయోగాలొద్దు

టపాసులు కాల్చేటప్పుడు కొన్ని పేలకుండా ఆగిపోతాయి. అలాంటి వాటిని వెంటనే వెళ్లి పట్టుకోవడం వంటివి చేయకూడదు. వాటిని తిరిగి వెలిగించాలనే ప్రయత్నం చేయకూడదు. అలాంటి వాటిపై నీరు పోయడం మంచిది. తారాజువ్వలు, రాకెట్లు వంటి వాటి వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడైనా ప్రమాదం సంభవిస్తే 101, 100, 108 నెంబర్లకు సమాచారం అందించాలి.

కొనుగోళ్ల సందడి

అధికారికంగా, అనధికారికంగా పెద్దఎత్తున ఎక్కడికక్కడ బాణసంచా విక్రయ దుకాణాలు వెలిశాయి. ఆకాశం మేఘావృతమై ఉన్నా ఆదివారం సాయంత్రం నుంచి కొనుగోళ్ల సందడి నెలకొంది. టపాకాలయ కొనుగోళ్లకు పిల్లలు పెద్దలతో తరలిరావడంతో పట్టణాల్లో కోలాహల వాతావరణం నెలకొన్నది. ఆదివారం శెలవు ది నం కావడంతో ప్రజలు పూజాసామగ్రి కొను గోళ్లకు ఉత్సాహం చూపారు. గృహాలను అలంకరించేందుకు ఉపయోగించే ప్రమిదలు రకరకాల రంగులతో పాటు వివిధ ఆకృతుల్లో ఆకర్షించేలా అందుబాటులో ఉంచారు.

రేపు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం

- మంగళగిరి బెటాలియన్‌లో కార్యక్రమానికి హాజరుకానున్న సీఎం చంద్రబాబు
- రిహార్సల్ పరేడ్‌ను పరిశీలించిన ఎస్పీ వకుల్ జిందాల్



పోలీస్ అధికారులతో కలసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో మంగళవారం పోలీస్ అమర వీరుల సంస్మరణ దినం జరగనున్నది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు. ఈ క్రమంలో జరుగుతున్న ఏర్పాట్లను ఎస్పీ వకుల్ జిందాల్ ఇతర అధికారులతో కలసి ఆదివారం పరిశీలించారు. రిహార్సల్ పరేడ్ నిర్వహించగా, కార్యక్రమంలో డీఐజీ ఫకీరప్ప కాగినేల్లి, మల్లికాగార్గ్, సరిత తదితరులు పాల్గొని, పరిశీలించి పలు సూచనలు చేశారు. రిహార్సల్ సమ యంలో వీవీఐపీ, వీఐపీలకు ఆహ్వానం అందించే విధానం, పోలీస్ గౌరవ వంద నం సమర్పణ తీరుతెన్నులు, అమరవీ రులకు పుష్పాంజలి అర్పించే విధానం, పరేడ్ సమన్వయం, ఫొటోగ్యాలరీ వీక్షణ తదితర అంశాలను అధికారులు పరిశీలిం చారు. ప్రధాన కార్యక్రమానికి విచ్చేసే వీవీఐపీ, వీఐపీల రాకపోకల మార్గాల్లో బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, సభా ప్రాంగణంలో వారిని గౌరవించి ఆహ్వానించడానికి కేటాయించిన అధికా రుల విధులను ఎస్పీ సమీక్షించారు. కార్య క్రమంలో ఏఎస్పీలు రమణమూర్తి, ఏటీవీ రవికుమార్, సుప్రజ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



సూర్యలంక తీరం కిటకిట


వర్షంలోనూ తగ్గని పర్యాటకుల సందడి



బాపట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక సముద్రతీరంలో పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం ఉదయం నుంచి భారీవర్షం కురుస్తున్నప్పటికీ పర్యాటకులు తీరానికి వస్తూనే ఉన్నారు. సముద్రంలో స్నానాలు చేస్తూ సరదాగా గడిపారు. మధ్యాహ్నం తర్వాత వర్షం తగ్గిన తర్వాత పర్యాటకుల సంఖ్య గనణీయంగా పెరిగింది. దీపావళి సెలవులకు స్వగ్రామానికి స్నేహితులతో వచ్చినవారంతా సముద్రతీరాన్ని సందర్శించేందుకు ఆసక్తి చూపారు. గుర్రం, ఒంటె స్వారీతో పాటు స్పీడ్‌బైక్‌లపై పర్యాటకులు విహరించారు.







అప్రమత్తతతోనే ఆనందం

దీపావళి పండుగ వచ్చేసింది. అందరూ పండుగ మూడ్‌లోకి వచ్చేశారు. పిల్లలు, పెద్దలు అంతా కలిసి ఆనందోత్సాహాలలో మునిగి తేలి, సంబరాలు జరుపుకునే రోజురానే వచ్చింది. అయితే పండుగ వేడుకలు అంబరాన్నంటేలా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉవ్విళ్లూరుతున్నారు. దీపావళి టపాసులు కాల్చేందుకు ఎదురు చూస్తున్న ప్రజలు వేడుకలు విషాదంగా మారకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యులు సూచిస్తున్నారు. నిర్లక్ష్యంగా బాణసంచా కాల్చవద్దని పేర్కొంటున్నారు. అప్రమత్తతే ఆనందం అని వారు వెల్లడిస్తున్నారు.

దీపావళి వేడుకలు కారాదు విషాదం
పలువురు వ్యాధిగ్రస్తులకు పొంచివున్న ముప్పు
అశ్రద్ధ చేస్తే ప్రమాదం అంటున్న వైద్యులు
జాగ్రత్తలతోనే ప్రతి ఇంటా వెలుగులు



ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దీపావళి అంటేనే కుల, మతాలకు అతీతంగా పిల్లలు, పెద్దలు, ముఖ్యంగా యువత ఎంతో ఉత్సాహంగా జరుపుకునే పండుగ. గ్రామాలలో, పట్టణాలలో సోమవారం సాయంత్రం టపాసుల మోతలు.. తారాజువ్వల వెలుగులు, ఢాం.. ఢాం.. శబ్దాలు వినిపిస్తాయి. వాటితోపాటు మరోవైపు అన్నీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పొగ నిండుకుని ఉంటుంది. టపాసుల నుంచి వెలువడే పొగతో పలువురు వ్యాధిగ్రస్తులకు ముప్పు తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. టపాసులు పేల్చడం వల్ల గాలిలో దుమ్ము, కాలుష్య కారకాలు, సాంద్రత పెరుగుతుందని, కాల్చిన తర్వాత ధూళి కణాలు, రాగి, జింక్, సోడియం, సీసం, మెగ్నీషియం, కాడ్మియం, సల్ఫర్, నైట్రోజన్ ఆక్సైడ్‌లు వంటి కాలుష్య కారకాలతో నిండిన రేణువులు చుట్టపక్కల ఉపరితలాలపై స్థిరపడతాని, ఈ అదృశ్య హానికర కణాలు పర్యావరణాన్ని ప్రభావితం చేయడంతోపాటు, ఆరోగ్యాన్ని కూడా ప్రమాదంలో పడేస్తాయని తెలియజేస్తున్నారు. ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తగు జాగ్రత్తలతో పండుగ జరుపుకోవాలని సూచిస్తున్నారు. అప్రమత్తంగా ఉండటంలోనే ఆనందం ఉందని వివరిస్తున్నారు.

తగు జాగ్రత్తలతో బాణ సంచా కాల్చాలి



- డాక్టర్ వై.సునీల్‌కిషోర్, ప్లాస్టిక్ సర్జన్

దీపావళి బాణ సంచా కాల్చేటపుడు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా టపాసులు కాల్చేటపుడు కాళ్ళ, చేతులు, చర్మం కాలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. చర్మంపై గాయమైనపుడు ప్రథమ చికిత్సగా చర్మంపై మంట తగ్గేవరకు చల్లని నీరును గాయంపై ధారగా పోయాలి. అనంతరం వైద్యుడిని సంప్రందించి తగు చికిత్స తీసుకోవాలి. గాయం అయినప్పుడు పేస్టులు పూయడం, ఇంకు రుద్దడం, పసుపు పూయడం వంటి పనులు చేయకూడదు. గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న చర్మవైద్యులు, ప్లాస్టిక్ సర్జన్‌ను సంప్రదించాలి. పొగ ఎక్కువగా ఉండే టపాసులు కాల్చడం వలన శ్వాశ కోశ వ్యాధులు వస్తాయి. పెద్ద పెద్ద శబ్దాలు వచ్చే టపాసులు కాల్చడం వలన చెవి, కంటి సమస్యలు వస్తాయి. టపాసులు కాల్చేటపుడు కళ్ల జోడు పెట్టుకుని కాల్చితే చాలా ప్రయోజనకరం.

పొగను అశ్రద్ధ చేస్తే వచ్చే వ్యాధులు

- కళ్ల మంటలు, ఊపిరితిత్తుల్లో నెమ్ము
- గొంతు వాపు, జలుబు, తలనొప్పి, ఛాతీలో బరువు
- శ్వాస కోశ ఇబ్బందులు
- టపాసుల పొగ పీల్చాక పది, పదిహేను నిమిషాల్లో సల్ఫర్ డై ఆక్సైడ్ ప్రభావం చూపుతుంది.
- మానసిక, నరాల సమస్యలు
- రక్త సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ కారక వ్యాధులు
- గుండె జబ్బులు, నిద్రలేమి, వినికిడి శక్తి తగ్గిపోవడం, హై బీపీ



ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- టపాసులు కాల్చేటపుడు శరీరానికి బిగుతుగా ఉండే దుస్తులు ధరించరాదు
- శిల్క్ దుస్తులు ధరించరాదు, కాటన్ దుస్తులు మాత్రమే వేసుకోవాలి
- పేలుడు పదార్థాలు కాల్చేటపుడు పెద్దలు, చిన్నారుల దగ్గరే ఉండాలి
- సగం కాలిన టపాసులు వద్దకు వెళ్లకూడదు
- ఇరుకుగా ఉండే నివాసాలు, పూరిగుడిసెలు మధ్యన టపాసులు కాల్చరాదు
- టపాకాయలు పేల్చేటపుడు నీరు, ఇసుకను దగ్గర ఉంచుకోవాలి
- తారాజువ్వలను నిలువుగా కాల్చాలి
- చేతుల్లో టపాకాయలను కాల్చరాదు.
- చిచ్చుబుడ్డులు చేతిలో ఉంచి కాల్చరాదు
- నివాసాల్లో టపాసుల నిల్వ ఉంచినపుడు పిల్లలకు అందకుండా ఉంచాలి
- టపాసులను పొడవాటి సాంబ్రాణి కడ్డీలతో అంటించడం ఎంతో మేలు
- టపాసులు కాల్చేటపుడు మూతికి గుడ్డ కట్టుకోవాలి

జిల్లాలో 8.2 మి.మీ.వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 8.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. చీమకుర్తిలో 66.6, మద్దిపాడులో 59.2, పీసీపల్లిలో 31.2, వెలిగండ్లలో 30.0, పామూరులో 25.2, కనిగిరిలో 23.6, నాగులుప్పలపాడులో 10.8, సింగరాయకొండలో 10.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. పలు ఇతర మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

దీపావళిని ప్రశాంతంగా జరుపుకోవాలి

● ఎస్పీ హర్షవర్ధనరాజు

ఒంగోలు క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):దీపావళి పండుగను జిల్లా ప్రజలు సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని ఎస్పీవి.హర్షవర్ధనరాజు కోరారు. ఈసందర్భంగా జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా అక్రమంగా బాణసంచా విక్రయిచే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు దీపావళి టపాసులు కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. దీపావళి రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగితే 101,100,112 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్పీ సూచించారు.ఒకా వాట్సప్ నంబరు 9121102266కు తెలియజేయాలని కోరారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	250.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	260.00

పోలీసు అమరవీరులకు వందనం

రేపు సంస్మరణ దినం
ఇప్పటివరకు అమరులైన ఏడుగురు పోలీసులు
పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ప్రత్యేక నివాళి

పోలీసు అంటే త్యాగానికి నిరతి.... ప్రజలకు భద్రత కల్పిస్తూపహారా కాసేది పోలీస్.. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, కంటి మీద కునుకు లేకుండా విధులు నిర్వహించేది పోలీస్.. సంఘవిద్రోహ శక్తుల పాలిట సింహస్వప్నంలా మెలుగుతూ తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి శాంతిభద్రతలకు రక్షణ కల్పించేది పోలీస్.. విధి నిర్వహణలో ప్రజల కోసం నేలకొరిగి తమత్యాగాన్ని చాటి చెప్పేది పోలీస్.... అలాంటి పోలీసు శాఖలో ఖాకీ యూనిఫాం వేసుకొని పనిచేయడం జాతి గర్వించదగ్గ విషయం.

ఒంగోలు క్రైం,అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం ప్రాణాలు అర్పిస్తున్న పోలీసు శాఖలో పని చేస్తూ విధినిర్వహణలో నేలకొరిగిన అమరులకు సలాం చేద్దాం .1995 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఏడుగురు పోలీసులు విధినిర్వహణలో అసువులు బాశారు. వారందరికీ పేరు పేరున సెల్యూట్ చేస్తూ మంగళవారం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ వి.హర్షవర్ధనరాజు నేతృత్వంలో ప్రత్యేక నివాళులు అర్పించనున్నారు.

పోలీసు అమరవీరుల దినోత్సవం

దేశంలో ప్రతి సంవత్సరం ఆక్టోబరు 21న పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తారు. విధినిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ ఈ కార్యక్రమం జరుపుతారు. 1959 అక్టోబర్ 21న లడఖ్ ప్రాంతంలో హాట్‌స్ప్రింగ్ వద్ద చైనాసైనికులు జరిపిన దాడిలో పదిమంది భారతీయ పోలీసు బలగం వీరోచిత పోరాటం చేసి వీరమరణం పొందారు. వారి త్యాగాలకు గుర్తుగా అప్పటి నుంచి పోలీసు అమరవీరల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

విధి నిర్వహణలో అసువులు బాసిన అమర పోలీసులు

శత్రువు తూటా గుండెలో దిగినా కర్తవ్యంను విస్మరించకుండా ఎదురుకాల్పులు జరిపిన పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ సీవీ రత్నం 1995 డిసెంబరు 1న ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో ఒంగోలు ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి వద్ద పీఎస్‌వోగా ఉన్న రత్నం నక్సలైట్ల తూటాకు బలయ్యాడు. సుబ్బారామిరెడ్డిని కిడ్నాప్ చేసేందుకు వచ్చిన నక్సలైట్లపై ఎదురు తిరిగిన రత్నం వీరమరణం పొందారు.

● 2001జూన్ 3న పుల్లలచెరువు మండలం మర్రివేములలో ప్రభుత్వం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో విధులు నిర్వహించి వెళుతుండగా నక్సలైట్లు జరిపిన కాల్పులలో ఏఎస్సై కే.ప్రశాంతరావు ఆసువులు బాశారు.

● 2008 జూన్ 29 న బలిమెలలో పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పులలో జూనియర్ కమాండో కొండపి మండలం పెరిదేపికి చెందిన మోటా ఆంజనేయులు అమరుడయ్యారు.

● గుడ్లూరు మండలం రామాయపట్నంకు చెందిన లీలాశంకర్ బలిమెల ఘట[...] వెంకటా ఆంజనేయులు తో ప్రాణాలు కోల్పోయారు.

● 2009 సెప్టెంబర్ 2న ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కుప్ప కూలింది. ఆయన వద్ద భద్రతాధికారిగా పనిచేసిన ఒంగోలుకు చెందిన అద్దంకి సాల్మన్‌కేరీ వెస్లీ దుర్మరణం చెందారు.

రేపు అమరజవాన్ స్థూపం వద్ద ప్రత్యేక నివాళి

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ హర్షవర్ధనరాజు నేతృతంలో పోలీసు అమరవీరులకు ప్రత్యేక నివాళి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వీరజవాన్ స్థూపం వద్ద విధినిర్వహణలో అమరులైన పోలీసు కుటుంబాలను సత్కరిచనున్నారు. అదే సమయంలో పోలీసు అమరవీరులకు ఘననివాళి అర్పించనున్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో అమరజవాన్ల కోసం ఏర్పాటు చేసిన స్థూపం

● 2010 మే 5న లైలా తుఫాన్ సందర్భంగా అద్దంకిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మార్టూరు మండలం కోనంకికి చెందిన షేక్ మహమ్మద్ రఫీ విధినిర్వహణలో ఉండగా అద్దంకి నల్లవాగు ఉధృతిలో ఆర్టీసీ కండక్టర్ యానాదిరావు కొట్టుకుపోతున్నాడు. ఆయనను కాపాడేందుకు వాగులోకి దూకిన మహమ్మద్ రఫీ ,యానాదిరావును కాపాడి తనప్రాణాలు కోల్పోయారు.

● 2023 మే 24న చీమకుర్తికి చెందిన పవన్ కుమార్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అమరావతిలోని తుళ్లూరు వద్ద విధులు నిర్వహిస్తూ పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయారు.



శ్రీ ప్రతిభా కళాశాలలో కేఎల్ యూనివర్శిటీ మెరిట్ స్కాలర్‌షిప్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నవంబరు 14 నుంచి 'ప్రతిభా' పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీ విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు క్యాంపస్‌లలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ప్రతిభా పరీక్షలను నవంబరు 14నుంచి 18వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కేఎల్ యూనివర్శిటీ అడ్మిషన్ విభాగం డైరెక్టర్ డాక్టర్ జే శ్రీనివాసరావు తెలిపారు. ఒంగోలు సమీపంలోని శ్రీ ప్రతిభా కళాశాల ఆవరణలో ఆదివారం 'భవిష్యత్‌కు బంగారు బాట- కేఎల్ యూనివర్శిటీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ పరీక్షల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ. 100 కోట్ల మేర మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు తెలిపారు. కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రపంచ సాంకేతిక సవాళ్ళకు అనుగుణంగా సమగ్ర నైపుణ్యాభివృద్ధి దిశగా విద్యా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. గడిచిన 20 ఏళ్లుగా ప్రతిభ ఆధారితంగా విద్యార్థి నైపుణ్యం మేరకు సంవత్సరానికి రూ. 40నుంచి 70 లక్షల వరకు అత్యధిక వేతనాలు పొందిన వారు కూడా ఉన్నారని తెలిపారు. అనంతరం మెరిట్ స్కాలర్‌షిప్ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభా విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్, కే ఎల్ యూనివర్శిటీ ప్రతినిధులు డాక్టర్ జేవీ షణ్ముకకుమార్, శివరామకృష్ణ, కే రాంబాబు, పీ అంజనేయ వరప్రసాదరావు, ఆర్‌శేఖర్‌బాబు, ఎ.మస్తాన్‌వలి, షేక్ నయూబ్, పార్థసారథి, కల్యాణ్, చంద్రశేఖర్, పవిత్ర ఉన్నారు.



బస్సుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

పాకల బీచ్‌కు ప్రత్యేక బస్సులు ప్రారంభం

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో పాకల బీచ్ వద్దకు ఏర్పాటు చేసిన బస్సులను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ మేరకు ఒంగోలులో నగరపాలక సంస్థ కమిషనర్ కే. వెంకటేశ్వరరావు, కనిగిరిలో మునిసిపల్ చైర్మన్ షేక్ గఫూర్, మార్కాపురంలో సీఐలు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డిపో మేనేజర్ ఘట్టమనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ సింగరాయకొండకు ఎనిమిది కిలోమీటర్లు దూరంలో ఉన్న పాకల బీచ్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రకాశం రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు ప్రతి ఆదివారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఈ బస్సులలో మహిళలకు స్త్రీ శక్తి పథకం అమలు అవుతుందని వివరించారు.

సీఎం సానుకూల దృక్పథం అభినందనీయం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూల దృక్పథంతో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం అభిందనీయమని ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు అన్నారు. స్థానిక ఎన్‌జీవో భవన్‌లో ఆదివారం జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీపావళి కానుకగా నవంబరు నెల నుంచి ఒక డీఏను విడుదల చేస్తామని ప్రకటించడం శుభపరిణామన్నారు. మహిళా ఉద్యోగులకు వారి సర్వీసు మొత్తంలో ఎప్పుడైనా చైల్డ్ కేర్‌లీవ్ వినియోగించుకునే అవకాశం కల్పించడంతో పాటు త్వరలోనే మంచి పీఆర్సీ ఇస్తామని చెప్పడంపై ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తం అవుతుందని తెలిపారు. రానున్న కాలంలో ఉద్యోగుల సమస్యలన్నీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ నేతృత్వంలో ప్రభుత్వం సామరస్యధోరణితో పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఉద్యోగుల హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ కోశాధికారి శివకుమార్, ప్రతినిధులు ఎం.వెంకటేశ్వరరావు, తోట శ్రీనివాస్, రామాంజనేయులు, చిరంజీవిరావు, కృష్ణకిషోర్, ఏడుకొండలు, షేక మోమిన్, విజయకుమార్, కొత్తపల్లి మంజేష్, షేక్ మగ్దుం షరీఫ్, పి. మాధవి, కోటేశ్వరమ్మ, సీహెచ్ శిరీష తదితరులు ఉన్నారు.

అనస్థీషియాలజిస్ట్స్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలజిస్ట్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. స్థానిక కేబీ రెసిడెన్సీలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఒంగోలుకు చెందిన డాక్టర్ పి. దుర్గా ప్రసాదరావు ఎన్నికయ్యారు. అలాగే ప్రెసిడెంట్ ఎలక్ట్‌గా డాక్టర్ అచ్యుతరామయ్య, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ డీవీ. మహేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్లు రాజశేఖర్ రెడ్డి, పద్మజ, రాకేష్, వినీల, ఉదయ్ శంకర్, అనిల్ కుమార్‌లు ఎన్నికయ్యారు. పూర్వ అధ్యక్షుడు డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాసరావు నుంచి బాధ్యతలు తీసుకున్న అనంతరం నూతన కార్యవర్గం పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ హాస్పిటల్స్‌లో, ఆపరేషన్ థియేటర్‌లో, ఇంటెన్సివ్ కేర్‌యూనిట్‌లలో పేషెంట్ సేఫ్టీ కొరకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ వినయ్ కుమార్, సెక్రటరీ డాక్టర్ ద్వివ, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మోహన్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ శ్రీనివాస్ యాదవ్‌తోపాటు, పూర్వపు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కుచేల బాబు, ఒంగోలు శాఖ అధ్యక్షుడు డాక్టర్ చలపతి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ రజని, సెక్రటరీ డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇండియా సొసైటీ ఆఫ్ అనస్థీయాలజిస్ట్ (ఏపీ ఐఎస్ఏ)లోగోను ఆవిష్కరించారు.

కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు ఆదివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆనందోత్సాహాలతో ఈ పండుగ జరుపుకోవాలని, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. బాణసంచా కాల్చే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అడ్డదారుల్లో గ్రానైట్ అక్రమ రవాణా

నిబంధనలకు విరుద్ధంగా తరలింపు
కుంగిపోతున్న గ్రామీణ రహదారులు
ఏఎంఆర్ సంస్థ రంగంలోకి వస్తే అడ్డుకట్టపడుతుందని ఓనర్ల ఎత్తు
పట్టని అధికార యంత్రాంగం

నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ యజమానులు అడ్డదారుల్లో ముడి రాళ్లను అక్రమంగా తరలిస్తున్నారు. భారీవాహనాల్లో అధిక లోడుతో వెళ్తున్న వాహనాలతో గ్రామాల్లోని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వాహనాల నుంచి ఎప్పుడు రాయి కిందపడుతుందో తెలియనంత వేగంగా వెళుతున్నాయి. పైగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వేసిన తారురోడ్లు సైతం అధిక లోడు వాహనాల తాకిడితో దెబ్బతింటున్నాయి. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకున్నట్లుగా సీనరేజీ వసూలుకు ఏఎంఆర్ సంస్థ రాకముందే క్వారీల నుంచి ముడి రాళ్లను యజమానులు గుళ్లాపల్లిలోని ఫ్యాక్టరీలకు తరలించి నిల్వ చేసుకుంటున్నారు.



పరిమితికి మించిన గ్రానైట్ రాళ్లతో నేకునంబాదు నుంచి దొడ్డవరం వైపు వెళ్తున్న టిప్పర్

చీమకుర్తి,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): రామతీర్థం పరిసరప్రాంతాల్లో విస్తరించిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ క్వారీలనుంచి ముడిరాయిని ఇష్టారీతిన బిల్లులు లేకుండా అడ్డదారుల్లో గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌కు తరలిస్తున్నారు. దీపావళి పండగ తర్వాత సీనరేజి వసూలు హక్కులు పొందిన ఏఎంఆర్ సంస్థ రంగంలోకి వస్తే తమ అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని భావించిన గ్రానైట్ యజమానులు దీపం ఉండగానే ఇళ్ల చక్కదిద్దుకుందామనే ఆలోచనతో ముడిరాళ్లను ముందస్తుగా తమ ఫ్యాక్టరీల్లో ప్రోదిచేసుకుంటున్నారు.ఈ క్రమంలో ఈ అక్రమ రవాణాకు ఒడిగడుతున్నారు.



భారీ వాహనాల తాకిడితో గుంతలు పడిన ఇటీవల వేసిన తారు రోడ్డు

ధ్వంసం అవుతున్న రహదారులు...

రామతీర్థం నుంచి గ్రానైట్ ముడిరాళ్లను అడ్డదారిలో అధికారులు ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల నుంచి తప్పించుకోవటానికి పల్లామల్లి, నేకునంబాదు, దొడ్డవరం, వెల్లంపల్లి మీదుగా గ్రోత్‌సెంటర్‌కు భారీ ఎత్తున ఓవర్‌లోడుతో విచ్చలవిడిగా, ప్రమాదభరితంగా రవాణా చేస్తున్నారు.నేకునంబాదు నుంచి దొడ్డవరంకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతనంగా బీటీ రహదారిని కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించింది. ఇపుడు ప్రమాదకరంగా భారీ లోడుతో వెళ్తున్న వాహనాల వలన రహదారి పలుచోట్ల ఛిద్రం అయ్యింది.రహదారి నిర్మించిన సంతోషం నెలలు కాకముందే ఆవిరయ్యింది. ఇప్పటికే పల్లామల్లి తదితర ప్రాంతాల్లో నిర్మించిన రహదారులు అడ్డదిడ్డ రవాణాతో ధ్వంసమయ్యాయి.ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవటం గమనార్హం.

ఏఎంఆర్ వస్తే తమ ఆటలు సాగవని...

అక్టోబరు ఒకటో తేదీనుంచి గ్రానైట్ ముడిరాళ్ల సీనరేజి వసూలు హక్కులను టెండర్ ద్వారా ఏఎంఆర్ సంస్థ దక్కించుకుంది.గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్లు వీరి రాకను వ్యతిరేకిస్తూ దాదాపు 14రోజులు సమ్మె చేయటం తదుపరి మంత్రులు,ఎమ్మెల్యేలు ఇచ్చిన స్పష్టమైన హామీ మేరకు సమ్మె విరమించి ఫ్యాక్టరీలను నడుపుతున్నారు.సీనరేజి హక్కులు పొందిన ఏఎంఆర్ సంస్థ దీపావళి తర్వాత ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొని వసూలు కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఈ సంస్థ ఇప్పటికే రాళ్ల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే విధంగా పలు చర్యలు చేపట్టింది.ప్రతి క్వారీ ఎదుట కంటైనర్ ఏర్పాటుచేసి దానిలో సీసీ కెమెరాలు,అనుక్షణం రవాణాని పర్యవేక్షించేవిధంగా ఉద్యోగులను నియమించింది.వీరి కళ్లుగప్పి బిల్లులు లేకుండా ముడిరాళ్లను క్వారీలనుంచి బయటకు తరలించే అవకాశం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. ఇదంతా గమనించిన ఓనర్లు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా భారీ స్థాయిలో రాళ్లను తరలిస్తున్నారు. ఇదంతా తమకు పట్టనట్లు మైన్స్ అధికారులు వ్యవహరిస్తుండటంతో గ్రానైట్ ఓనర్లకు అక్రమ రవాణా వరంగా మారింది.



ఎంపీకి గోడు వెళ్లబుచ్చుకుంటున్న కార్మికులు (ఫైల్)

మా బతుకులకు పండుగల్లేవ్!

● ఐదు మాసాలుగా అందని వేతనాలు ● కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

చీరాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రాంతీయ వైద్యశాల కాలానుగుణంగా అభివృద్ధి చెందింది గానీ, 30 పడకలు ఉన్న సమయంలో 25 మంది కార్మికులు మాత్రమే ఇక్కడ విధుల నిర్వహిస్తున్నారు. ఏళ్ల గడుస్తున్నా.. బెడ్లు పెరుగుతున్నా, కార్మికుల సంఖ్య పెరగక సిబ్బంది కొరత వేధిస్తోంది. నేటికీ అదే సంఖ్యలో సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్న అరకొర సిబ్బందికి పని భారం పెరిగింది. అయినా కూడా అలుపెరుగని సేవలు చేస్తున్న కార్మికులకు నెలలు తరబడి వేతనాలు అందడం లేదు. దీంతో మెతుకులు లెక్క బెట్టుకుంటూ బతుకు పోరాటం చేస్తున్నారు. ఇళ్లల్లో నెలవారీ వాయిదాలు, మెడికల్, నిత్యవసరాలు వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. వారిపట్ల అధికారులు దయచూపాలని వేడుకుంటున్నారు. ఈక్రమంలోనే ఇటీవల సాక్షాత్తు ఎంపీ కృష్ణ ప్రసాద్‌కు సైతం కార్మికులు గోడు వెళ్లబుచ్చుకున్నారు. అయినా నేటికీ వారికి జీతాలు అందకోవడంతో వేదన పడుతున్నారు.

కనిపించని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు

ఇక్కడ వైద్యశాలలో పనిచేస్తున్న కార్మికులు ఓ కాంట్రాక్ట్ సంస్థ ద్వారా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నట్లు వైద్యశాల అధికారులు తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహించిన సిబ్బంది హాజరును మాత్రం వారికి ఫోన్ ద్వారా పంపుతామన్నారు. పై స్థాయిలోనే వారు ప్రభుత్వం నుంచి నిధులు జమ చేసుకొని తర్వాత ఇక్కడి సిబ్బందికి వేతనం చెల్లిస్తారన్నారు. గతంలో కంపెనీ పీఆర్‌వోలు ఒకరిద్దరూ అందుబాటులో ఉండేవారని ప్రస్తుతం వారు కూడా లేరన్నారు. ఇటీవల ఎంపీ పర్యటన సమయంలో ఇదే అంశం చర్చకు రాగా, ఆ తర్వాత కూడా కంపెనీ ప్రతినిధులు ముందుకు రాలేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం

వైద్యశాలలో కార్మికులకు వేతన సమస్యలు వాస్తవమే. అయితే వీటిపై ఉన్నతాధి కారులకు సిఫారసు చేశాం. వైద్యశాలలో మెరుగైన సేవలకు కృషి చేస్తాం. సిబ్బంది సమస్యలపై దృష్టి సారిస్తున్నాం.

\- పేట శ్రీకాంత్, హాస్పిటల్ సూపరిండెంట్

చీరాల ప్రాంతీయ వైద్యశాలలో కాంట్రాక్టు కార్మికులు ఐదు మాసాలుగా వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. రోజంతా వైద్యశాలలో రోగులకు సేవలు అందిస్తున్నప్పటికీ వేతనం అందడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం వైద్యశాలలో 25 మంది పారిశుధ్య కార్మికులు కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్నారు. గతంలో చీరాల్లో 30 పడకల హాస్పిటల్ మాత్రమే ఉండేది. కానీ మారుతున్న కాలానుగుణంగా ఆధునికీకరణ నేపథ్యంలో హాస్పిటల్ అభివృద్ధి చెంది 100 పడకల వైద్యశాలగా రూపాంతరం చెందింది. తాజాగా క్రిటికల్ కేర్ యూనిట్‌తో అదనంగా మరో 50 బెడ్లు కూడా రానున్నాయి. ప్రస్తుతం 11 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునికంగా మారి మార్టూరు, చినగంజాం, పర్చూరు, చీరాల, వేటపాలెం, కారంచేడు వంటి ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తోంది. ఈ క్రమంలో ఇక్కడ నిత్యం సుమారు 300 - 450 వరకు ఓపీలు ఉంటుంటాయి. ఈక్రమంలో సిబ్బంది సమస్య మరింత పెరుగుతుంది.

రోడ్లు గుల్ల

దమ్ము చక్రాలతో దెబ్బతింటున్న రహదార్లు

పట్టించుకోని రవాణా శాఖ అధికారులు



చెన్నుపల్లి వైదన రోడ్డులో దమ్ము చక్రాల ట్రాక్టర్లు తిరగటంతో గాడులు పడి దెబ్బతిన్న రోడ్డు

బల్లికురువ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోట్లు వెచ్చించి అభివృద్ధి పరిచిన తారు రోడ్లు దమ్ము చక్రాల ట్రాక్టర్లతో రోజురోజుకు గుల్ల అవుతున్నాయి. మండలంలోని చెన్నుపల్లి-వైదన రోడ్డును ప్రభుత్వం ఇటీవల రూ.3 కోట్లు వెచ్చించి అభివృద్ధి పరిచింది. కానీ తారు రోడ్డు మొత్తం ఇప్పుడు దమ్ముచక్రాల తాకిడికి గాడులు పడిపోయాయి. అంబడిపూడి కొమ్మినేనివారిపాలెం గ్రామాల మధ్య అభివృద్ధి పరిచిన తారు రోడ్డు అంచులు మొత్తం ఇనుప చక్రాల దెబ్బకు కట్ అయి పోతున్నాయి. బల్లికురవ సంతమాగులూరు, బల్లికురవ అద్దంకి, బల్లికురవ కొమ్మాలపాడు గ్రామాల మధ్య తారు రోడ్డు కూడా దమ్ము చక్రాల దెబ్బకు గుల్ల అయ్యింది. ఇప్పటికైనా రైతులకు మెరుగైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

● పరామర్శించిన మంత్రి రవికుమార్

మేదరమెట్ల, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : వరసగా వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పులబాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని దైవాలరావూరుకు చెందిన చిట్టినేని బాబూరావు (44) వ్యవసాయంలో నష్టం రావడంతో ఈ నెల 16న ఒంగోలు సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత పొలం కౌలుకు తీసుకొని సాగుచేసి నష్టాలు రావడంతో ఆందోళనకు గురైన బాబూరావు ఆత్మహత్య చేసుకోవాలనే తీవ్రమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. రూ.40 లక్షల అప్పులు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాబూరావుకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదివారం మంత్రి రవికుమార్ పరామర్శించి ఓదార్చారు. రైతు కుంటుబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఆయన వెంట సొసైటీ అధ్యక్షుడు మద్దినేని రామస్వామి, మాజీ సర్పంచ్ చెన్నుపాటి హరిబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు ముమ్మన నరసింహారావు, బాచిన బాలకోటయ్య ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు

● పట్టణంలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి ● మంత్రి గొట్టిపాటి రవికుమార్



పింఛన్‌లు, రేషన్‌కార్డుల సమస్యను మంత్రి రవికుమార్‌కు వివరిస్తున్న మహిళలు

అద్దంకి, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చిన అర్హులందరికీ, ఇళ్లమంజూరు చేయనున్నట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పట్టణంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రవికుమార్ మాట్లాడుతూ అర్హులైన అందరికీ, రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో అర్హులందరికీ, పింఛన్ల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. అద్దంకి పట్టణంలో పక్కా ప్రణాళికతో మౌలిక వసతుల కల్పన చేపడుతున్నట్లు తెలిపారు. కాకానిపాలెంలో రోడ్డు, సైడ్‌డ్రైన్ల నిర్మాణం చేపట్టాలని స్థానిక మహిళలు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకువచ్చారు. మినీ బైపాస్ రోడ్డు ఏర్పాటుకు త్వరలో నిధుల కేటాయించనున్నట్లు మంత్రి రవికుమార్ తెలిపారు. ఆదానీ గ్రూప్ సహకారంతో రూ.3.40 కోట్లతో అద్దంకి టౌన్ హాల్ నిర్మాణం పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అద్దంకికి డయాలిసిస్ సెంటర్, ఏఆర్టీ సెంటర్‌లు మంజూరు కావటంతో వైద్య సదుపాయాలు మరింత మెరుగు కానున్నాయన్నారు. పట్టణంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను మంత్రి రవికుమార్ పరామర్శించి ఓదార్చారు.



మృతులకు ఉపాధి మస్టర్లు

సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెలుగుచూసిన వైనం

ఉపాధి పనుల్లో మృతులకు మస్టర్లు వేసిన వైనం సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెలుగు చూసింది. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 17వ విడత తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో శనివారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమైంది. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకల్లా ముగిసింది. పగటి వేళలో కొనసాగాల్సిన ప్రజావేదిక రాత్రి వేళలో కార్యాలయంలో కొనసాగడం గమనార్హం. అర్ధరాత్రి వేళ ప్రజావేదిక కొనసాగింపుపై అధికారులు ఎవరూ స్పందించకపోవడం గమనార్హం.

సంతమాగులూరు అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు మండలం వ్యాప్తంగా 2024-25వ సంవత్సరంలో నిర్వహించిన పనులుకు గాను సామాజిక తనిఖీ బృందం ఈనెల 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు 20 గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రజావేదికలో డ్వామా పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని 20 గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించామన్నారు. దాదాపుగా రూ.14 కోట్ల రూపాయల మేర పనులు చేపట్టారన్నారు. అందులో కూలీలకు వేతన రూపంలో రూ.10.33 లక్షల ఉపాధి కార్మికులకు చెల్లించినట్లు తెలిపారు. ప్రజా వేదికలో ఆడిట్ బృందం మస్టర్ పొరపాటుతో పాటుగా చనిపోయిన వారికి ఉపాధి హామీ పనులలో డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. అక్కడక్కడా పనుల్లో కొలతలు తేడాలు వచ్చాయన్నారు. కొన్ని పనులపై సంపూర్ణ విచారణ చేస్తున్నట్లు తెలిపారు. నిధుల్లో అవకతవకల బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీ డీబీ.సింగయ్య, డీవీవో జే.చంద్రశేఖర్, గౌశంకర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ తేలప్రోలు రమేష్, ఎంపీపీ యలమంద, డీపీఎం సనిత, ఎంపీడీవో జ్యోతిర్మయి, ఏపీవో బాలకృష్ణ నాయక్, పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు, ఉపాధి హామీ సిబ్బంది, సోషల్ ఆడిట్ బృందం, మండల నాయకులు పాల్గొన్నారు.

మృతదేహం ఆచూకీ లభ్యం



శ్రీనివాసరావు (ఫైల్)

మార్టూరు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఇసుకదర్శి నుంచి వలపర్ల వెళ్లే మట్టిరోడ్డులో బావిలో అనుమానస్పదంగా మృతిచెందిన వ్యక్తి వివరాలను పోలీసుగు గుర్తించారు. వివరాలను సీఐ ఎం.శేషగిరిరావు వివరించారు. మండలంలోని ఇసుకదర్శి గ్రామానికి చెందిన మారెళ్ల శ్రీనివాసరావుగా మృతుని కుటుంబసభ్యులు గుర్తించారన్నారు. ఆయనకు భార్య రేణుక, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలకు వివాహాలయ్యాయి. గ్రామంలో సొంతపొలంలేని ఆయన కౌలుకు పొలం తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. తరచూ మద్యం సేవించే అలవాటు ఉన్న శ్రీనివాసరావు, తరచూ ఇంటి నుంచి బయటకు వెళ్లి కొన్నిరోజుల తర్వాత ఇంటికి వచ్చేవాడన్నారు. ఈనెల 12వ తేదీ భోజనం చేసి ఇంటి నుంచి బయటకు వెళ్లిన తర్వాత కనిపించలేదన్నారు. కానీ పోలీసులు శనివారం బావిలో నుండి మృతదేహాన్ని బయటకు తీసిన తర్వాత శ్రీనివాసరావును గుర్తించినట్లు తెలిపారు. కోనంకి రెవెన్యూ పరిధిలోని బావిలో మృతదేహం లభ్యమైంది. శవ పంచనామా నిర్వహించి ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

పేదల ఆరోగ్య రక్షణకు అండగా ప్రభుత్వం

విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే కొండయ్య

అద్దంకి, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య సంరక్షణకు అండగా ప్రజా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సీఎం చం ద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం సంస్కర ణలను తీసుకొస్తుందన్నారు. నియోజకవర్గం లోని పలు గ్రామాలకు చెందిన 30 మంది అనారోగ్యంతో పలు వైద్యశాలలలో చికిత్సలు చేయించుకోగా వైద్యఖర్చులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన సుమారు రూ.30 లక్షల చెక్కులను మంత్రి రవికుమార్ చిలకలూరిపేటలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. కార్య క్రమంలో ఆయా గ్రామాల నేతలు పాల్గొన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య


చెక్కును అందజేస్తున్న మంత్రి రవికుమార్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చీరాల : కూటమి ప్రభుత్వం సామాన్య పేద ప్రజలకు అండగా ఉంటుందని, మునుపెన్నడూ లేనివిధంగా అత్యవసర వైద్యసాయం పొందిన వారికి పారదర్శకంగా సహకారం అందిస్తోందని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఆదివారం 62 మంది లబ్దిదారులకు రూ.55 లక్షల విలువైన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండేళ్లలోపే నియోజకవర్గంలో 510 మందికి రూ.5.35 కోట్లు ఆర్థికసాయం అందించినట్లు వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు ఉన్నారు.

మినుము రైతులను కలవరపెడుతున్న వర్షం

ఆగని వర్షపుజల్లులతో రైతుల్లో ఆందోళన

పంగులూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో నిత్యం కురుస్తున్న వర్షం మినుము రైతులను కలవరపెడుతోంది. ఖరీఫ్‌లో సాగుచేసిన మినుము కోతదశకు చేరింది. ఈ తరుణంలో నెలకొన్న అసాధారణ వాతావరణ పరిస్థితులతో పంట చేతికి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

మండలంలోని కొండమూరు గ్రామంలో వందలాదిమంది రైతులు ఖరీఫ్ పంటగా మినుముసాగు చేపట్టారు. వాతావరణ పరి స్థితులు అనుకూలించక పోవడంతో దిగుబడులు పూర్తిగా తగ్గాయి. ఈ నేపథ్యంలో కొద్దిరోజులుగా పడుతున్న వర్షంతో పంట కోతలు కూడా నిలిచిపోయాయి. రుతుపవనాల అను కూలత కారణంగా కొద్ది రోజులపాటు వర్షాలు పడతాయన్న వాతావరణశాఖ హెచ్చరికలు మినుము రైతును మరింత వేదనకు గురి చేస్తున్నాయి. ఖరీఫ్ సాగుకు వాతావరణం అనుకూలించక అరకొర దిగుబడులతో ఎంతోకొంత నష్టం తప్పదని, భావిస్తున్న మినుము రైతులు ఆగకుండా వర్షం పడితే పంట పూర్తిగా చేతికి దక్కదని ఆందోళన చెందుతున్నారు. వర్షం అధికమయితే గింజలు పూర్తిగా బూజు వస్తాయని రైతులు వాపోతున్నారు. కొండమూరులో 500 ఎకరాల్లో మినుము కోత కోయాల్సి ఉందన్నారు. ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన మినుము వాతావరణ అనుకూలతలేక నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందని రైతు సంఘం జిల్లాకార్యదర్శి తలపనేని రామారావు అన్నారు.


దెబ్బతిన్న మినుము పైరును చూపుతున్న రైతులు

కొనుగోలుకు ముందే మండుతున్న బాణసంచా

- పెరిగిన ధరలతో కొనుగోలుదారులు బెంబేలు
- వర్షపు జల్లులతో దుకాణదారులు బేజారు

అద్దంకి, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): టపాసుల ధరలు ఇబ్బడి ముబ్బడిగా పెంచి అమ్మకాలు చేస్తుండడంతో బాణసంచా కొనుగోలుదారులు బెంబేలెత్తిపోతున్నారు. పట్టణంలోని బాణసంచా విక్రయాలకు పర్మినెంట్ లైసెన్స్ దుకాణాలు రెండు ఉండగా, తాత్కాలిక దుకాణాలు నిర్వహణకు 12 మంది లైసెన్సులు పొందారు. తాత్కాలిక లైసెన్స్‌లు పొందిన దుకాణదారులు అందరూ పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. ఒక్కో దుకాణదారుడు సరాసరిన రూ.2 లక్షల విలువైన సరుకును నిల్వ చేశారు. బాణసంచా అమ్మకం ధరలపై నియం త్రణ లేకపోవడం, ఎంఆర్‌పీ ధరలు భారీగా ము ద్రించి ఉండడంతో ఇష్టానుసారం ధరలకు అమ్మకాలు చేస్తున్నారు. దీంతో కొనుగోలుదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. వేల రూపాయలు వెచ్చించినా కొద్దిమొత్తంలో కూడా టపాసులు రావడం లేదని వాపోతున్నారు. అయితే ఆదివారం మధ్యాహ్నం వరకు వర్షపు జల్లులు పడుతూనే ఉండడం, సోమవారం కూడా వర్షం జల్లులు పడే అవకాశం ఉండటంతో అమ్మకం దారులు బెంబేలెత్తిపోతున్నారు. బాణసంచా మిగిలిపోతే సంవత్సరం పాటు భద్రపరచడం మరింత ఇబ్బందిగా మారుతుందని ఆందోళన చెందుతున్నారు. ఖర్చులు ఇబ్బడి ముబ్బడిగా ఉండటం, తాత్కాలిక లైసెన్స్‌లు పొందేందుకు ఖర్చులు పెరగడం, పలుశాఖల అధికారులు, సిబ్బందికి భారీగా మాముళ్ల ముట్టజెప్పడంతో పాటు బాణసంచా కూడా ఇవ్వాల్సి రావడంతో ఆ భారం మొత్తం వినియోగదారులపై మోపక తప్పడం లేదని వ్యాపారులు వ్యాఖ్యానిస్తున్నారు. సరుకు పూర్తిస్థాయి లో అమ్ముడు పోకపోతే తీ వ్రంగా నష్టపోవాల్సి వస్తుందనే ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం వరకు వేచి చూసి సరుకు మిగిలే పరిస్థితి ఉంటే ధరలు తగ్గించి అమ్మకాలు చేసేందుకు పలువురు దుకాణదారులు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. కొనుగోలు దారులు కూడా ఎక్కువ మంది సోమవారం సాయంత్రం వరకు వేచి చూచి కొనుగోలు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. మట్టి ప్రమీదలకు మంచి గిరాకీ నెలకొంది. పలు దుకాణాల వద్ద పెద్ద ఎత్తున మట్టి ప్రమిదలను కొనుగోలు చేస్తున్నారు.


అద్దంకి కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

వర్షంతో దుకాణదారుల గుండెల్లో గుబులు

పర్చూరు : దీపావళి మందుల అమ్మకాలు తమకు కలసి వస్తాయన్న ఆశతో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టుకున్న వ్యాపారులకు వర్షం ఒకింత ఆందోళనకు గురిచేస్తోంది. గత రాత్రి నుంచి పర్చూరు, కారంచేడు మండలాల పరిధిలో వర్షం కురవడంతోపాటు, వాతావరణం మేఘావృతం కావడంతో వ్యాపార దుకాణాలు వెలవెలబోయాయి. ఆదివారం సాయంత్రానికి వాతావరణం అనుకూలించటంతో పండుగరోజు అమ్మకాలపై కొండంత ఆశలు పెట్టుకున్నారు. మండల కేంద్రమైన పర్చూరు గతేడాదితో పోలిస్తే ఎక్కువ మోతాదులో బాణసంచా ఏర్పాటు చేసుకున్నారు. దీంతో దీపావళి మందుల దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులను వాతావరణం ఏమేరకు కనుకరిస్తుందో వేచిచూడాల్సి ఉంది.


పర్చూరులోని దీపావళి టపాసుల విక్రయశాల

ప్రజాసాహిత్య ఉద్యమాన్ని ముందుకుతీసుకెళ్లాలి

- జనసాహితీ రాష్ట్ర అధ్యక్షుడు దివికుమార్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పాలక వర్గాలు ప్రోత్సహిస్తున్న పతన సంస్కృతికి వ్యతిరేకంగా ప్ర జాసాహిత్య సాంస్కృతికోద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళాలని జనసాహితీ అధ్యక్షుడు దివికుమార్ పేర్కొన్నారు. ప్రజాసా హితీ మాసపత్రిక ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబా బు రచించిన వ్యాసాల సంకలనం ప్రజాసాహిత్యసాంస్కృతి కోద్యమం పుస్తకావిష్కరణ సభ ఆదివారం స్థానిక ఈమని పాలెంలోని తరిమెల నాగిరెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సం దర్భంగా దివికుమార్ మాట్లాడుతూ వర్తమాన సమాజాన్ని కాలంచెల్లిన భూస్వామ్య, సామ్రాజ్యవాద విధానాలు అనేక రూపాల్లో పీడిత ప్రజల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజలకు అవసరం లేని వస్తువులను అంటగట్టి వస్తు వ్యామోహ సంస్కృతిని జనం మీద రుద్దుతు న్నారని ఆరోపించారు. పాలకులు కార్పొరేట్‌ల కోసం సరళీ కరణ ప్రైవేటీకరణ విధానాలను తీసుకువచ్చారని విమర్శిం చారు. కోశాధికారి శాంతికుమార్, జిల్లా కార్యదర్శి ప్రసన్న, సభ్యులు డీవీ.సత్యనారాయణ, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి తీవ్రగాయాలు

దొనకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి ఐదుగురు తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని కొచ్చెర్లకోట గ్రామ సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని నారపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన 15 మంది తిరుపతి దైవదర్శనం చేసుకొని తిరిగి శనివారం రాత్రి మార్కాపురంలో బస్సు దిగా రు. అక్కడ నుంచి స్వగ్రామమైన నారపురెడ్డిపల్లెకు ఆటో మాట్లాడుకొని బయలుదేరారు. మరో పది ని మిషాల్లో గ్రామం చేరుతుందనగా రోడ్డుకు అడ్డంగా పంది రావటంతో ఢీకొని ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు, ముగ్గురు పెద్దలు తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 సి బ్బంది మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తర లించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరుకు తరలించారు. ఎస్‌ఐ త్యాగరాజు కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదానికి గురైన ఆటో

టీడీపీ గ్రామ అధ్యక్షుల నియామకం

- రాష్ట్రకార్యదర్శి పల్లా శ్రీనివాసరావు ఉత్తర్వులు

నాగులుప్పలపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నాగులు ప్పలపాడు మండలంలోని ఆరు గ్రామాలకు తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు, కార్యదర్శులను నూతనంగా నియమిస్తూ రాష్ట్ర కార్యదర్శి పల్లా శ్రీనివాసరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే నాగులుప్పలపాడుకు మాత్రం ప్రకటించలేదు. మిగిలిన గ్రామాలకు ప్రస్తుత అధ్యక్షులను కొనసాగిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉప్పుగుండూరు గ్రామ అధ్యక్షుడిగా కనగాల శ్రీనివాస రావు, ప్రధానకార్యదర్శి గా జంజనం సుబ్బయ్య, చీర్వానుప్పలపాడు అధ్యక్షుడిగా ఆళ్ల సాంబయ్య, ప్రధానకార్యదర్శిగా యమర్తి మహేష్, కండ్లగుంట గ్రామ అధ్యక్షుడిగా గుడిబండి ప్రభుదాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా దారా సురేష్, బి.నిడమానూరు అధ్యక్షుడిగా నలమల పు అంకిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా లక్కెనబోయిన సౌలు, ఎం. ముప్పాళ్ల అధ్యక్షుడిగా మండవ వెంకటేశ్వరరావు, ప్రధాన కా ర్యదర్శిగా పులిపాటి బాబు, కె.తక్కెళ్లపాడు అధ్యక్షుడిగా నూతలపాటి శివశంకర్, ప్రధానకార్యదర్శిగా మద్దిరాల వీరాస్వా మిలను నియమిస్తూ ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కార్యాలయం నియామక ప్రకటన జారీ చేసింది.

ప్రజలకు మంత్రి దీపావళి శుభాకాంక్షలు

అద్దంకి,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి అన్ని కుటుంబాలలో సంతోషాన్ని, కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.



పర్యాటక అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ వినోద్‌కుమార్

వేటపాలెం (చీరాల), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకరంగం అభివృద్ధితో పాటు పర్యాటకుల రక్షణకు సంబంధించి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ చెప్పారు. ఆదివారం వేటపాలెం మండలం పొట్టిసుబ్బయ్య పాలెం తీరంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పొట్టిసుబ్బయ్యపాలెం నుంచి రామాపురం బీచ్ వరకు రోడ్డును విస్తరించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని, అధికారులకు సూచించారు. అలాగే మత్స్యకారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమయంలో చెన్నై నుంచి అనధికారంగా తీరంలోకి చొరబడి వేట సాగించడంతో పాటు దాడుల కు పాల్పడుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకొ చ్చారు. ఇదిలా ఉంటే గజ ఈతగాళ్లకు లైఫ్ జాకెట్స్, విజిల్స్ అందజేయాలని, బీచ్ ఫ్లైడ్ లైట్స్, పర్యాటకుల వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట వేటపాలెం తహసీల్దార్ గీతారాణీ, ఎంపీడీవో రాజేష్ బాబు, తదితర మత్స్యశాఖ అధికారులు ఉన్నారు.


మత్స్యకారులతో మాట్లాడుతున్న కలెక్టర్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు

పుణ్యస్నానాల ఏర్పాట్లుపై అప్రమత్తం

● ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీవో

వాడరేవు(చీరాల) : కార్తీక మాసం సందర్భంగా ఆదివారం తీరంలో భద్రతా ఏర్పాట్లపై ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ పరిశీలించారు. ఇటీవల ఐదుగురు తీరంలో మృత్యువాత పడిన ఘటన పాఠకులకు విదితమే. ఈనేపథ్యంలో నియంత్రణ చర్యలపై శనివారం అధికారులతో ఎమ్మెల్యే కొండయ్య కూడా సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలోనే ఆదివారం అధికారులు తీరంలో పర్యటించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పర్యాటకుల రక్షణే లక్ష్యంగా విధులు నిర్వహించాలని సూచించారు. వారి వెంట మెరైన్, ఫిషరీస్ విభాగ సిబ్బంది, గజ ఈతగాళ్లు ఉన్నారు.

సమాజంలో హేతబద్ధ ఆలోచనలు అవసరం

● ఘనంగా హేతువాద సంఘ జిల్లా మహాసభ


మాట్లాడుతున్న హేతువాద సంఘ నాయకులు

చీరాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : భిన్నమార్గాల్లో సాగుతున్న ప్రజాస్వామ్యంలో హేతబద్ధమైన ఆలోచన సరళి చాలా అవసరమని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో జిల్లా హేతువాద సంఘం 3వ మహాసభలు ఘనంగా నిర్వహించారు. 'మతవిశ్వాసాలు - హేతువాదం' అనే అంశంపై చర్చించారు. సమాజం ప్రగతిశీలంగా ముందుకు పోవాలంటే ప్రతి ఒక్కరూ హేతువాద దృక్పథంతో ఆలోచించాలన్నారు. చిన్నతనంలోనే తార్కిక జ్ఞానం ఉండేలా విద్యాబోధన సాగాలన్నారు. కార్యక్రమంలో కరణం రవీంద్రబాబు, షేక్ బాబు, బాచిన కిషోర్, యలమందారెడ్డి, సత్యనారాయణ, దరియావలి, రామ్మూర్తి, రాజశేఖర్, చైతన్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.




ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షణీయం

పర్చూరు తాలూకా ఎన్‌జీవో అధ్యక్షులు సుధాకర్

పర్చూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగల సమస్యపై స్పందించి దీపావళి కానుకగా, నవంబరు నెల నుంచి ఒక డీఏను విడుదల చేసేవిధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఏపీ ఎన్‌జీవోస్ పర్చూరు మండల తాలూకా అధ్యక్ష కార్యదర్శులు తాళ్లూరి సుధాకర్, చెరుకూరి ప్రేమ్ చంద్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి మండుగకు ముందే ఉద్యోగుల సమస్యపై సంఘ ప్రతినిధులతో స్నేహపూరితంగా చర్చించి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. చైల్డ్ కేర్ లీవ్‌పై ముఖ్యమంత్రి చేసిన ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపిందన్నారు.


అద్దంకి : ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షణీయం అని ఏపీ ఎన్‌జీవోల సంఘం అద్దంకి తాలూకా యూనిట్ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్, కార్యదర్శి టి.రమేష్‌బాబు అన్నారు. దీపావళి కానుకగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏ విడుదల చేయటం, పలు సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించడం ఉద్యోగులలో ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. 5 సంవత్సరాల తరువాత ఉద్యోగుల సమస్యలపై ఈ స్థాయిలో చర్చించడం సంతోషించ తగిన విషయమన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లలో ఆనందాన్ని కలిగించే విషయం అన్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రులు సత్యకుమార్, నాదెండ్ల మనోహర్, చీఫ్ సెక్రటరీ విజయానంద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సురేష్‌బాబు

నాగులుప్పలపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కొంజేటి సురేష్‌బాబు ఎన్నికయ్యారు. విజయవాడలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలలో సంఘం నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక నిర్వ హించారు. రాష్ట్ర కార్యదర్శిగా కొంజేటి సురేష్‌బాబు, కమిటీ సభ్యులుగా అమరా వేణులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేశా రు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన కొంజేటి సురేష్ బాబు, కమిటీ సభ్యులు అమరా వేణులను రాష్ట్ర మంత్రి టీజీ.భరత్, మాజీ మంత్రి టీజీ.వెంకటేష్, ప లువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా స త్కరించారు.


సురేష్‌బాబును అభినందిస్తున్న నాయకులు







భీమవరంలో నేత్రదానం

ఇంకొల్లు,అక్టోబరు 18,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీమవరంలో ఆదివారం నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన తోటకూర రంగారావు (52) మృతి చెందగా ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు కుటుంబ సభ్యుల అంగీకారంతో మృతుని నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన భార్య హేమలత, తల్లి రత్నకుమారి, మంజుదత్త, సోదరులు మోహనకృష్ణ, విజయభాస్కర్ కుటుంబసభ్యులను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, రోటరీక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బలగం కోటేశ్వరరావు, అలవల రాఘవరెడ్డి, క్లబ్ సభ్యులు అభినందించారు.










శాలివాహనులు ఐక్యంగా ఉండాలి

దర్శి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) శాలివాహనులు ఐక్యంగా ముం దుకు సాగి అభివృద్ధి పథంలో పయనించాలని కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ పి.ఈశ్వర్ అ న్నారు. దర్శిలో ఆదివా రం జరిగిన నియోజకవర్గస్థాయి శాలివాహనుల ఆత్మీయ సమావేశం లో ఆయన మాట్లాడారు. శాలివాహనుల అభివృద్ధికి శక్తి వంచలేకుం డా కృషి చేస్తానన్నారు. దర్శి పట్టణానికి చెందిన మాడపాకుల శ్రీనివాసులు రాష్ట్ర కుమ్మర కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం ఆనందదాయకమన్నారు.







పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- చిననాటి స్నేహాలను గుర్తుచేసున్న బాల్యమిత్రులు

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండల పరిధిలోని అన్నంబొట్లవారిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పాఠశాలకు చెందిన 1989-1994 విద్యార్థులు చిననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొంటూ ఒకరినికరు ఆప్యాయంగా పలకరించారు. యోగాక్షేమాలు అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. నాటి ఉపాధ్యాయులతో సహపంక్తి భోజనం చేశారు. అనంతరం తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి, గురువుల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ఏ.శేషగిరిరావు, ఎస్కే.కాలేషావలి, వేణు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశమైన పూర్వ విద్యార్థులు



దీపావళికి సర్వంసిద్ధం

- చీరాల పరిధిలో 52 దుకాణాలకు అనుమతులు
- ప్రమాదాలపై ముమ్మరంగా అవగాహన


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చీరాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దీపావళీ పర్వదినానికి సంబంధించి సర్వం సిద్ధమైంది. ఏటా భారీ టపాసులు, విద్యుత్ అలంకరణలతో అంగరంగ వైభవంగా నిర్వహించే వేడుకలకు ఈ ఏడాది కూడా ముస్తాబైంది. ఈ నేపథ్యంలో ఆయా టపాసుల విక్రయాలుకు సంబంధించి చీరాల అగ్నిమాపక కేంద్రం పరిధిలో చీరాల పట్టణంలో 32, జాండ్రపేటలో 8, వేటపాలెంలో 1, చినగంజాంలో 3, ఇంకొల్లు 3, పర్చూరు 3 దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. అలాగే ప్రమాదాల నియంత్రణకు సంబంధించి కూడా జాగ్రత్తలు సూచిస్తున్నారు. ఈనేపధ్యంలోనే ఆదివారం స్టేషన్ పరిధిలో అగ్నిమాపక అధికారి రామకృష్ణ ఆదేశాల మేరకు సిబ్బంది ప్రమాదాల నియంత్రణకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అందుకు సంబంధించిన కరపత్రాలు కూడా పంపిణీ చేశారు. బాణసంచా కాల్చే సమయంలో కాటన్ దుస్తులు, కళ్ల జోడు ధరించాలని చెబుతున్నారు. మంటలు వ్యాప్తి చెందే పెట్రోల్ బంకు, గడ్డివాములు, పూరి గుడిసెలు వంటి వాటికి దూరంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



లైసెన్స్ లేకుండా దీపావళి మందులు అమ్మితే చర్యలు


మార్టూరులో ఏర్పాటు చేసిన దీపావళి దుకాణాలు

మార్టూరు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : లైసెన్స్ లేకుండా దీపావళి మందులను అమ్మడానికి దుకాణాలను ఏర్పాటుచేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.శేషగిరి రావు హెచ్చరించారు సోమవారం దీపావళి పండుగ సందర్భంగా ఆదివారం మండలంలోని మార్టూరు, వలపర్ల గ్రామాలలో దీపావళి మందుల అమ్మకాల దుకాణాలను ఏర్పాటుచేశారు. వాటిని ఆదివారం సీఐ ఎం.శేషగిరిరావు పరిశీలించారు. ఆయా షాపుల వద్ద కొనుగోలు దారులు వచ్చినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలను యజమానులకు వివరించారు. ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం వర్షపు జల్లులు పడడంతో దీపావళి మందుల దుకాణాలు వారు కొంచెంసేపు ఆందోళనకు గురయ్యారు. వర్షం కురిస్తే దీపావళి మందులకు కొనుగోలుదారులు రారని, తద్వారా నష్టపోతామని ఆందోళనకు గురయ్యారు. అయితే ఎట్టకేలకు కొంత వాతావరణం అనుకూలంగా ఉండడంతో యజమానులు ఊపిరి పీల్చుకున్నారు.

అనుమతులు లేకుంటే కఠిన చర్యలు

చినగంజాం : మండల పరిధిలో అనుమతులు లేకుండా నిబంధనలు ఉల్లంఘిస్తూ బాణసంచా విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శీలం రమేష్ హెచ్చరించారు. దుకాణాల వద్ద విద్యుత్ షాట్ సర్క్యూట్‌కు తావు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల పరిధిలో ఎక్కడైనా అక్రమంగా బాణాసంచా నిల్వలు, విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత ప్రమాణాల మేరకు ప్రత్యేక దుకాణాలలో మాత్రమే విక్రయాలు నిర్వహించాలన్నారు.







ప్రాణాలు పోతున్నా... ప్రజారక్షణే లక్ష్యం

- పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం
- జిల్లాలో ఈ ఏడాది అమరులైన 10 మంది పోలీసులు
- రేపు అమరవీరుల సంస్మరణ దినోత్సవం



వివరాలు 6లో..

నేడే దీపావళి

- బాణసంచా కొనుగోళ్లతో జనం బిజీబిజీ
- గతేడాది కంటే 20శాతం ధరల పెరుగుదల
- ఈసారి వరుణడి రాకతో మోగని టపాకాయలు

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చీకటిపై వెలుగు విజయాన్ని సూచించే పండుగదీపావళి. ఈ పండుగను ప్రజలంతా సోమవారం నిర్వహించనున్నారు. ఇందుకుగాను బాణసంచా కొనుగోళ్లలో జనం బిజీబిజీగా ఉన్నారు నరకాసురుడిపై శ్రీకృష్ణుడు విజయం సాధించిన సందర్భంగా దీపావళి జరుపుకుంటారు. అలాగే త్రేతాయుగంలో శ్రీరాముడు 14 ఏళ్ల అరణ్యవాసం అనంతరం అయోధ్యకు వచ్చిన సందర్భంగా అయోధ్యవాసులంతా నగరంలో దీపాలు వెలిగించి

మిగతా 6లో..



నెల్లూరు వీఆర్సీ మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద బాణసంచా కొనుగోలు చేస్తున్న ప్రజలు



భారీ వర్షం

- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- లోతట్టు ప్రాంతాల జలమయం
- బంగాళాఖాతంలో అల్పపీడనం
- వాయుగుండంగా మారే అవకాశం
- 23 నుంచి భారీ వర్షాలు : కలెక్టర్


నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈశాన్య రుతుపవనాలు జిల్లాలో ప్రవేశించడంతో మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నారు. సోమవారం దీపావళి కావటంతో టపాసులు కొనుగోలు చేయడానికి వచ్చినవారు వర్షంలో ఇబ్బందులు పడ్డారు. కాగా జిల్లాలో ఆదివారం సగటు వర్షపాతం 49.1 మి,మీగా నమోదైంది. అత్యధికంగా సంగంలో 140.6 మి.మీ, అత్యల్పంగా సైదాపురంలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. నెల్లూరు అర్బన్‌లో 93.4, కోవూరులో 96.2, బోగోలులో 93.2, నెల్లూరు రూరల్‌లో 90.4, ఆత్మకూరులో 82.2, కలువాయిలో 80.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

● బంగాళాఖాతంలో అల్పపీడనం : కలెక్టర్


ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది మంగళవారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో జిల్లాలో ఈనెల 23 నుంచి 25 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. తీర ప్రాంతాల్లో గాలి వేగం 45 నుంచి 65 కి.మీ వరకు ఉండవచ్చని వివరించారు. తీర ప్రాంత గ్రామాల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకూడదని, సముద్రంలో ఉన్న మత్స్యకారులు తప్పనిసరిగా ఈనెల 21లోగా తీరానికి చేరుకోవాలని కోరారు. వాతావరణశాఖ సూచన మేరకు ఈనెల 21 నుంచి 23 తేదీల్లో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని ఆయన తెలిపారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.



నెల్లూరు : మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు జలమయమైన తల్పగిరి కాలనీ



సోమశిలకు వరద ముప్పు



సోమశిల నుంచి దిగువకు వదులుతున్న వరద నీరు

- పెన్నా క్యాచ్‌మెంట్‌లో విస్తారంగా వర్షాలు
- జలాశయానికి క్రమేణా పెరుగుతున్న వరద
- 4 నుంచి 5 లక్షల క్యూసెక్కులు వచ్చే అవకాశం
- గేట్ల దుస్థితిపై ఆందోళన
- తీరప్రాంత గ్రామాల ప్రజల అప్రమత్తం

అనంతసాగరం అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం క్రమేణా పెరుగుతోంది. పెన్నాతీర ప్రాంతాల్లో కురుస్తున వర్షాల కారణంగా, రానున్న 24 గంటల్లో నాలుగు నుంచి 5 లక్షల క్యూసెక్కులు సోమశిల వచ్చే సూచనలు ఉన్నట్లు ఇంజనీర్లు హెచ్చరికలు జారీచేశారు. అదే మొత్తంలో కిందకు వదిలే అవకాశం ఉన్నందున, తీరగ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు ఆర్డీవో పావని ఆదేశాలు జారీ చేశారు.

● గేట్ల దుస్థితిపై ఆందోళన

సోమశిల క్రస్ట్‌గేట్ల దుస్థితిపై అటు అధికారులు, ఇటు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొన్నిగేట్లు మొరాయిస్తుండగా, మరి కొన్నింటికి రోప్స్ దెబ్బతిన్నాయి. 4 నుంచి 5 లక్షల క్యూసెక్కుల వరద వస్తే, దిగువకు అంత ప్రవాహాన్ని వదలాంటే మొత్తం గేట్లు ఎత్తాలి. కాగా ప్రాజెక్టు పరిధిలో 11,12 గేట్లు మాత్రం రోప్‌ల డ్యామేజ్ వల్ల పైకి ఎత్తలేని పరిస్థితి నెలకొంది.

● సోమశిలలో 73.940 టీఎంసీలు

సోమశిలకు శనివారం 15,064 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా

మిగతా 6లో..













జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక



బాస్కెట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కందుకూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లా బాస్కెట్ బాల్ మహిళా, పురుషుల జట్ల ఎంపిక జరిగినట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వలేటి రవీంద్ర తెలిపారు. జిల్లా నుంచి 40 మంది పురుషులు, 30 మంది మహిళలు పాల్గొనగా ప్రతిభ కనపరిచిన 12 మంది చొప్పున జట్లు ఎంపిక చేశామన్నారు. ఎంపికైన జట్లు 11వ సీనియర్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పోటీలు నవంబరు 7 నుంచి 10వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ తొట్టెంపూడి సుబ్బారావు, సభ్యులు, పీడీలు పాల్గొన్నారు.

సర్వేయర్ల కొరతతో రైతుల అవస్థలు

లింగసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో సర్వేయర్ల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక పలు భూ వివాదాలు ఉన్న మండలంలో సర్వేయర్ల కొరత కారణంగా అటు అధికారులు, ఇటు రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా గత మూడేళ్ల నుండి మండలంలో మండల సర్వేయరు పోస్టు ఖాళీగా ఉంది. అయితే తరవాత కొన్ని నెలల పాటు ఇతర మండలాల సర్వేయర్లు అప్పుడప్పుడు ఇన్‌చార్జ్ మండల సర్వేయర్లుగా వ్యవహరించారు. ఇటీవల సుమారు ఏడాది నుండి ఈ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఇదిలా ఉండగా మండలంలోని 13 సచివాలయాలకు గాను ప్రస్తుతం నలుగురు సర్వేయర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గతంలో 13 సచివాలయాలకు 13 మంది సర్వేయర్లు ఉండగా, నలుగురు సర్వేయర్లు బదిలీపై వెళ్లిపోగా 9 మంది సర్వేయర్లు విధులు నిర్వహిస్తున్నారు. అయితే గత జూన్ నెలలో జరిగిన సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో ఏడుగురు సర్వేయర్లు బదిలీపై వెళ్లిపోగా, ఇద్దరు మాత్రమే మండలానికి బదిలీపై వచ్చారు. దీంతో నలుగురు సర్వేయర్లు మాత్రమే మిగిలారు. దీంతో సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. వీరి నలుగురిలో ఒకరు నారసింహాపురంలో భూముల రీసర్వే నిర్వహిస్తుండగా, మరొకరు చీమలపెంట రీసర్వే పూర్తి కాగా, వాటి ఫైనల్ రికార్డును తయారు చేస్తున్నారు. ఇక మిగిలిన ఇద్దరు సర్వేయర్లు స్వామిత్వ సర్వే చేస్తున్నారు. దీంతో రైతులు తమ భూములు కొలిపించుకోవాలంటే నానా అగచాట్లు పడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సర్వేయర్ల కొరత నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

డీఏ విడుదల హామీ హర్షణీయం

నెల్లూరు(విద్య/హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు ఉద్యోగులకు డీఏ విడుదలకు హామీ ఇవ్వడం హర్షణీయమని ఎన్‌టీఏ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎస్ తిరుమలయ్య, సీహెచ్ చెన్నయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్క డీఏ ఇచ్చినా అత్యంత గౌరవంగా ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియ చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

లక్ష్మయ్యనాయుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దివి



లక్ష్మయ్య నాయుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివరాం

కందుకూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి లక్ష్మయ్యనాయుడు హత్యకు గురికావడంతో కందుకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేస్తుందని, చోటు చేసుకున్న సంఘటనను అధిష్టానం దృష్టికి తీసుకెళ తానని పేర్కొన్నారు.

పోలీసు పహరాలో దారకానిపాడు

గుడ్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారకానిపాడు పోలీసు నిఘాలో ఉంది. హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మయ్యనాయుడి కుటుంబాన్ని ప్రముఖులు పరామర్శిస్తూ ఉండడంతో ఆగ్రామంలో పోలీసులు మోహరించారు. దీంతో గ్రామస్థులు అందోళన చెందుతున్నారు. కాగా, ఆదివారం ఇద్దరు మంత్రులు నారాయణ, అనిత గ్రామంలో పర్యటించారు. ప్రముఖులను గ్రామంలోకి అనుమతించకుండా గ్రామశివార్లలో పోలీసులు చేస్తున్న హడావుడిపై పలువురు నాయకులు మండిపడ్డారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేదుకు వెళుతుంటే, పోలీసులు అడ్డుకోవడం తగదని, రాధ-రంగా మిత్రమండలి నాయకులు వంగవీటి నరేంద్రకుమార్‌తో పాటు, వైసీపీ స్టేట్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కంపూడి రాజా అన్నారు. అతి కష్టమ్మీద బాధిత కుటుంబం వద్దకు చేరుకున్న వంగవీటి నరేంద్రకుమార్ మాట్లాడుతూ లక్ష్మయ్య నాయుడి కుటుంబాన్ని దారకానిపాడుకు చెందిన కాకర్ల హరిచంద్రప్రసాద్, అతని తండ్రి మాధవరావులు ఉద్దేశ్యపూర్వకంగానే కారుతో తొక్కించి చంపారని ఆరోపించారు. చంపిన, చంపడిన ఇద్దరు యువకులు ప్రాణస్నేహితులని, ఈ కేసును తప్పుదోవ పట్టించేందుకు కొందరు కథలు అల్లుతున్నారని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు, వివిధ రూపాల్లో పోరాటం చేస్తామన్నారు.

కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభం

వలేటివారిపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లో మండల వైసీపీ కన్వీనర్ అనుమోల లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించాలని సూచించారు. అందులో భాగంగా వైసీపీ నాయకులు మండలంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొట్టేళ్ల క్రిష్ణయ్య, నాగిరెడ్డి శివరామిరెడ్డి, ఇరపని అంజయ్య, పొట్టేళ్ల అంజయ్య, పోలినేని పాలెం ఎంపీటీసీ చింతలపూడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

దీపావళి ప్రతీ ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలి

● మంత్రులతోపాటు ప్రముఖుల శుభాకాంక్షలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బాణసంచాయే కాక వెలుగు పువ్వులు నింపే పర్యావరణ రహిత దీపావళి జరుపుకోవాలని ఆనం కోరారు. ప్రజలందరి జీవితాల్లో కష్టాల చీకట్లు తొలగిపోయి, సంతోషాల వెలుగులు ప్రసరించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆకాంక్షించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ జిల్లా, రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి సందర్భంగా పిల్లలంతా టపాకాయలను తల్లిదండ్రుల సమక్షంలో కాల్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలంతా కాలుష్య రహిత దీపావళి జరుపుకోవాలని సూచించారు.

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ ఇంటిలో సిరిసంపదలు నెలకొనాలని కోరారు. అలాగే జిల్లా ప్రజలకు ఇన్‌చార్జ్ మంత్రి ఎన్ఎండీ.ఫరూఖ్ దీపావళి శుభాకాంక్షలను తెలిపారు. బాణసంచా కాల్చేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలందరికీ దీపావళి సంతోషాల సంబరం కావాలని దేవ

నేడు దీపావళి

(5వ పేజీ తరువాయి)

స్వాగతం పలుకుతారు. బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. మన సంస్కృతికి ప్రతిబింబంగా కులమతాలకు అతీతంగా, చిన్నా పెద్దా వేడుకగా ఈ పర్వదినాన్ని నిర్వహించుకుంటారు. ఆబాలగోపాలం జిల్లాలో దీపావళి కోసం నూతన వస్త్రాలు, పిండి వంటలు, గృహాలంకరణలను సిద్ధం చేసుకున్నారు.



నరక చతుర్దశి సందర్భంగా నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఓ ఇంటి ముందు వెలిగించిన దీపాలు

● ఈరోజు చేయాల్సినవి..

● దీపావళి రోజున (నేడు) గృహాలను శుభ్రపరచుకోవడం, రంగులతో అలంకరించడం

● ఇంటాబయటా దీపాలు వెలిగించి, సుందరంగా అలంకరించడం.

● ఈరోజు సాయంత్రం గృహాలు, వ్యాపార దుకాణాల్లో లక్ష్మీదేవి పూజ చేయడం

● ఉదయం నూతన వస్త్రాలు ధరించడం, సాయంత్రం బాణసంచా కాల్చడం, మిఠాయిలు తినడం

బాణసంచా ధరలు పైపైకి..

దీపావళి అంటేనే టపాకాయల మోత. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా సుమారు రూ.4కోట్లకుపైగా వ్యాపారం జరుగుతుంది. స్థానికంగా తయారీతోపాటు శివకాశీ నుంచి బాణసంచాను జిల్లాకు దిగుమతి చేసుకుంటారు. ఈ పండుక్కకు 30రోజులకు ముందుగానే వ్యాపారం ప్రారంభమవుతుంది.కాగా ఈ ఏడాది బాణసంచా ధరలు తారాజువ్వాల్లా పైపైకి వెళ్లాయి. గత ఏడాది కంటే ఈసారి ధరలు 20శాతం పెరిగాయి. గతంలో ఓ కుటుంబం రూ.500లకు టపాకాయలు కొంటే రెండు, మూడు రోజులు కాల్చేవారు. ప్రస్తుతం రూ.3వేలకు కొన్నా అసంతృప్తిగానే ఉంది. అయితే మూడు రోజులుగా జిల్లాను వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఏదిఏమైనా ఉన్నంతలో ప్రజలంతా ఆనందంగా పండుగను జరుపుకోనున్నారు.

సోమశిలకు వరద ముప్పు

(5వ పేజీ తరువాయి)

ఆదివారం ఉదయానికి 15,827, మధ్యాహ్నానికి 23 క్యూసెక్కులుగా నమోదైంది. డ్యాం గేట్లు ఎత్తి 30 వేల క్యూసెక్కుల నీటిని కిందకు వదిలారు. సోమ, మంగళవారాల్లో ప్రవాహం భారీగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. డ్యాంలో ప్రస్తుతం 73.940 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టెన్నల్ ద్వారా మరో 2,600, ఉత్తర కాలువకు 50, కండలేరుకు వరద కాలువ ద్వారా 3,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

● కండలేరులో 59.930 టీఎంసీలు

రాపూరు : కండలేరు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.930 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ అనీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 2220 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 3050 క్యూసెక్కుల అవుట్ ఫ్లోగా ఉందని ఆయన తెలిపారు.

నీటి మళ్లింపుతో రోడ్డుపై ప్రవాహం

● పలు గ్రామాలకు రాకపోకలు బంద్

కలువాయి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కండలేరు నీటి మట్టం 60టీఎంసీలకు చేరడంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. సోమశిల-కండలేరు కాలువ ద్వారా వస్తున్న నీటిని పూర్తిగా కండలేరుకు చేరకుండా కొంతమేరకు పక్కకు మళ్లించారు. దీంతో పలు చెరువులు నిండి ఆనీరు రోడ్లపై ప్రవహిస్తున్నది. దీంతో మండలంలోని వెదనపర్తి, చిన్నగోపవరం, కేసీ గోపవరం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మూడె రోజులుగా వర్షాలు కురుస్తుండటం, సోమశిల నుంచి సుమారు 3వేల క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతుండటంతో కండలేరు డ్యాంలో నీరు అధికమయ్యాయి. దీంతో ఇబ్బందులు తలెత్తకుండా సోమశిల-కండలేరు కాలువ 43కి.మీ వద్ద నున్న గేట్లు ఎత్తి చవటపల్లి రిజర్వాయర్‌కు నీటిని మళ్లించారు. కండలేరు కాలువలో 2100 క్యూసెక్కుల ప్రవాహం ఉంది.



కలువాయి గోపవరం సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీటితో ఆగిపోయిన వాహనాలు

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించటం శుభపరిణామం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించటం శుభపరిణామమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి అన్నారు. ఆదివారం నగరంలోని ఐఎంఏ సమావేశ మందిరంలో ఏపీజీఈఏ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, పెన్షనర్లకు ఒక డీఏ ప్రకటించటం హర్షణీయమన్నారు. 12వ పీఆర్‌సీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు బీ.సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి పీవీఎస్‌టీ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీపతి

ప్రాణాలు పోతున్నా... ప్రజారక్షణే లక్ష్యం

● పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం ● జిల్లాలో ఈ ఏడాది అమరులైన పదిమంది పోలీసులు ● రేపు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రటి ఎండలోనూ... జోరు వానలోనూ... వణికించే చలిలోనూ... రాత్రింబవళ్లు తేడాలేకుండా 24గంటలూ ప్రజల కోసం బతికేవారే పోలీసులు. విధి నిర్వహణలో కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ, శాంతిభద్రతలే లక్ష్యంగా ప్రాణాలను సైతం లెక్కచేయనిపోలీసుల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ ఏడాది 10 మంది పోలీసులు విధులు నిర్వహిస్తూ ప్రాణాలు విడిచారు. ఈనెల 21న (మంగళవారం) పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

● పవిత్రస్థలం హాట్ స్ప్రింగ్

భారత్-చైనా సరిహద్దుల్లోని ఆక్సయ్‌చిన్ ప్రాంతంలో 16వేల అడుగుల ఎత్తున, రక్తం గడ్డకట్టే మంచుపర్వతాల మధ్యన ఉన్న (హాట్ స్ప్రింగ్) వేడినీటి బుగ్గ అమరవీరుల త్యాగాలకు ప్రతీకగా నిలిచింది. మిలటరీ ఎత్తుగడలకు చైనా సరిహద్దుల్లోని భారత భూభాగాలైన లడక్, సియాచిన్ ప్రాంతాలు కీలకమైనవి. సరిహద్దు భద్రతాదళం, ఇండో-టిబెటిన్ బోర్డర్ పోలీసు వంటి ప్రత్యేక భద్రతాదళాలు ఏర్పడకముందు సరిహద్దులను రక్షించే మహత్తర బాధ్యతను కేంద్రం రిజర్వ్ పోలీసు ఫోర్సు(సీఆర్‌పీఎఫ్) నిర్వహించేది. 1959 అక్టోబరు 21న డీఎస్పీ కరమ్‌సింగ్ నేతృత్వంలో 21మంది సభ్యుల బృందం సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తుండగా చైనా రక్షణ బలగాలు సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో సీఆర్‌పీఎఫ్ దళం హాట్‌స్ప్రింగ్ ప్రాంతంలో ఎదురొడ్డి పోరాడింది. ఆ పోరాటంలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. పోలీసు వీరుల రక్తంతో తడిసిన హాట్‌స్ప్రింగ్స్ నెత్తుటిబుగ్గగా మారి పవిత్రస్థలంగా రూపుదిద్దుకుంది. దీంతో ప్రతి ఏటా అన్నీ రాష్ట్రాల పోలీసులతో కూడిన బృందం ఈ పవిత్రస్థలాన్ని సందర్శించి నివాళులర్పించడం ఆనవాయితీ.

● జిల్లాలో అమరవీరులెందరో..

జిల్లాలో విధి నిర్వహణలో అసువులు బాసిన అమరవీరులెందరో ఉన్నారు. 1981లో అరెస్టు వారెంట్ జారీ చేయడానికి వెళ్లిన రెండో పట్టణ కానిస్టేబుల్ రామయ్యను ఓ రౌడీషీటర్ కత్తితో పొడిచి చంపాడు. 1985లో తడ ఎస్ఐగా పనిచేస్తున్న నాగేశ్వరరావును అక్రమ ధాన్యం రవాణా స్మగ్లర్లు లారీలతో ఢీకొట్టి చంపారు. 1991లో పోలీసు వ్యాన్ డ్రైవర్ వెంకటేశ్వర్లు తుపాకీ మిస్‌ఫైర్ అయ్యి మరణించారు. 1997లో వరికుంటపాడు ఎస్ఐ వెంకటేశ్వరరావును కొన్ని అసాంఘిక శక్తులు పోలీస్‌స్టేషన్‌లోనే గొడ్డళ్లతో నరికి చంపారు. 1994లో వెంకటగిరి బెటాలియన్‌కు చెందిన ఐదుగురు కానిస్టేబుళ్లు ఎన్నికల విధులు నిర్వహిస్తూ వరంగల్ జిల్లాలో నక్సలైట్ల మందుపాతరకు బలయ్యారు. 2006లో ప్రభుత్వ నగదును హైదరాబాద్‌లో అప్పగించి తిరుగు ప్రయాణంలో నల్గొండ జిల్లా చింతపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుళ్లు రామచంద్రయ్య, అరుణ్‌కుమార్, యుగంధర్, షరీఫ్, శ్రీనివాసులు ప్రాణాలు విడిచారు. 2008లో బలిమెల వద్ద జరిగిన మావోయిస్టుల కాల్పుల్లో కలువాయికి చెందిన కేశవులు అనే కానిస్టేబుల్ మృతి చెందాడు. 2010లో గుడ్లూరు పోలీసులు బిట్రగుంట దొంగలను తరుముతూ వస్తూ కావలి వద్ద ప్రమాదానికి గురై ముగ్గురు పోలీసులు సజీవదహనమయ్యారు. ఈ ఏడాది ఏఎస్పీ డ్రైవర్ రమేష్ గన్ మిస్‌ఫైర్ అయ్యి మృతి చెందాడు.



● ఈఏడాది 10 మంది అమరులు

గత అక్టోబరు నుంచి ఈఏడాది అక్టోబరు వరకు వివిధ కారణాలతో జిల్లాలో విధులు నిర్వహిస్తూ 10 మంది పోలీసులు మృతి చెందారు. నెల్లూరు డీఆర్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే యూ.శివకుమార్, ఏఎస్ పేట స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసే వై రమేష్, నవాబుపేట స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే ఎం. నాగయ్య, హెడ్‌కానిస్టేబుల్ ఎం. చలపతి, నవాబుపేట స్టేషన్ ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ కే. లక్ష్మీనారాయణ, ఉలవపాడుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ హెడ్‌కానిస్టేబుల్ డీ. రాజశేఖర్, కావలి రూరల్ స్టేషన్‌లో విధులు నిర్వహించే ఎస్ నాగరమేష్, నెల్లూరు డీఆర్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఎస్ అంకయ్య, నెల్లూరు డీఆర్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేసే కె రమేష్‌బాబు, నవాబుపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ జీ. శివకుమార్‌లో మృతి చెందారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం ఈ నెల 21న పోలీసు కవాత్తు మైదానంలో ఘనంగా నివాళులు అర్పించనుంది.

భానుచందర్ అకాల మరణం.. దగదర్తిలో విషాదం

● మాలేపాటి కుటుంబాన్ని పరామర్శించిన పలువురు నేతలు

దగదర్తి (బిట్రగుంట) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలంలో తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా నిలిచిన మాలేపాటి కుటుంబంలో యువ కిరణం అస్తమించడంతో చీకటి కమ్మినట్లయింది. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు కుమారుడు, టీడీపీ యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడు (38) శనివారం రాత్రి అకాల మరణం చెందాడు. భానుచందర్ మృతి వార్త తెలియడంతో స్థానిక టీడీపీ నేతలు, పలుపార్టీల నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. పేదల పాలిట పెద్దదిక్కుగా నిలిచే మాలేపాటి కుటుంబం నుంచి ప్రజాసేవలో ఎప్పుడూ ముందు వరుసలో ఉండే టీడీపీ యువనేత భానుచందర్ అనతికాలంలోనే ఎనలేని ప్రేమాభిమానాలు సంపాదించుకున్నారు. తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో బాబాయి మాలేపాటి సుబ్బానాయుడుకు కుడిభుజంగా ఉండేవారు. నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లోనే కాకుండా పార్టీ రాష్ట్ర నాయకులచే చిన్న వయసులోనే భానుచందర్ ప్రశంసలందుకున్నారు. ఇటీవల బాబాయి సుబ్బానాయుడు అనారోగ్యానికి గురవడం భానుచందర్‌ను మానసికంగా కుంగదీసిందని పెద్దలు చెబుతున్నారు. భానుచందర్ మృతదేహాన్ని దగదర్తిలోని స్వగృహానికి తీసుకొస్తున్నారని సమాచారం అందడంతో మాలేపాటి అభిమానులు, టీడీపీ పార్టీనేతలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కందుకూరి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్థన్‌రెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, బీద గిరిధర్, బోగోలు టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, బీజేపీ మండల కన్వీనర్ వీరాల శ్రీనివాసయాదవ్, కాంద్ర సతీశ్ నాయుడు తదితరులు భానుచందర్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోగోలు, దగదర్తి, అల్లూరు మండలాల నుంచి టీడీపీ, బీజేపీ నేతలు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



రవీంద్రనాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కాకర్ల సురేష్



భానుచందర్ నాయుడు(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో మాజీ మిలటరీ ఉద్యోగి మృతి

కావలి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మోటారు బైకుపై వెళుతుండగా గేదె అడ్డు రావడంతో ప్రమాదవశాత్తు మాజీ మిలటరీ ఉద్యోగి గోసాల కోటేశ్వరరావు(56) మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి కావలి మండలం కొత్తపల్లి సమీపంలో జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని సర్వాయపాలెం పంచాయతీ తాగేటివారిపాలెంకు చెందిన కోటేశ్వరరావు మోటారు బైకుపై లింగసముద్రం మండలం ముత్యాలపాడుకు వెళ్తుండగా ఒక్కసారిగా గేదె అడ్డురావటంతో బైకు అదుపుతప్పి కిందపడడంతో కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా చిన్నకుమారుడు మణికంఠ వివాహం ఈ నెల 11వ తేదీన జరిగింది. ఇంట్లో శుభకార్యం కూడా ముగియకముందే రోడ్డు ప్రమాదంలో కోటేశ్వరరావు మృతి చెందటంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. రూరల్ ఎస్ఐ బాజీబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

దగదర్తి (బిట్రగుంట) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం అల్లూరురోడ్డు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మారుబోయిన మనోజ్‌కుమార్(32) ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ జంపానికుమార్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. బోగోలు మండలం ముంగమూరు పంచాయతీకి చెందిన మనోజ్ దామవరంలోని బీఎంఆర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉదయం బైకుపై స్వగ్రామానికి వస్తుండగా ఫ్లైఓవర్ వద్ద మలుపులో అదుపుతప్పి కింద పడడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అల్లూరు రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జ్ ఎక్కే మలుపు రహదారి సరిగా లేకపోవండతో అక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ ప్రదేశంలో పలువురు మృతి చెందారు. అయినా సంబంధిత అధికారుల్లో చలనం లేదు. దాదాపు ఎనిమిదేళ్ల క్రితం పనుల నిమిత్తం మూసేసిన ఫ్లైఓవర్ బ్రిడ్జి విషయం పట్టించుకున్న నాథుడు లేడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేసి, ప్రజల ప్రాణాలు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేశామని జిల్లా పోలీసు కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. జిల్లా ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

వీవోఏ ఆత్మహత్యాయత్నం

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వెలుగు సీసీ లక్ష్మయ్య, కొంతమంది పొదుపు మహిళలు, స్థానికంగా ఉండే ఓ విలేఖరి తన తప్పు లేకపోయినా మానసికంగా వేధిస్తున్నారని వెలుగు వీవోఏ సెల్ఫీ వీడియో చిత్రీకరిస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని నందిపాడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నందిపాడు గ్రామంలోని ఓ పొదుపు గ్రూపునకు చెందిన కొంతమంది మహిళలు పొదుపు నగదు బ్యాంకులో జమ చేయకుండా స్వాహా చేశారని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇటీవల వెలుగు కార్యాలయంలో అధికారులు ఆ విషయమై విచారణ చేపట్టి ఎలాంటి స్వాహా చేయలేదని నిర్ధారించారన్నారు. అయితే సీసీ లక్ష్మయ్య, ఆ పొదుపు మహిళలు, స్థానికంగా ఉండే ఓ విలేఖరి మరలా తనపై అధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు లేనిపోని నిందారోపణలు వేస్తున్నారన్నారు. దీంతో మనస్తాపానికి గురైన రజియా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని, తనను వేధింపులకు గురిచేసిన వారి పేర్లు, వివరాలు సెల్ఫీ వీడియో ద్వారా వెల్లడిస్తూ ఉరి వేసుకునేందుకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను రక్షించారు. సెల్ఫీ వీడియో బయటకు రావడంతో వెంటనే స్పందించిన ఎస్ఐ ఆదిలక్ష్మి హుటాహుటిన పోలీసులను సంఘటనా స్థలానికి పంపి ఆమెను స్టేషన్‌కు తీసుకువచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. సంబంధిత అధికారులను విచారించిన అనంతరం కేసు నమోదు చేస్తామని ఆమె ఈ సందర్భంగా వివరించారు.

మహిమాన్వితం కార్తీకం !

● 22 మాసం నుంచి ప్రారంభం ● శివకేశవులకు ప్రీతిపాత్రం

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగు మాసాల్లో కార్తీకం మహిమాన్వితమైనదని స్కందపురాణంలో పేర్కొన్నారు. ఈనెల శివకేశవులకు ప్రీతిపాత్రమైంది. ఈ మాసమంతా పూజలు, వ్రతాలు, ఉపవాసాలు, వనభోజనాలతో ప్రజలు భక్తి పారవశ్యంతో మునిగిపోతారు.

'న కార్తీక సమో మాసః
న దేవం కేశవాత్పరం
న చ వేద సమం శాస్త్రం
న తీర్థం గంగా యాస్థమమ్

ఈ శ్లోకం అర్థం ఏమిటంటే.. కార్తీకమాసం వంటి మాసం లేదు. మహావిష్ణువుకు సమానమైన దేవుడు లేడు. వేదంతో సమానమైన శాస్త్రంలేదు. గంగతో సమానమైన తీర్థంలేదని... కార్తీకమాసమంతా పండుగలే. కార్తీకమాసం సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాల్లో రుద్రాభిషేకం, రుద్రపూజలు, లక్ష బిల్వదళ పూజలు, అమ్మవార్లకు లక్ష కుంకుమార్చనలు జరుగుతాయి. ఈ మాసంలో నదులు, చెరువుల్లో దీపాలను వదలడం వల్ల లక్ష్మీదేవీ అనుగ్రహం లభిస్తుంది.నదులు, చెరువులు, ఆలయాలు, లేదా ఇంట్లో తులసికోట వద్ద ప్రతీరోజు దీప దానం చేస్తారు. ఇందువల్ల జీవితంలో చీకట్లు తొలగి లక్ష్మీదేవి అనుగ్రహం కలిగి, సిరిసంపదలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష దీపోత్సవాలు నిర్వహిస్తారు. కార్తీకమాసం ఈనెల 22 నుంచి ప్రారంభమవుతోంది. 23న బలిపాడ్యమి, యమద్వితీయ, భగినీ హస్తభోజనం జరుపుకుంటారు. 25న నాగుల చవితి , నవంబరు 1 కార్తీక శుద్ధఏకాదశి, 2న చిలుక ద్వాదశి, తులసీ కల్యాణం, 4న వైకుంఠ చతుర్దశి, 5న కార్తీక పౌర్ణమి జరుపుకోనున్నారు. ఈ ఏడాది కార్తీకలో 4 సోమవారాలు వచ్చాయి. ఈనెల 22 నుంచి శివారాధనలకు శ్రీకారం చుడుతారు. ప్రాతఃకాలస్నానాలతో శివపూజలు, కార్తీక దీపారాధనలు ప్రారంభిస్తారు.



కమనీయం రంగనాథ కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. కేసీ దాస్ స్మారక సేవా సంస్థ అనుబంధ సంస్థ అయిన సనాతన ధర్మ వారధి ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. ధర్మాచార్య బ్రహ్మశ్రీ కల్వకొలను శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపారు. అనంతరం ఆయన కల్యాణ మహోత్సవం విశిష్టత, నిత్యపూజా విధానంపై ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా కల్యాణమూర్తులకు పుష్పయాగం చేశారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలుగా ఖండవల్లి రాధాకృష్ణ, పాటూరు రవికిరణ్, వేములపాటి నవీన్, పీ శివప్రసాద్, పోరూరి శ్రీనివాసరావు వ్యవహరించారు.



శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణం జరిపిస్తున్న ధర్మాచార్యులు శ్రీరామచంద్రమూర్తి

కనుల పండువగా ప్రాకారోత్సవం

తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం నరక చతుర్దశి, లయ ప్రాకారోత్సవాలు జరిగాయి. తొలుత రంగనాథస్వామికి గోపురోత్సవం, అనంతరం నరకాసుర వధ కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. దీపావళి సందర్భంగా ఆలయంలో సోమవారం ఉదయం రంగనాథస్వామికి తిరుమంజనం, సాయంత్రం 4.30 గంటలకు పేట ఉత్సవం జరుగుతాయన్నారు.

రాష్ట్ర ఆర్చరీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికకు సంబంధించిన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. సబ్‌జూనియర్ ఇండియన్ రౌండ్ బాలుర విభాగంలో జి.వెంకట లోకేష్, ఎన్.శశాంక్, జి.మహిధర్, డి.శశిధర్, వి.మోక్షితసాయి, ఎ.సాత్విక్‌లు, బాలికల విభాగంలో వై.దీత్యా చండిక, ఎ.ప్రీతి, ఎ.ఆలియా, ఎన్.షణ్ముఖ, ఎం.కౌషికి, కె.తన్వి సాయి అశ్విని ఎంపికయ్యారు. సబ్‌జూనియర్ రికర్వ్ రౌండ్ బాలుర విభాగంలో కె.తరుణీష్‌జాత్యా, పి.రాజేష్, కె.చరిత్, సీహెచ్.అక్షయ్ మహదేవ్, ఎస్‌కె.కౌషిద్ అహ్మద్, డి.చరణ్, బాలికల విభాగంలో డి.నిష్విత ఎంపికయ్యారు. కాంపౌండ్ రౌండ్ బాలుర విభాగంలో టి.రమేష్‌కుమార్, బి.వికాస్, ఎం.చైతన్య విష్ణు ఎంపికయ్యారు. ఎంపిక చేసిన జట్లు విజయవాడలో నవంబరు 1 నుంచి జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు తెలిపారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అదుపుతప్పి మినీ లారీ బోల్తా : డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

దుత్తలూరు (ఉదయగిరి), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెడ్డుపాడు సమీపాన 565 జాతీయ రహదారిపై పిల్లాపేరు వంతెన వద్ద మినీ లారీ బోల్తాపడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కర్నూల్ నుంచి ఒడిస్సాకు టమోటా లోడుతో వెళుతున్న మినీ లారీ పిల్లాపేరు వంతెన సమీపానికి రాగానే అదుపుతప్పి హైవే లైనింగ్ వాల్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది అంబులెన్స్‌లో అతన్ని చికిత్స నిమిత్తం ప్రకాశం జిల్లా పామూరుకు తరలించారు.

భారీ వర్షానికి విరిగి పడిన కొండ చరియలు

సంగం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగం కొండ మధ్య వెళ్లే ముంబాయి జాతీయ రహదారిపై శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొండ చరియలు విరిగి పడ్డాయి. అయితే ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రాజేష్ వెంటనే వెళ్లి బండరాళ్లను రోడ్డు పక్కకు తరలించారు. వర్షాల సమయంలో కొండ మధ్య వెళ్లేటప్పుడు వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు.